
ంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణాలు

22-2-'56

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



'స్విమ్మింగ్ పూల్
(మద్రాసు, సెంటినరీహాలులో ఫొటోగ్రఫీ ప్రదర్శనంలో ప్రదర్శితమైనది. ఫొటో: ఆర్. పి. ధమీజా)

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 25
22-2-56

మన్మథ మాఘ శుద్ధ ఏకాదశి బుధవారం



ఈ నెల 11, 12 తేదీలలో షాహిద్‌నగర్ (అమృతసర్)లో కాంగ్రెస్ 61-వ మహాసభ జరిగింది. ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి విధానాలు, రాష్ట్రాల పునర్నిర్మాణం, మొదలైన ప్రముఖ సమస్యలపై చర్చలు, తీర్మానాలు జరిగిన ఈ మహాసభ చరిత్రాత్మకమైనది. షాహిద్‌నగర్‌లో బహిరంగసభ ఆవరణకు పోయేద్వారం ఛాయాచిత్రంలో చూడవచ్చును.

విషయానుక్రమణిక

★"పథేర్ పాంచాలీ" అనేదానికి "పథగీతం" అని ఒకవిధంగా అర్థం చెప్పవచ్చు. సుఖదుఃఖాల, ఆశానిరాశల సమ్మేళనమైన జీవయాత్ర ఛందోబద్ధం, నియమబద్ధంకాని సహజ విచిత్ర సరళిలో సాగిపోతుంది. దీనిని సూచించడానికే రచయిత ఈపేరు పెట్టాడు. 'పాంచాలీ' గీతాలనబడే పల్లెపదాలు బెంగాలీలో కొన్ని ఉన్నాయి. రాగతాళాలతో నిమిత్తంలేకుండా సహజమధురగాత్రంలోనే బెంగాల్ పల్లెపట్టుల తరుణీతరుణులు పొలాలలో, తోటలలో, నదీతటాలవద్ద పాంచాలీ గీతాలు పాడుకుంటారు.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక

భారతదేశం ఆర్థికవ్యవస్థను సర్వతోముఖంగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశింపబడిన ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోని ముఖ్య విషయాలను సంగ్రహంగా ప్రణాళిక రచనా సంఘంవారు ఇటీవల ప్రకటించారు.

ద్వితీయ ప్రణాళికా కాలంలో (1956-61) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ. 4800 కోట్లను ఖర్చు పెడతాయి. ప్రైవేటు పారిశ్రామికులు రూ. 2300 కోట్లు ఖర్చు చేస్తారు.

భారతదేశంలో సోషలిస్టు సమాజవ్యవస్థను స్థాపించడమనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ద్వితీయ ప్రణాళిక రచించబడింది. ప్రణాళికద్వారా సిద్ధించవలసిన ముఖ్యాశయాలివి: జీవనస్థాయిని పెంపొందించేందుకుగాను జాతీయాదాయాన్ని చెప్పుకోదగినంతగా వృద్ధిచేయడం; భారీ యంత్రాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలను ముఖ్యంగా ఎంచుతూ, అతి త్వరితంగా దేశాన్ని పారిశ్రామిక దేశంగా మార్చి వెయ్యడం; ఉద్యోగావకాశాలను విరివిగా వృద్ధిచెయ్యడం; ఆదాయాలలో ఉన్న అసమానతను తగ్గిస్తూ, ఆర్థికమైన పలుకుబడిని వీలైనంత సమానంగా సమాజమంతటా పంచడం.

మున్ముందు ఆర్థికాభివృద్ధికి దోహదం చేసేందుకుగాను ప్రధానంగా పరిశ్రమలను, గనుల సంపదను వృద్ధిచెయ్యడం ప్రణాళిక లక్ష్యాలలో ఒకటి.

ప్రభుత్వరంగంలో ఖర్చు చేయబడే రూ 4800 కోట్లలోను పరిశ్రమలు, గనుల త్రవ్వకాలు, రవాణాసౌకర్యాల అభివృద్ధికి 48% కేటాయించబడింది. నీటి వసరులకు, విద్యుచ్ఛక్తివృద్ధికి 18%, కమ్యూనిటీ ప్రాజెక్టులు, జాతీయవిస్తరణ కార్యక్రమం, వ్యవసాయం అభివృద్ధికి 12%, గృహనిర్మాణం, పునరావాసం మొదలైన సంఘసేవా కార్యక్రమాలకు 20% కేటాయించబడింది.

ప్రథమప్రణాళిక ఫలితాలు

ప్రథమ పంచవర్షప్రణాళిక మొత్తంమీద విజయాలు సాధించినదనే చెప్పాలి. వ్యవసాయికంగాను, పారిశ్రామికంగాను ఉత్పత్తి పెరిగింది. ధరలలో విపరీతమైన మార్పులు లేకుండా నిలకడగా ఉన్నాయి ప్రణాళిక నిర్దేశించిన ముఖ్యమైన లక్ష్యాలు నెరవేరాయి. కొన్ని సందర్భాలలో, అనుకున్న ప్రమాణాలకంటె ఎక్కువగానే ఉత్పత్తి పెరిగింది. ఆ అయిదేళ్లలోనూ 170 లక్షల ఎకరాలభూమికి నీటివసర్లు లభించాయి. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 23 లక్షల నుండి 35 లక్షల కిలోవాట్లకు పెరిగింది. రైల్వేల మరమ్మతు కలాపాలు చాలవరకు జయప్రదమైనవి. ప్రభుత్వరంగంలోను, ప్రైవేటు రంగంలోను అనేక కర్మాగారాలు ఉత్పత్తి ప్రారంభించాయి

గడచిన అయిదేళ్ళలోనూ జాతీయాదాయం 11% మాత్రమే పెరుగుతుందని ఆశించినా 18% దాకా పెరిగింది. అసలు ప్రథమ ప్రణాళిక కార్యక్రమానికి ప్రజల నుండి ఎంతో సహకారం లభించింది.

ద్వితీయ ప్రణాళిక

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక కొన్ని లక్ష్యాలను, ఉత్పత్తి ప్రమాణాలను నిర్దేశిస్తోంది. వ్యావసాయిక రంగంలో 210 లక్షల ఎకరాలకు నీటిపారుదల లభించేట్లు చేయాలని సంకల్పించబడింది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని ప్రణాళికా కాలం అంతమయ్యేనాటికి 35 లక్షల నుండి 68 లక్షల కిలోవాట్లకు పెంచాలని నిర్దేశించబడింది. రైల్వే శాఖలో సరకుల రవాణాను 34%, ప్రయాణ మార్గాలను 15% వృద్ధిచేయాలి. కమ్యూనిటీ ప్రాజెక్టులు, జాతీయ విస్తరణ కార్యక్రమం క్రిందికి వచ్చే జనాభాను 8 కోట్ల నుండి 35 కోట్లకు వృద్ధి చేయాలి. ఇక ముఖ్యమైన ఉక్కు ఉత్పత్తికి సంబంధించినంత వరకూ ప్రభుత్వ పారిశ్రామిక రంగంలో 20 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని నిర్దేశింపబడింది. పారిశ్రామిక ఉత్పత్తి విషయంలో (1) ఇనుము, ఉక్కు ఉత్పత్తిని అధికం చేయడం, యంత్రనిర్మాణం, ఇంజనీరింగ్ పరికరాలు, రసాయన సామగ్రులు, నైట్రోజన్ ఎరువులు వృద్ధిచేయడం. (2) అభివృద్ధి కార్యక్రమానికి అవసరమైన సిమెంటు, ఫాస్ఫేట్ ఎరువులు మొదలైనవానిని వృద్ధిచేయడం. (3) జనపనార, ప్రత్తి, పంచదార మొదలైనవాని ఉత్పత్తిని నవీన పద్ధతులలో అభివృద్ధి చేయడం. (4) ప్రస్తుత పరిశ్రమలలో సాధ్యమైనంత గరిష్ఠ ఉత్పత్తిని సాధించడం. (5) ప్రజోపయోగ వస్తువులను తయారుచేసే కర్మాగారాలలో గరిష్ఠ ఉత్పత్తిని సాధించడం—ఇవన్నీ ద్వితీయ ప్రణాళికలో నిర్దేశింపబడిన లక్ష్యాలు.

వివిధ కార్యక్రమాల ఖర్చుల అంచనా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన అభివృద్ధి వ్యయం రూ. 4800 కోట్లు ఈ క్రింది విధంగా కేటాయించారు.

రాష్ట్రాలకు కేటాయింపులు

వివిధ రాష్ట్రప్రభుత్వాలు ద్వితీయ ప్రణాళికఅమలుకు ఖర్చుచేయవలసిన మొత్తాలను ఈ దిగువవిధంగా నిర్ణయించారు.

	తొలిప్రణాళిక (కోట్లు)	రెండోప్రణాళిక (కోట్లు)
వ్యవసాయం, సమాజాభివృద్ధి	372	565
నీటివసర్లు, వరదనివారణ	395	458
విద్యుచ్ఛక్తి	266	440
పరిశ్రమలు, ఖనిజాలు	179	891
రవాణా, కమ్యూనికేషన్లు	556	1384
సంఘసేవా కార్యక్రమాలు, గృహనిర్మాణం, పునరావాసం	547	946
ఇతర కార్యక్రమాలు	41	116
మొత్తం	2356	4800

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

భారత ప్రధానమంత్రి అమృతసర్ కాంగ్రెసుకు బయలుదేరి వెళ్ళిపోవడంతో న్యూఢిల్లీ నగరంలో కలకలం తగ్గిపోయింది. అప్పుడే వేసంకాలం సూచనలు కనిపిస్తున్నాయి. న్యూఢిల్లీలో ఫిబ్రవరి చాలా హాయిగా ఉంటుంది. ఎటు చూసినా చెట్లు పువ్వులతో కలకలలాడుతూంటాయి.

ప్రభుత్వాధికారుల ప్రచారం

ఇటీవల ప్రభుత్వాధికారులు కూడా ప్రచారకులుగా మారి పోతున్నారు. ఈ మధ్యన ఒక సమావేశంలో రైల్వే అధికారులు సిమెంటు, ఉక్కు తగినంతగా దొరకకపోవడంవల్ల తమ కార్యక్రమాలేవీ కొనసాగడం లేదని వాపోయారు. నీటి పారుదల శాఖలకు సంబంధించిన ఇంజనీర్లు కూడా ఇదే ధోరణిలో ప్రసంగిస్తున్నారు.

ఉక్కు సిమెంటు సప్లయి వ్యవహారాలేవీ ఒక ప్రభుత్వ రహస్యంలా కనబడడం లేదు. ఇది పాకిస్తానుకు కూడా తెలిసిపోయింది. ఈ విషయంలో అమెరికా రాయబార కార్యాలయం ఒక తొక్కు అనుబంధ పత్రిక కూడా ప్రకటించి వేసింది.

భారత వాణిజ్యశాఖ మంత్రి 1955-56 సంవత్సరాంతంలో భారతదేశానికి కావలసిన ఉక్కు సిమెంటు దిగుమతులను గురించి పార్లమెంటులో నే గాక బయటకూడా బాహాటంగా వెల్లడి చేశారు.

కేంద్ర మంత్రివర్గ సమిష్టి బాధ్యత

కేంద్ర మంత్రివర్గం సమిష్టి బాధ్యత మీదనే వ్యవహరించాలని మన రాజ్యాంగ చట్టం విధిస్తున్నది. సమిష్టి బాధ్యతకు సమిష్టి సంప్రదింపులు చాలా అవసరం. ఈ సంప్రదాయం ప్రకారం రైల్వే ప్రణాళికలు గాని నీటి పారుదల ప్రణాళికలు గాని సమిష్టి సంప్రదింపుల ద్వారానే ఏర్పాటు చేయాలి. ఈ సంప్రదింపులలో ఆ ప్రణాళికల అవసరానికి కావలసిన ఉక్కు, సిమెంటు సప్లయి సరఫరాలను గమనించి ముందుగానే జాగ్రత్తపడి ఉండవలసింది.

ఈ మధ్యన, శ్రీ చక్రవర్తి అంతర్జాతీయంగా ఒక పెట్టుబడి సహాయసంస్థ ఏర్పాటు చెయ్యబడినదనీ దానిలో భారతదేశానికి సభ్యత్వం ఉండగలదనీ ప్రకటించారు. దీనిని గురించి ఆర్థికమంత్రి శ్రీ చింతామణ్ దేశ్‌ముఖ్ పార్లమెంటులో ప్రసంగించిన పిమ్మట గత నవంబరులోనే ఈ వివరాలన్నీ వెల్లడించడం జరిగిపోయింది.

విద్యాశాఖలో వింత!

కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో విద్యాశాఖకు చాలా తక్కువ మొత్తం కేటాయించడం జరిగిందని విమర్శించారు. అయితే కేంద్ర విద్యాసంఘ సభ్యులకు కేంద్ర విద్యామంత్రివర్గం ఇటీవల పంపించిన లేఖలు కొన్ని పరిశీలిస్తే విద్యాశాఖకు కేటాయించిన మొత్తాలు కూడా పూర్తిగా వినియోగించుకోవడం లేదని స్పష్టపడిపోయింది. సంవత్సరాంతంలో ఆ మొత్తాలు తిరిగి ప్రభుత్వానికి అప్పగించి వెయ్యడం జరిగింది.

ఆంగ్లభాషపై తిరుగుబాట్లు!

పూర్వం ఒక ఆంగ్లపత్రిక సంపాదకుడు చట్టప్రకారం ఆంగ్లరాజుపై యుద్ధం ప్రకటించడానికి వీలులేదనీ అందువల్ల ఆంగ్ల భాషపై యుద్ధం ప్రకటిస్తున్నాననీ అన్నాడు.

ఋషివర్యులు అందయించిన ఈ దేశంలో ఇంగ్లీషు అసలే పనికిరాదని కొందరు కొర్ర గర్గోలు లేవదీస్తున్నారు. ఇంగ్లీషులో శైలి, భాష మొదలైనవాటిని గురించి కూడా ఈ పెద్ద మనుషులు వేళాకోళం చేస్తూంటారు. అంతటితో ఆగలేమని కొందరు ఇంగ్లీషు వ్యాకరణంకూడా గంగలో కలిపేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన సైనిక సమాచార్‌లో పేజీకైనా ఉదాహరణ లివ్వవచ్చును. ఇటువంటి అత్యద్భుతమైన ఆంగ్ల భాష రచించినవారు సైనిక సమాచార శాఖలో కొత్తగా చేరిన మేజర్. వి. యస్. మణి!

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక

ఆంధ్ర	116 2	కోట్లు
అస్సాము	56.4	,,
బీహారు	192.9	,,
బొంబాయి	264 4	,,
మధ్యప్రదేశ్	126 8	,,
మద్రాసు	170.8	,,
ఒరిస్సా	97.8	,,
పంజాబు	126.2	,,
ఉత్తరప్రదేశ్	248.6	,,
పశ్చిమ బెంగాల్	152.5	,,
మొత్తం	1548.1	,,

బి. తరగతి రాష్ట్రాలు 529.8 కోట్లు; సి. తరగతి రాష్ట్రాలు 105.2 కోట్లు; అండమాన్, నికోబార్, ఈశాన్య ఏజెన్సీ, పుదుచ్చేరి కలిసి 19.2 కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించారు. దామోదరలోయ ఖర్చులో కేంద్రం 12.2 కోట్ల వ్యయం భరిస్తుంది. ఈ మొత్తాలన్నీ కలిసి రూ. 2214 కోట్లు.

ద్వితీయ ప్రణాళిక అంతమయ్యే నాటికి జాతీయాదాయం రూ. 10,800 కోట్లనుండి రూ. 13,480 కోట్లకు పెరుగుతుందని అంచనా వేయబడింది. అనగా 25% పెరుగుతుందన్న మాట.

ద్వితీయ ప్రణాళికకు ఆర్థికాధారాలు

ప్రణాళిక అమలుకు అవసరమైన రూ. 4800 కోట్లను ఈ క్రిందివిధంగా సేకరించాలని తాత్కాలిక నిర్ణయం చేయబడింది.

(అంకెలు కోట్లలో)

1. ప్రస్తుత ఆదాయాలనుంచి అదనపు సొమ్ము		800
అ. ప్రస్తుత పన్నుల రేట్ల ప్రకారం	350	
ఆ. అదనపు పన్నులు	450	
2. ప్రజల్నుంచి తీసుకునే ఋణాలు		1200
అ. మార్కెటు ఋణాలు 700		
ఆ. చిన్న నిలవలు 500		
3. ఇతర బడ్జెట్ ఆధారాలు		400
అ. రైల్వేలద్వారా అభివృద్ధి కార్యక్రమానికి వచ్చేసొమ్ము	150	
ఆ. ప్రావిడెంట్ ఫండు మొదలైన ఇతర నిలవల రీత్యా	250	
4. విదేశీ సహాయం		800
5. అధిక నోట్ల చెలామణీ		1200
6. భర్తీ కావలసిన మిగిలేది		400
మొత్తం		4800

నౌకా నిర్మాణ పరిశ్రమ

మాష్టర్ భారత నౌకా పరిశ్రమ బాగా అభివృద్ధి పొందించాలని పదేపదే చెబుతూంటారు ఈయనకు మన నౌకా నిర్మాణ పరిశ్రమఅంటే వల్లమాలిన అభిమానం. ఈమధ్య వీరొక ప్రకటనచేస్తూ ఈ పరిశ్రమ జాతీయం కావచ్చునని ఒక సూచనచేశారు. మర్నాడు మన జాతీయ దినపత్రికలలో ఇలాంటి ఆపత్తేమీ లేదని భరవసా ఇస్తూ పెద్ద పెద్ద సందేశాలు ప్రకటించారు. ఇలా ఉండగా కాంగ్రెస్ అధ్యక్షులు ఢేబర్ అమృతసర్ కాంగ్రెస్ సమావేశంలో సామ్యవాద వ్యవస్థ పెంపొందించే కార్యక్రమం ఏర్పాటు చెయ్యబడగలదని తిరిగి మరొక్కమారు ఉద్ఘాటించారు.

జాతీయం చెయ్యడం

ఈ విషయంలో కొంత లోతుగా ఆలోచిస్తే ఒక్క విషయం స్పష్టపడుతున్నది. కేంద్రప్రభుత్వ ఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశముఖ్ కాంగ్రెసు లక్ష్యానికి అనుగుణంగా దేశంలో సామ్యవాదవ్యవస్థ రూపొందించడానికి కావలసిన కట్టుదిట్టాలన్నీ చేస్తున్నారు. ఇటీవల ఇంపీరియల్ బ్యాంకు జాతీయం చెయ్యడంలోను, భీమా వ్యాపారం జాతీయం చెయ్యడంలోను, పన్నుల విధానాలలోను ఇది బాగా స్పష్టపడుతున్నది.

ఇక మిగిలిన కాంగ్రెసు మంత్రులలో చాలామంది ప్రయివేట్ పారిశ్రామికరంగం అభివృద్ధి పొందించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వాణిజ్యరంగంలో బాగా పెద్దపేరు సంపాదించిన ప్రముఖుడొకడు శ్రీ చింతామణి దేశముఖ్‌ను ఆర్థిక మంత్రి పదవినించి తొలగించి, ఆస్థానంలో కాంగ్రెసు మరెవరినైనా నియమించాలని ప్రచారం చేస్తున్నాడు. ఇది చాలా జాగ్రత్తగా గమనించవలసిన విషయం!

నౌకా నిర్మాణ పరిశ్రమ

నౌకానిర్మాణ పరిశ్రమ జాతీయం చెయ్యాలని మన ప్రణాళిక సంఘంఅప్పుడే ఒక నిశ్చయానికి వచ్చివేసింది. కాని ఈపరిశ్రమ ఇప్పటికీ ఇంకా బాల్యావస్థలోనే ఉన్నది. దేశంలో నౌకానిర్మాణ వ్యాపారం సాగించే వ్యాపారస్థులకు ప్రభుత్వం ఇంకా సహాయం చెయ్యవలసిన అవసరం కలుగుతూనే ఉంది.

దుబారా ఖర్చు

రైల్వేలు, విమాన సంస్థలు జాతీయం చెయ్యడాని కంతకుపూర్వమే కోట్లకొలది ధనం గుమ్మరించారు. ఇలా నౌకా నిర్మాణ పరిశ్రమ జాతీయం చెయ్యడానికి ఇంకా కోట్లకొలది ధనం ఖర్చుపెట్టాలి. ఈ సామ్యవాదవ్యవస్థలో ప్రస్తుతంమనకుకలుగుతున్న లాభాలివి! ప్రస్తుతం దేశం అంతటా ఇది ఒక పెద్ద గాలి దుమారంలా చెలరేగుతున్నది.

* * *

ఈమధ్యన న్యూఢిల్లీలో తెలివి తేటలు ఉపయోగించ నవసరంలేకుండా పబ్బంగడుపుకోడానికి కొన్నికొన్ని మార్గాలుకూడా కనుక్కున్నారు. ఇటీవల సమాచారశాఖలో ఒక్క కొత్తసంప్రదాయం బయలుదేరింది. ఆయా విషయాలనుగురించి మంత్రివర్గాల ప్రత్యేక సాంకేతిక పత్రికలలో నిపుణులు ప్రకటించిన వ్యాసాలన్నీ ఈ సమాచార శాఖవారు 'భాగీరథి' అనే పేరుతో నలుగురికీ అందజేస్తున్నారు! అధమం నెలకు రెండు వ్యాసాలైనా ఈవిధంగా అందజెయ్యడం జరుగుతున్నది. ★

దేవదాసి

ప్రాచీన గాథావళి

పి. గణపతిశాస్త్రి

౧

నాటిరాత్రి కార్తికేయ దేవాలయంలో దేవదాసి వకుళమాలిక నృత్యోత్సవం! ఆ ఉత్సవం ప్రారంభమై అయిదారురోజులే అయింది. ఐనా పౌండ్రవర్ధన నగర పౌరుల హృదయాలలో ఆ వార్త కార్చిచ్చులా వ్యాపించి వారి లోలోపల యౌవనోన్మాదాలు రేకెత్తించింది!

వకుళమాలిక ఆవేళ అపరాహ్ణం అంతా అలంకరణతోనే గడిపివేసింది. చెలికత్తె కమల ఆమె కన్నెన్నోమారు అలంకరించింది. జడగంటలు, ముత్యాలహారాలు, ఇతరాలంకారాలు సరికొత్త తీరులతో సరిదిద్దింది. అయినా వకుళమాలిక కవేమీ నచ్చలేదు!

కమల మళ్ళీ మొదటినుంచీ అలంకరణ ప్రారంభించింది. అయినా వకుళమాలిక ఏవేవో వంకలు పెడుతూనే ఉంది. కమల కిక ప్రాణం విసిగిపోయింది.

ఒక కుంచికతో ఆమె పాదాలకు మందారవర్ణం లత్తుక పూసింది. ఆ పాదాలకు పైపైన చిన్నచిన్న జాజిపూల చిత్తరువులు చిత్రించింది. వకుళమాలిక కాపూలరేకుల తీరు లంతగా నచ్చలేదు! కమలకేమీ పాలుపోలేదు.

కుంచిక లాక్షారసపాత్రికలో ఉంచి ఒక చిరునవ్వు చిలకరించి మెల్లగా అడిగింది: "ఏమిటే! వకుళా! ఈ సన్నాహం అంతా! ఏమిటె కథ!"

వకుళమాలిక దానికి తిన్నగా సమాధానం చెప్పలేదు!

"త్వరగా కానీ! అప్పుడే సూర్యాస్తమానం కూడా అయిపోయింది! ఈ వేళ కూడ వేళ మించిపోతూంది!"

"కమల ఆమెకేసి అలాగే కొంటెగా చూసింది. అంతేగాని అలంకరణ సాగలేదు. అది అక్కడే నిలిచిపోయింది. కమల ఆమెకేసి బాగా పరిశీలనగా చూసి—

"నాకుకూడా తెలియనీయకుండా దాచి పెడుతున్నావా! సరేలే!" అంది.

వకుళమాలిక కిక వేరేదారి కనబడలేదు!

"నేనొక మాట అడుగుతాను గాని— వేళాకోళం చెయ్యకూడదూ!"

"నిజం చెబితే నీకు వేళాకోళంలాగే కనబడుతుందిలే!"

"సరే! కాని, నీకెప్పుడయినా ఎవరిమీదయినా అనురాగం కలిగిందా?"

"అనురాగమా? అంటే!"

కమల పకపకా నవ్వింది.

"చాల్చాలులే కొంటెవేషాలు!"

"నిజమే! నేనింతవర కెప్పుడు ఈ మాట వినలేదు. అయినాగాని మన కనురాగాలు ఏమిటే! నీకేమైనా మతిగాని పోయిందా?"

వకుళమాలిక ఒక నిట్టూర్పు విడిచింది. తరవాత ఆమె అరచేతిపై చెక్కిలి ఆన్చి ఎదురుగా గాలిలో మెల్లిగా కదలాడే పంచరంగుల చిలక బంగారుపంజరంకేసి పరధ్యానంగా చూసింది.

కమల మళ్ళీ ఆమె పాదాలపై లాక్షా చిత్రణ మొదలు పెట్టింది.

వకుళమాలిక కొంత సేపటిదాకా ఆమె చిత్తరువుల సొగసు పరిశీలించింది. అంతేగాని ఏమీ మాట్లాడలేదు.

అది కార్తిక మాసం. సాయంకాలం మంచు ముసుగులో నగరంలో కార్తీకదీప తోరణాల వెలుగులు కొంచెం కొంచెం కనలు దేరాయి. సమీప దేవాలయాల్లో నృత్యోత్సవ కోలాహలాలు వినవస్తున్నాయి. కమల అలాగే ఎంతో శ్రద్ధగా ఆమె పాదాలపై లత్తుక చిత్తరువులు చిత్రించింది. అంతలో ఆమె శిరస్సుపై ఒక వేడి కన్నీటిచుక్క పడింది.

కమల తల పైకెత్తి చూచింది. వకుళమాలిక చెక్కిలిపై ఇంకొక కన్నీటి చుక్క దిగజారింది.

"నీకు నిజంగా మతిపోయింది! సందేహం లేదు!" అన్నది కమల అలాగే కొంటెగా చూస్తూ.

వకుళమాలిక కొంత తెలినవ్వు తెచ్చుకొని పైపై కొక చిరునవ్వు నవ్వింది.

"నా మతికేంగాని, ఆ సంగతి తేల్చావా?"

"ఏ సంగతి!"

"ఆ రాజకుమారుని సంగతి!"

"అతడేమీ అంతటి రాజకుమారుడు కాడులే! కాశ్మీర చక్రవర్తి జయాపీడదేవుని పదాతిసైన్యంలో సామాన్య యోధుడుగా ఉండేవాడట! ఇక ఇప్పుడదీ లేదు!"

"మరి పేరో!"

"విజయవర్మ"

"విజయవర్మా! చక్కని పేరే! అయితే క్షత్రియ కుమారుడేనన్న మాట!"

"కాని రాజకుమారుడు మాత్రం కాదు!"

"ఇవన్నీ నీకెలా తెలిశాయో!"

"కర్ణాకర్ణిగా నే విన్నాను."

"ఇంతా చేసి నీ వాయనతో మాట్లాడనే లేదా?"

"లేదు!"

"ఏదో వ్రతంపట్టి పుణ్యతీర్థాలు సేవిస్తున్నాడట! ఆ వ్రతం ఉద్యాపన కావాలట!"

"వకుళమాలిక కొక్కసారిగా చిరాకు తలకెక్కింది.

"మగరాయుడికి వ్రతాలు, ఉద్యాపనలు ఏమిటే!"

"అదేమి విడ్డూరమోనమ్మా! నాకేం తెలుసు!"

"ఇందులో నీ కల్పన కొంత!"

"చివరికిదంతా నా మీదే విరుచుపడుతుందని నాకు ముందే తెలుసునులే!"

అని కమల మూతి బిగించింది తరవాత లత్తుక చిత్తరువులు కూడా ముగించింది. పిమ్మట ముంగురులలో ముత్యాల అలంకరణ ఉపక్రమించింది.

"వకుళీమాలిక మళ్ళీ అడిగింది. "మరి నేటి రాత్రి నృత్యోత్సవాని కాయన వస్తేనా?"

"ఆ మగరాయుడి కంతకన్నా వేరే రాచకార్యమేమీ ఉన్నట్టు కనబడదే!"

"అయితే—అంత బెట్టెందుకో!"

"నిజమే మరి! దేనికయినా పట్టు విడుపు ఉండాలి!"

కమల అలంకరణ అంతా చాలవరకు ముగిసిపోయింది. ఇంతలో ఒక పరిచారిక బంగారు పళ్లెంలో సరికొత్త నగలు, రత్నహారాలు, చీనీచీనాంబరాలు తీసుకువచ్చి, వకుళమాలిక పాదాలకు దగ్గరగా

తన్నకంబళంమీద ఉంచింది. ఆమె అదిచూచి నిర్ఘాంతపోయింది.

"ఎవరే ఇవి పంపినవారు!"

"అమ్మగారు!"

"అవునులే! పైవారి మాట అనుకుంటున్నాను!"

"శ్రేష్ఠి చందనగుప్తుడు!"

"ఇక ఇలాంటివి తీసుకురావద్దని నీతో చెప్పలేదా?"

పరిచారిక వాడిలిపోయింది

"అవునమ్మా! చెప్పాను! కాని అమ్మగారు మీతో మరీమరీ చెప్పమని పంపించారు!"

కమల ఆ కానుకలకేసి చూసింది. ఆమె కళ్లు చెదిరిపోయాయి. మెల్లిగా దేవదాసి అలంకరణ ముగించివేస్తూ ఇలాగంది:

"చందనగుప్తుడు సార్వభౌమ వ్యాపారంలో కోటికి పడగెత్తిన కుబేరుడు! తెలిసిందా!"

"అయితే?"

"వకుళా! నామాట వినవుగాని—ఉన్నమాట అనేస్తున్నాను! సరిరా మోకాలొడ్డుతున్నా వీవేళ!"

వకుళమాలిక దురుసుగా సమాధానము చెప్పింది:

"సరే! నీపని కానీ! చీరసింగారం అయ్యేసరికి ఊరు మాటుమణిగి పోతుంది!"

కమల మరి మాటాడడానికి సాహసించలేదు!

ఇంతలో ఇంకొక పరిచారిక వచ్చి బెదిరిపోతూ ఇలాగ విన్నవించింది:

"అమ్మగారు ఎలాగయినా ఒక్కసారి లోపలికి రమ్మంటున్నారు."

"నే నిప్పుడు కాలైనా కదపడానికి వీలులేదు! ఉత్సవానికి వేళ మించిపోయిందని చెప్పు! పో!"

ఆ పరిచారిక కాలి బొటనవ్రేలితో నేలమీద రాస్తూ అలాగే నిలుచుండిపోయింది!

"ఏం కదలవేం! మాట విన్పడటం లేదా!"

ఆ పరిచారిక లోపలికి వెళ్లిపోయింది.

కమల అలంకారం ముగించి ఒక సువర్ణ దర్పణం చేతపట్టుకుని ఆమెముందు నిలబడింది.

ఇంతలో అంతకుపూర్వం వెళ్ళిన పరిచారిక మళ్ళీ తిరిగివచ్చి, బెదురుతూ బెదురుతూ దేవదాసి కెదురుగా నిలబడింది.

వకుళమాలిక మండిపడింది.

ఏం! మళ్ళీ ఎందుకు వచ్చావే!"

"శ్రేష్ఠి చందనగుప్తులు మీకోసం వేచి ఉన్నారట! అమ్మగారా కొత్తనగ లలంకరించుకొని ఎలాగయినా ఒక్కసారి లోపలికి రమ్మన్నారు!"

వకుళమాలిక పాదాల దగ్గర ఆ బంగారు పళ్లెం ఆ సరికొత్త నగలతో తళతళా మెరిసింది. ఆమె ఒకసారి వాటికేసి చూసింది.

వకుళ లోలోపలి కోపం రెచ్చిపోయింది.

"ఇప్పుడు వీలుపడదని చెప్పు! నాకేవీ అక్కరలేదు! పో! తీసుకుపో!"

పరిచారిక తటపటాయించి—

"అమ్మగారు నొక్కి నొక్కి చెప్పమన్నారు" అంది.

అంతే! వకుళమాలిక ఆ పళ్లెం అంచుమీద కాలికొద్దీ ఒక్క తాపు తన్నింది! అది ఎదురుగా ఉన్న గోడకు తగిలి టంగని మారుమోగింది! నగలు నాలుగుమూలలా చెదిరిపోయాయి.

"పో! తీసుకుపో! ఆ పళ్లెం! మరి నా ఎదట నిలబడకు!" అని అరిచింది దేవదాసి! ఆ పరిచారిక చిందర వందరగా చెదిరిన ముత్యాలహారాలా పళ్లెంలో పదిలపరిచి అది చేత బుచ్చుకుని తొందర తొందరగా అక్కడినించి వెళ్లిపోయింది.

కమల లోలోపలి నవ్వంతా కుంభనగా ఒక చిరునవ్వులో స్తంభింపజేసి కొంటెగా ఇలాగన్నది:

"ఇందాకటికంటె ఈ కోపంలో నే ఎంతో సొగసుగా కనిపిస్తున్నావే! నా మాట నమ్మకం లేకపోతే ఈ అద్దంలో ఒకమారు చూసుకో!"

వకుళమాలిక కమల చెంపమీద మెల్లిగా ఒకటి వడ్డించబోయింది. అంతలో నే అద్దానికి దగ్గరగా నిలబడి చెదిరిన ముంగురులు ముత్యాలహారాలు సరిదిద్దుకుని—

"కమలా! నిజంగా నే నీవేళ అంత సొగసుగా ఉన్నానా?" అంది ఎంతో జాలిగా.

"ఉత్తది! ఊరికే వేళాకోళాని కన్నాను గాని—ఒక్క చిన్న ముద్దు పెట్టుకోనా!"

వకుళమాలిక ఒక నిట్టూర్పు విడిచింది.

"ఈ కొంటెమాటలకేంగాని ఎలాగైనా ఆ విజయవర్మనొక్కమారిక్కడకి తోడుకు రాగలవా?"

వకుళమాలిక మళ్ళీ నిట్టూర్చింది!

"అదిమాత్రం నావల్లగాదు! అంత ఛాందస పురుషుణ్ణి నే నెక్కడా కనీ వినీ ఎరగను!"

"ఇంతేనా? మరి నీ చాతుర్యం!"

కమల ఒక నిమిషం కొంచెం లోతుగా ఆలోచించింది.

"దేవుడు మేలుచేసి—ఒకవేళ తీసుకు రాగలిగితేనో?"

"ఇదిగో! ముత్యాలహారం!" అని ఆమె తన మెడలో ముత్యాలహారం తీసి కమల మెడలో వేయబోయింది!

"ఏదీ! ఆ మహానుభావుడు విజయవర్మ ఇక్కడికి వేంచేయనీ! అప్పుడు వేద్దువు గానిలే!"

"అప్పుడింకొకటి!" అని వకుళమాలిక ఆ హారం కమల మెడలో వేసింది!

కమల ముక్కుమీద వేలు వేసుకుని అదే పనిగా నవ్వడం మొదలు పెట్టింది. ఇంతలో ఒక పరిచారిక దీపం వెలిగించి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. కమల ఇంకా అలాగే నవ్వుతూంది! ఆ దీపకాంతిలో వకుళమాలిక

దేవదాసి

అలంకారాలన్నీ తళతళా మెరిశాయి. ఆమె కమలకేసి ఒక నిమిషం విస్తుపోయి చూసింది.

"ఎందుకే ఆ నవ్వు?"

"ఇంత అందకత్తెవు గదా! ఎందుకే నీకింతటి బేలతనం!"

"నీవే అన్నావుగదా! అది మాత్రం నావల్ల గాదని!"

"అంతమాత్రానికే ఇంత తొందరా!"

ఇంతలో దూరదూరంగా కార్తికేయ దేవాలయస్వామి సంధ్యానృత్య సేవా సూచకంగా పెద్ద శంఖధ్వని మారుమోగింది.

వకుళమాలిక "అదిగో శంఖధ్వని విన్నావా! పద! పద! పోదాం!" అని తొందర చేసింది.

కమల తొందర తొందరగా వీధి గుమ్మంలో దేవదాసి కర్ణీరథం సిద్ధం చేయించి తిరిగి వచ్చింది. వకుళమాలిక తొందరగా నడిచి వెళ్ళి కమలతో బాటా కర్ణీరథంలో కూర్చున్నది అది శరవేగంతో కార్తికేయ దేవాలయంవైపు వెళ్ళిపోయింది!

౨

కార్తికేయ దేవాలయంలో ఆ రాత్రి దేవదాసి చేసిననృత్యం చూచి సభాస్తారులు సమ్మోహితులై శిలాప్రతిమలైనారు. ఆనాడామె శివతాండవము, దారుకావనవిహారం మొదలయిన శివలీలలెన్నో అభినయించింది. పిమ్మట పార్వతీ పరిణయఘట్టం అభినయించడం ప్రారంభించింది. అది అంతకుపూర్వం చేసిన నృత్యాలన్నిటికన్నా బాగా రక్తి కట్టింది. అందులోను అనంగదహనానికి పూర్వం పార్వతీదేవి ముగ్ధానురాగాభినయంలో ఆమె చూపిన హావభావప్రకటన చూచి, సభ్యులటువంటినృత్యం 'నభూతో నభవిష్యతి' అనుకున్నారు. వారంతా 'శివహా' అని మెచ్చుకోడానికైనా వీలు లేనంత తన్మయతలో పడిపోయారు!

దేవాలయ నృత్యమండపం జాజ్వల్యమానంగా వెలిగిపోతున్న దీపకాంతులతో కన్నులపండువుగా కలకలలాడింది. నృత్యమండపం స్తంభాలమీద శిల్పులు చెక్కిన అచ్చరల ప్రతిమలా నృత్యం చూచి విస్తుపోతున్నట్లున్నాయి. నాట్యమండపం గోడలమీద చిత్రించిన చిత్తరువులా కాంతులలో అప్పుడే చిత్రించినట్లు మెరిసిపోతున్నాయి.

వీణా వేణు మృదంగాల మేళవింపులో వకుళమాలిక చరణమంజీరాల సవ్వడులన్నీ ఏకమై ఒకేతీరుగా మారుమోగుతున్నాయి. ఆ నృత్యావేశంలో ఆమె హృదయంమీది ముత్యాలహారాలు, మొలనూలి మువ్వలు, కాలిగజ్జెలు, ముప్పేట జడగంటలు ఒకే లయలో ధ్వనిస్తూ దీపాల కాంతులలో తళతళ మెరిసిపోతున్నాయి. దేవదాసి కుమారస్వామి కభిముఖంగా నిలబడి నృత్యం చేస్తూ నృత్యంఅంతా ఆ దేవదేవునికొక కర్పూర హారతిలా సమర్పిస్తున్నది. ఆ వేయి స్తంభాల నాట్యమండపంలో గుమిగూడిన వేలాది సదస్యుల నేత్రాలన్నీ ఆ నృత్యానికనుగుణంగా ఆయా మనోభావాలభివ్యక్తం చేస్తున్నాయి. ఆ సభలో ఎక్కడా ఒక్క నిశ్వాసం విడిచిన సవ్వడి కూడా వినబడటంలేదు! సదస్యుల నేత్రాలన్నీ వకుళమాలిక నృత్యానికంకితమైపోయాయి.

కాని కమలకదేమీ పట్టినట్టు లేదు! ఆమె కనురెప్ప వాల్చకుండా అలాగే విజయవర్మకేసి చూస్తున్నది. అతడు నృత్యవేదికకల్లంత దూరంలో ఎవ్వరూ లేనిచోట ఒక స్తంభాని కానుకొని కూర్చుని, ఎంతో ఆసక్తిగా ఆనృత్యం చూచి ఆనందిస్తున్నాడు. కమల బాగా పరిశీలనగా అతన్ని పరకాయించి చూచింది.

దేవదాసి నృత్యలయ కనుగుణంగా అతని వేళ్ళు స్తంభంమీద తాళంవేస్తున్నాయి! శరీరం అంతటా యోధవేషం. విశాలమైన నేత్రాలు, బలిష్ఠమైన శరీరం, పసి నిమ్మపండువంటి దేహచ్ఛాయ, కొంచెం కొనదేలిన సమున్నత నాసిక. చెవులచివర చిన్న చిన్న పైడి కుండలాలు. నూనూగు మీసాల నూత్న యౌవనం!

"వకుళమాలిక చేసిన ఎన్నిక మంచిదే! కాని కోటికి పడగెత్తిన చందన గుప్తునికీ ఈ యువకునకూ హస్తిమశకాంతరం!" అని ఏమేమో ఆలోచించించింది కమల. అంతలో ఆమె కళ్ళెదురుగా వకుళమాలిక వాగ్దానం చేసిన ముత్యాలహారం ముప్పేటలతోను మెరిసినట్లయింది! ఆమె అది ఎలాగైనా సాధించితీరాలని నిశ్చయించింది. ఎలాగైనా ఏదో ఒక మిష కల్పించుకొని విజయవర్మతో ప్రసంగించాలని ఆమె సంకల్పించింది కాని ఇంతవరకు ఆ అవకాశం దొరకలేదు!

విజయవర్మ చేతివేళ్ళతో స్తంభంమీద తాళంవేస్తూ పరధ్యానంగా కుడిచేయి చాచాడు. తన భవంతిలో ఆవిధంగా చేయి చాచినప్పుడు తాంబూల కరండక వాహిని అతని చేతికొక కర్పూర తాంబూలం అందీయడం అతనికొక పరిపాటిగా ఉండేదేమో! ఈ విదేశ ప్రవాసంలో ఆ పరిపాటి మూలానే అతడావిధంగా చేయిచాపి ఉండవచ్చును! నేననుకున్నట్లు సామాన్య యోధుడుగా కనిపించడంలేదు! ఎవరో ఐశ్వర్యవంతుడేమో! అనుకొన్నది కమల. ఇంతలో విజయవర్మ తిరిగి ఇంకొకమారు అలాగే పరధ్యానంగా చేయిచాపడం జరిగింది. తాంబూలం అందిచ్చేవారెవరు లేకపోవడంవల్ల చాపిన చేయి అలాగే కిందికి దిగజారిపోయింది. కమల అది చూచింది. ఈమారు ఇలాంటి సదవకాశం జారవిడవకూడదని నిశ్చయించింది. ఒక కర్పూర తాంబూల కరండకం చేత ధరించి నెమ్మదిగా అక్కడికి వెళ్ళింది, విజయవర్మ కూర్చున్న వేదిక పక్కనున్న స్తంభానికి కానుకుని నిలబడి, ఆ అవకాశంకోసం నిరీక్షించింది. తటాలున వకుళమాలిక నృత్యంలో ఒక ముక్తాయింపు ముగిసి తాత్కాలికంగా నృత్యం ఆగింది! విజయవర్మ తాంబూలంకోసం తిరిగి పరధ్యానంగా చేయి చాచాడు. అదే క్షణంలో కమల అతని చేతికొక కర్పూర తాంబూలపు చిలక అందిచ్చింది. అతడలాగే పరధ్యానంగా అది తీసుకుని పుక్కిట పెట్టుకొన్నాడు. వెంటనే కర్పూర పరిమళం ఘుమఘుమ లాడింది! విజయవర్మ ఆశ్చర్యపడి పక్కకు తిరిగి చూచాడు. ఎవరో అపరిచిత వనిత! విజయవర్మకది మరింత ఆశ్చర్యం వేసింది. అలాగే

పొమ్మంటూ విరిచాడు.

కమల సంగ్రహంగా విజయవర్మతో తాను వకుళమాలిక చెలికత్తెననీ, ఆయన తాంబూలావసరం గ్రహించి ఆ విధంగా సేవించుకొన్నాననీ సమాధానం చెప్పింది.

ఆమె పరేంగిత జ్ఞానశక్తికి విజయవర్మ లోలోపల వెల్లివిరిసిన ఆశ్చర్యం అతని కళ్ళల్లోను, చెక్కిళ్ళలోను చిందులు దొక్కింది. తలవంచుకుని ప్రసంగిస్తున్న కమలకేసి అలాగే వింతగా చూస్తూ—

"ఎంతటి చాతుర్యం!" అన్నాడు.

"నిజంగా మీరు మెచ్చుకోవలసింది నన్ను కాదు!" అన్నది కమల. సమయం కనిపెట్టి ఆమె ఒక అబద్ధం ఆడింది.

"ఇంకెవరు?"

"దేవదాసి వకుళమాలిక!"

"నిజంగా నిన్నక్కడ నృత్యం చేసింది దేవదాసి వకుళమాలికేనా?"

"ఔను!... మొట్టమొదట నేనే మీ మెప్పు పొందాలనుకున్నాను. కాని మీదగ్గర నిజం కప్పిపుచ్చడానికి భయపడ్డాను!"

అన్నది కమల. ఆమె సరిగా అతికినట్టుగా ఇంకొక అబద్ధం చెప్పింది. ఈ సారి తన పాచిక పారితీరుతుందని లోలోపల కొంచెం ధైర్యం తెచ్చుకుని అతి జాగ్రత్తగా విజయవర్మ ముఖ కవళిక పరీక్షించింది. ఆమెకు మరి కొంచెం ధైర్యం కలిగింది.

"ఇంతటి నృత్య చాతుర్యం నేనెక్కడా చూడలేదు!" అన్నాడు విజయవర్మ.

కమల "మీ వంటి విద్వాంసులు మెచ్చినదే మెప్పు!—అయినా వకుళమాలికకిది అంతగా అభిమాన విద్య కానేకాదు!" అన్నది.

"అలాగా! మరి ఆమె అభిమాన విద్య?"

"వీణ! ఆవాద్యంలో గౌడరాజ్యానికంతటికీ ఆమె మరి అంతటి చెయ్యి లేదని ప్రసిద్ధికెక్కింది... అయితే మా చెలికత్తెనుగురించి నేనేమి మాటాడినా అతిశయోక్తే అవుతుంది. అది మీవంటివారు పరీక్షించి అనవలసిన మాట!"

"మరి ఇక్కడ ఆ వీణాగోష్ఠి జరగదా?"

"ఇది కేవలం నృత్యోత్సవమే! అది ఇక్కడ జరగదు!"

"ఓహో! అలాగా!" అన్నాడు విజయవర్మ. అంతేగాని ఆ పైన ఆ వీణవినే కుతూహల మేమీ కనబరచనే లేదు!

కమల అలాగే తలవంచుకుని మరి ఒక కర్పూర తాంబూలం అందిస్తూ—

"తమరొక్కసారి మా భవంతికి విజయం చేసి వకుళమాలిక విద్వత్తు పరిశీలించాలని నా కోరిక!" అన్నది.

"ప్రస్తుతం నేనిటువంటి గోష్ఠి ప్రసక్తి విరమించుకొన్నాను." అన్నాడు విజయవర్మ ముక్తసరిగా.

పాలోచించి—

"మరి స్వామి ఉత్సవాలకు తాము దయచెయ్యలేదా!" అన్నది విజయవర్మ ముఖ కవళిక గమనిస్తూ.

"నేను కేవలం స్వామి దర్శనంకోసమే ఇక్కడికి వస్తున్నాను! అంతా ఇది కేవలం అనుషంగికం!"

"అక్కడకూడా మీ రాలకించేది స్వామి సంకీర్తనమేగదా!" అన్నది కమల!

విజయవర్మ దేవదాసీల గోష్ఠికి దూర దూరంగా ఉండాలని నిశ్చయించుకొన్నాడు. కాని మొహమాటపడి ఆ మాట పైకన లేకపోయాడు. కనక నే కమలఅన్నదానికేమీ సమాధానం చెప్పలేక ఏదో యాదాలాపంగా సాకు చెప్పాలనే ఉద్దేశ్యంతో—

"నిజమేకాని మరి నేటికి వేళ మించిపోయింది!" అన్నాడు.

"పోనీ! రేపు దయచెయ్యవచ్చునే!" అన్నది కమల.

విజయవర్మ కేమీ పాలుపోక—అన్న మాట తప్పడానికిష్టంలేక, మరి గత్యంతరం

"మరి నాలుగైదు రోజులవరకు నాకు తీరిక లేదే!" అన్నాడు.

"పోనీ! తమకు తీరిక కలిగినప్పుడే దయచెయ్యవచ్చును! దానికేమి?" అని సమాధానం చెప్పింది కమల!

విజయవర్మకి బంధనంలోనించి దాటిపోయేమార్గం కనబడలేదు!

అప్పటి మాట ఆలోచించుకోవచ్చును గదా అని ఆలోచించి ఎట్టకేలకు 'సరే!' అని అంగీకరించాడు.

కమల సవినయంగా అతనిదగ్గిర సెలవు తీసుకుని—

"తమవంటివారు మా భవంతికి దయచెయ్యడం కేవలం మా భాగ్యం!" అన్నది.

విజయవర్మ అలాగే పరధ్యానంగా ఆనృత్యమండపంకేసి చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచి పెట్టాడు. కమలకు తన మెడలలోనే ఆముప్పేట ముత్యాలహారం తళతళ మెరిసినట్లయింది! పిమ్మట వీణా వేణు మృదంగాల సందడిలో వకుళమాలికనృత్యం యథాప్రకారంగా సాగిపోయింది.

—సశేషం.



బ్రోకర్ ప్రణయకలాపం

బ్రోకరు వ్యాపారం చేసే హార్వీమాక్స్వెల్ కార్యాలయంలో గడియారం 9½ కొట్టింది. గంట ఠంగ్ న మోగే సరికి మాక్స్వెల్ ఠంచన్ గా ఆఫీసులో అడుగుపెట్టాడు. అతని వెంటనే స్టెనోగ్రాఫర్ జంటగా వచ్చింది.

"గుడ్మార్నింగ్ పిచర్" అంటూ బ్రోకర్ మాక్స్వెల్ దూకుడుగా తన గదిలోకి వెళ్ళాడు. గుమాస్తాపిచర్ గుండ్రాయి మొహంలో కాస్తంత చలనం కనబడింది. ఒక్క పిసరు ఆశ్చర్యంకూడా మెరిసిందేమో. దూకుడుగా వచ్చిన మాక్స్వెల్, బల్ల అవతలికి ఒక్క దెబ్బన దూకేస్తాడా అన్నంత ధాటిగా వెళ్ళిపోయి, అక్కడ కాసుక్కూర్చున్న ఉత్తరాల, టెలిగ్రాంల గుట్టలమధ్య ఝుణుంగున ములిగిపోయాడు....

మాక్స్వెల్ వెంటవచ్చిన చిన్నది, ఏడాదిగా అక్కడ స్టెనోగా ఉంటోంది. చక్కని చుక్క. అయితే ఆ చక్కదనం తీరు వేరు. స్టెనోపనిచేసే అమ్మాయిల హంగులూ, అలంకారాలూ లేవు. మరులుకొలిపే తరహాలో కురులు ముడుచుకోలేదు. ఆభరణాలు అంతకన్న పెట్టుకోలేదు. పోతే, ఎవరో ఓ రోమియో మధ్యాహ్నం భోజనానికి పిలిస్తే, సరే అనబోతున్నట్లనిపించే హంగూ కనబడదు. ఈ అమ్మాయి సాదా దుస్తులు వేసుకుంది. బూడిదరంగువి ఆమె విగ్రహానికి నప్పేవి. వాటికితగ్గ టోపీ పెట్టుకుంది. నల్లటి టోపీ. దూకా చిలకఈక, మిసమిసలాడే ఆకు పచ్చ ఈక, ఆ టోపీలో గుచ్చుకుంది. అంతే. ఆ ఉదయం ఆమె చెంపలచాయలో లేతగులాబీ మొగ్గలు వికసిస్తున్నాయి. కళ్లు కాంతివంతంగా ఉన్నాయికాని, కొద్దిగా కలలు కంటున్నాయి. ముఖంలో సంతోషం. ఆ సంతోషంలో మధుర స్వప్నచ్ఛాయ భాసించింది.

పిచర్ మొహంలో, కుతూహల రేఖ కిటపటాయిస్తూనే ఉంది. స్టెనోగ్రాఫర్ ధోరణిలో, గుమాస్తా పిచర్ కు మార్పు కనబడింది. ఆపిల్ల సరాసరి పక్కగదిలో తనచోటికి వెళ్ళి కూర్చోకుండా, ఇవతలి గదిలో నే కిటపటాయిస్తున్నట్లు తారట్లాడుతోంది. ఆ తారట్లాడడంలో ఒకసారి మాక్స్వెల్ బల్ల దగ్గిరికివెళ్లింది. బాగా దగ్గరికివెళ్ళింది. ఉత్తరాల సముద్రంలో మునకలు వేస్తున్న మాక్స్వెల్, ఆమె తన బల్లదగ్గరికి వచ్చినట్లు తెలుసుకోగలిగాడు. నిజానికి ఆ క్షణంలో బ్రోకర్ మాక్స్వెల్ మనిషి కాడు, యంత్రం. ఆ యంత్రాన్ని పనిచేయించేవి, టెలిఫోన్ గంటలు ధరల భోగట్టాలూ గట్రానూ.

నాటక రంగంమీద, తెచ్చిపోసే మంచుకుప్పలా అతని బల్లనిండా, తెరచిన ఉత్తరాలు గుట్టలుగా ఉన్నాయి. "ఏమిటి సంగతి? ఏమన్నా చెప్పాలా?" అన్నాడు మాక్స్వెల్ ఆమెవంక చూసి.

పనితోతప్ప, మనుషులతో పనిలేదనిపించే మాక్స్వెల్ దృష్టి, క్షణం సేపు స్టెనోమీద పడింది పనితొందరవల్ల చిరాకు కూడా కనబడింది చురుకైన ఆ చూపులో.

మూలం :

ఓ హెన్రీ

"అబ్బే ఏం లేదు" అంది స్టెనోగ్రాఫర్. అని నవ్వింది. నవ్వుకుంది. నవ్వుకుంటునే అక్కణ్ణించి గుమాస్తా పిచర్ బల్ల దగ్గరకు వెళ్ళింది.

"ఇంకో స్టెనోని వేసే విషయం ఏమన్నా మీతో చెప్పారా ఆయన?' అంది.

"చెప్పారు. ఇద్దర్నో ముగ్గుర్నో పంపించమని నేను ఉద్యోగాల ఏజన్సీకి కబురంపానుకూడా. తొమ్మిదిమ్ముప్పావు కావస్తున్నా ఇంకా ఒక శాల్తీకూడా దయచెయ్యలేదు" అన్నాడు పిచర్.

"సరే లెండి. ఇంకోళ్లెవరయినా వచ్చేవరకూ, మామూలుగా నే నే పని చూస్తాను" అంటూ, ఆ అమ్మాయి తన బల్లదగ్గరికి వెళ్ళి టోపీని అలవాటు ప్రకారం చిలక్కొయ్యకు తగిలించింది.

మాంఛి పనితొందరలో ఉన్న మాన్హాటన్ బ్రోకర్ చూచితీరవలసిన ఆసామీ. చూసే అవకాశం పోగొట్టుకున్నవారు మానవశాస్త్ర పరిశోధనకు అర్హత కూడా పోగొట్టుకున్నట్టే. ఉచ్చస్థాయిలో ఉన్న జీవితం గురించి అప్పటి రాచకార్యాల రద్దీ గురించి కవులు ఏవో రాస్తారు గాని, బ్రోకర్ జీవితంలో పని రద్దీయే కాదు; ప్రతి నిముషం, ప్రతి సెకండు, బల్లమీది అడ్డమైన చీటీలకీ పడిచేళ్లాడుతూ ఉంటుంది. ఎడా పెడా కూడా వత్తిడే. ఊపిరి సలపనివ్వనంతటి వత్తిడి.

ఆరోజు మాక్స్వెల్ కిపని బాగా రద్దీగా ఉంది.

ధరవరల భోగట్టా చెప్పేయంత్రం, టకటక మంటోంది. అందులోంచి, టేపు, ఎడతెగకుండావస్తూనేఉంది. ఈసొదకి పోటీగా మరోపక్క టెలిఫోన్ రొద. చీటికీమాటికీ అదిమోగే ధోరణిచూస్తే, అదో జబ్బుపట్టుకుందా అనిపిస్తుంది. ఇంకోపక్కనించి మనుషులు. ఆదరబాదరగాగా హడావుడిగా లోపలికి వస్తున్నారు. ప్రశ్నలవర్షం కురిపిస్తున్నారు. హుషారుగా, తొందరగా నూటిగా, వెటకారంగా, ఉద్రేకంగా రకరకాలుగా కేకేస్తారు. ఏవో అడుగుతారు పోతారు. నౌకరు కుర్రాళ్లు విధి విరామం లేకుండా ఉత్తరాలు, టెలిగ్రాంలు తెస్తున్నారు. ఇస్తున్నారు. తుపానులో చిక్కపడ్డ ఓడమీది నావికులలా, ఆఫీసులో గుమాస్తాలంతా ఇక్కణ్ణించి అక్కడికి అక్కణ్ణించి ఇక్కడికి ఉరకలు వేస్తున్నారు. ఆఖరికి రాయోరబ్బో అనిపించే పిచర్ మొహంలో కూడా, చైతన్యం వంటి కాస్త కనబడింది.

ఇక, అసలు రంగం స్టాక్ ఎక్స్చేంజి. అక్కడ ఝుంఝూ మారుతాలు కొడుతున్నాయి. తుపాను లొస్తునాయి. భూకంపాలు సంభవిస్తున్నాయి మంచు తుపానులు వస్తున్నాయి. మంచుకొండలు భయంకరంగా తిరుగాడుతున్నాయి. అగ్ని పర్వతాలు ప్రజ్వలించి, పెళేల్ మంటున్నాయి. అక్కడ జరిగే ఉత్పాతాలన్నీ ఈ బ్రోకర్ల కార్యాలయాలలో కాస్త కుదిమట్టంగా, చిన్న ఎత్తున సంభవిస్తున్నాయి. మాక్స్వెల్ తాండవం ఆడిపోతున్నాడు. ఇటు ధరవరలు చెప్పే టేపుమిషన్ చూస్తాడు. ఒక్క పెట్టున టెలిఫోన్ దగ్గరికి లంఘిస్తాడు. అక్కణ్ణించి అమాంతం గది గుమ్మం దగ్గరకి పరిగెడుతాడు. అంతా బాగా అలవాటైన సర్కస్ బఫూన్ చురుకుదనంతో, సమయస్ఫూర్తితో ఆడిపోతున్నాడు. హడావుడిగా. సతమతమవుతున్న మాక్స్వెల్ కంటికి, హఠాత్తుగా, ఒకకొత్త శాల్తీ కనబడింది. ఉంగరాలుగా చుట్టచుట్టిన బంగారువన్నె తలకట్టు గోచరించింది. దవిమిలా నకిలీసీల్ స్కిన్ గౌను,

పెద్ద పెద్ద భూగోళాలున్న దంత, ఆ దంత చివర అరటిపండు ఆకారంలో ఉన్న వెండి పతకం గోచరించాయి. ఈ హంగు లన్నిటినీ ధరించిన అమ్మాయి ఒకామె మహా హుందాగా నిలబడి ఉంది. ఆ పక్కనే గుమస్తా పిచర్ నిల్చున్నాడు.

"స్టెనో ఉద్యోగాల ఏజన్సీవాళ్లు పంపించారండి. ఇక్కడ పనికోసం వచ్చింది" అన్నాడు పిచర్.

చేతినిండా కాగితాలతో, ధరవరల తొందరలో అవస్థ పడుతున్న మాక్స్‌వెల్, పిచర్ వంక తిరిగాడు.

"ఏం పని?" అన్నాడు మాక్స్‌వెల్.

"స్టెనోగ్రాఫర్. నిన్న చెప్పారుగా ఎవర్నైనా పిలిపించమని?"

"నీకు మతిగాని పోయిందా. ఇప్పుడున్న స్టెనో లెస్లీ నిక్షేపంలా పని చేసుకు పోతూ వుంటే, ఇంకొకర్ని పిలిపించమని ఎందుకంటానూ? లెస్లీ ఇక్కడుండదలచుకున్నంతకాలం ఉండవచ్చు...అమ్మా ఇక్కడేం ఉద్యోగాలు ఖాళీలేవు...పిచర్, వెంటనే ఆ ఏజన్సీకి కబురు చెయ్యి ఇంకెవర్నీ పంపొద్దని" అన్నాడు మాక్స్‌వెల్.

ఉద్యోగానికొచ్చిన కొత్త అమ్మాయికి, ఉవ్వెత్తున కోపం వచ్చింది అదంతా, ఆఫీసులో బల్లలమీద కుర్చీలమీద చూపిస్తూ, విసురుగా తిప్పుకుంటూ చక్కా పోయిందా రజత పతక.

"ఈయనకి నానాటికీ మతిమరుపు ఎక్కువై పోతోంది" అన్నాడు పిచర్ — కొంచెం తేరిపార చూసుకుని పక్కనున్న బుక్‌కీపర్ వంక తిరిగి.

పనిరద్దీ క్షణక్షణానికి పెరిగిపోతూంది. జోరు మీరిపోతోంది. మాక్స్‌వెల్ ఖాతాదారులకి పెద్దవాటాలున్న సరుకు నిల్వలని అమ్మాలా దాచాలా అని తేల్చడానికి తర్జనభర్జనలు జరిపి తలక్రిందులై పోతున్నారు. మరోపక్క వాటాలు కొనమని, అమ్మమని కబుర్లమీద కబుర్లు ఉరికిస్తున్నారు ఖాతాదార్లు. మాక్స్‌వెల్‌కి వాటాలున్న నిల్వలే కొన్ని ఒడుదుడుకుల మునిగేటట్టున్నాయి. ఈ గందరగోళం అంతటినీ ఆకట్టుకువచ్చే మాక్స్‌వెల్, మంచి బలమైన యంత్రంలా, మహాజోరుగా తిరిగే యంత్రంలా పనిచేస్తున్నాడు. అంత వేగంలోను ఎక్కడా ఒక తప్పటడుగు పడదు. ఒక పొల్లుమాట జారదు. ఒక పొరపాటుకి చోటు ఉండదు. ఏ క్షణానికి, ఏమాట, ఏ నిమిషానికి ఏ నిర్ణయం అవసరమో అవే వినబడతాయి. గడియారంలా కరాఖండిగా, దారితప్పకుండా పనిచేసుకు పోతూందా యంత్రం. ఇదంతా ఒక లోకం దీని తరహా వేరు. సరుకు నిల్వలు, వాటి భోగట్టా, ధరలవైనం, బాండ్లు, అప్పులు, తనఖాలు, సెక్యూరిటీలు–ఇవే ఇక్కడ వినబడేవి, కనబడేవి. ఈ లోకంలో మానవుడు వాడి బ్రతుకుగురించిన మాటకి చోటు లేదు. ప్రకృతి సౌందర్యానికి ప్రవేశం లేదు.

మధ్యాహ్నం భోజనాలవేళ దగ్గర పడేసరికి, వ్యాపారం జోరు కొంత తగ్గింది. గందరగోళం ఒక్కరవ్వ ఉపశమించింది. అప్పటివరకూ ఉరుకులూ పరుగులూ వేస్తున్న మాక్స్‌వెల్ తన బల్లదగ్గిర ఒక్క క్షణం ఆగాడు. రెండుచేతులా కాగితాలూ, ఏవో టెలిగ్రాములు, ఉత్తరాలూ, మెమోరాండాలూ గట్టాను. కుడిచెవి సందులో కలం, జుట్టంతా చెదిరిపోయి, జూలు నుదురుమీద చిందరవందరగా పడిఉంది. నిలచివున్న మాక్స్‌వెల్ అలసిన శరీరాన్ని, తెరచి ఉన్న కిటికీలోంచి, ఒక గాలి కెరటం తేలికగా తాకింది. ఆ కెరటం, మధురమైన పరిమళాన్ని - మాక్స్‌వెల్ మరచిపోయినదాన్ని, వెంటపెట్టుకు వచ్చింది. అది లీలాక్ పువ్వు పరిమళం. ఆ గుబాళింపు మాక్స్‌వెల్‌ను ఒక్క క్షణకాలం ముగ్ధుణ్ణి చేసింది. ఆ క్షణంలో అది లెస్లీని గుర్తుకు తెచ్చింది. మరే లెస్లీ ఉన్నచోటనే ఆ పరిమళం ఉంటుంది. పరిమళం నాసాపుటాలను సోకడంతో, లెస్లీ విగ్రహం మాక్స్‌వెల్ కళ్ళ ఎదట స్ఫురించసాగింది. లెస్లీ అతని ఎట్టఎదట నిల్చున్నట్టన్పించింది. అంతటిలో ఆర్థిక వ్యవహారాలన్నీ బుర్రలోంచి అవతలకిపోయాయి. ఆ ప్రపంచమే చిన్న రేణువంత అయిపోయింది...లెస్లీ పక్కగదిలోనే—సరిగ్గా ఇరవై అడుగుల దూరాన ఉంది!...

"ఇప్పుడడిగేస్తాను. మరే...అసలు ఏనాడో అడగాల్సింది." అని గొణుక్కున్నాడు మాక్స్‌వెల్. అనుకోడమే తడవు అమాంతం, లెస్లీగదిలోకి ఒక్క అంగ వేశాడు. పందెంలో వెనకబడ్డవాడు, ఆ దూరాన్ని కమ్మికుపోయేటంత దూకుడుగా వెళ్ళాడు.

ఆ అమ్మాయి మెల్లిగా తలఎత్తి చూసింది. చూసి చిరునవ్వు నవ్వింది. ఆమె చెంపలలో కెంపులు వెలిగాయి. ఆ వెలుగు లేత వెలుగు. ఆమె అతని వంక సూటిగా చూసింది. ఆ చూపులో సానుభూతి.

దూకుడుగా వచ్చిన మాక్స్‌వెల్ బల్లమీద మోచేతినాన్చి ముందుకు వంగాడు. రెండు చేతులా పుష్కలంగా టెలిగ్రాం కాగితాలూ ఉత్తరాలూను. చెవిలో కలం ఒకటి.

"మిస్ లెస్లీ! ఒక్కటంటే ఒక్క క్షణం కన్న తీరికలేదు. ఆ ఒక్క క్షణంలో ఒక్క ముక్క అడగాలని ఉంది...నన్ను పెళ్లి చేసుకుంటావా? పద్ధతి ప్రకారం ప్రేమకలాపాలు సాగించడానికి నాకు తెరిపి లేకపోయింది కాని, నిన్ను నిజంగా ప్రేమిస్తున్నాను. ఏం ఇష్టమేనా?...త్వరగా చెప్పు...అవతల టెలిఫోను గంట..." అన్నాడు ఆదరబాదరగా.

మిస్ లెస్లీ విస్తుపోయింది. "ఏమిటి నువ్వు చెప్పేది?" అంటూ లేచి నిల్చుంది. విప్పారిన నేత్రాలు మాక్స్‌వెల్ వంక నివ్వెరబోయి చూశాయి.

"అరె. చెప్పింది తెలీలేదు?...పెళ్లి చేసుకుంటావా అంటున్నాను ... నిన్ను ప్రేమిస్తున్నాను లెస్లీ. పని కొంత తెరిపిచ్చింది గదా అని ఒక్క క్షణం వీలు చేసుకొచ్చాను నీకీ ముక్క చెబుదామని.... ఇదుగో అవతల టెలిఫోన్‌లో ఎవరో పిలుస్తున్నారు. ఓయ్ పిచర్! ఒక్క నిముషం ఉండమనవోయ్ వాళ్లని...లెస్లీ...లెస్లీ సరేనా? ఇష్టమేకదూ?" అన్నాడు మాక్స్‌వెల్ సతమతమయిపోతూ.

స్టెనోగ్రాఫర్ లెస్లీ వాటం చాలా వింతగా కనబడింది. ఆ అమ్మాయి ముందర విస్మితురాలై పోయినట్లు కనబడింది. విస్మయంతో విప్పారిన ఆమె కళ్ల గిర్రున నీరు తిరిగింది. ఆ తరవాత నవ్వింది. ఆ నవ్వు వెలుగు చిమ్మింది. ఆ వెలుగులో కన్నీళ్లు మెరిశాయి. ఎంతో ఆప్యాయంగా బ్రోకర్ మాక్స్‌వెల్ భుజంమీద చేయి వేసింది.

"తెలిసిందిలే ఈ పాడు వ్యాపారం గొడవలో నీబుర్రనిండిపోయి మిగతావన్నీ మర్చిపోయావు. ముందర హడలిపోయాను తెలుసా? అప్పుడే మర్చిపోయావా హార్వీ! ఈ వీధి మొగనున్న చర్చిలో నిన్న రాత్రి ఎనిమిది గంటలకి మనిద్దరం పెళ్లి చేసుకున్నాం."

★

ఎంత నిజం!

ఓటరు: ఏమండీ ఒకవేళ మీరు నిజంగా ఎన్నిక అయిపోతే, ఏంచేస్తారండీ.

అభ్యర్థి: ఏడిసినట్టుంది. కాకపోతేమట్టుకు ఏంచేస్తాను?

ఓ హెన్రీ జీవితకథ

చిన్నకథలు రాయడంలో కిటుకేమిటి? కథక చక్రవర్తి ఓ. హెన్రీ పకపక నవ్వాడు ఈ ప్రశ్న అడిగిన మిత్రుణ్ని చూసి.

"ఏం లేదు. చాలా తేలిక. ముందర, కథ ఎలా ముగించాలో ఆలోచించుకోవడం, అది తేల్చుకుని, కథ మొదలుపెట్టి అక్కడికి రాసుకుపోవడం. అంతే" అన్నాడాయన.

ఓ. హెన్రీ, రాసిన కథను ఎన్నడూ మళ్లా తిరిగి చూసుకునేవాడు కాదు. ఆఖరి పేజీ అయిపోగానే, కాగితాలు మడిచి పెట్టెయ్యడం, టపాలో పడెయ్యడం ఆయన పద్ధతి.

దేన్ని గురించి రాయడం అని అడిగితే, ఆయన చెప్పిన నియమావళి:

"మొదటి నియమం, నీకు నచ్చిన దాని గురించి రాయడం. ఇంక రెండవదా—అసలు లేదు. రెండోదన్నదేం లేదు."

ఓ హెన్రీ ఈ సూత్రంమీదనే తన కథలన్నీ సృష్టించాడు. ఆయన రాసిన 250 పైచిలుకు కథలలో చాలాభాగం న్యూయార్కులో ఉండగా రాశాడు. కథలో పాత్రలను ఆయన ఎరుకున్న మనుషులలో చాలమంది, చాలీచాలని జీతపురాళ్లతో సరిపెట్టుకుని జీవనం సాగిస్తూ, అందీ అందని కోరికలన్నీ కలలలో అందుకుంటూ కాలం గడిపేవారు. న్యూయార్కు నగర జనాభాలో, దొంగలు, పోలీసులు, హోటళ్లలో పనిచేసేవారు, టాక్సీడ్రైవర్లు, నటులు, స్టెనోగ్రాఫర్లు, దేశద్రిమ్మరులూ ఆయన కథలో పాత్రలు. వాళ్ల ఆశలూ నిరాశలు, కష్టాలూ సుఖాలూ ఇతివృత్తాలు.

"ఇతివృత్తానికి ఇదేమిటి అదేమిటి—జీవితంలో ప్రతిఘట్టం, ప్రతి అనుభూతి కావ్యవస్తువే" అన్నది ఆయన సిద్ధాంతం.

కొల్లలయిన కథావస్తువులను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, ఎన్నో కథలు వ్రాసిన ఓ. హెన్రీ, బుర్రలో మనకి చెప్పిన వాటికి ఎన్నో రెట్లు కథలు తోచివుండాలి. ఎందుకంటే తోచిన కథని, నిలకడగా కూర్చుని వ్రాయడం ఆయనకి బద్ధకం.

ఏదో ఒక పత్రికకి కథ రాసిస్తానంటాడు. వాళ్లు ముందే డబ్బిస్తారు. తీరా ఆకథ పూర్తి అయేసరికి, మళ్లా డబ్బు అర్జెంటుగా కావలసి వస్తుంది. అందుకని, ఆ తయారయిన కథను ఇంకో పత్రికకిచ్చి డబ్బు తీసుకుంటాడు.

ఓసారి ఇలాగే డబ్బు కావలిసొచ్చి ఒక కథ రాశాడు. అది తన ఏజంటుకిచ్చి పంపాడు. ఆ ఏజంటు ఏ ఆఫీసుకెళ్ళినా, "అసలు మాకు నాలుగుకథలు బాకీ ఉన్నాడాయన. మళ్లా ఇది అమ్మడం ఏమిటి?" అని జవాబు వచ్చింది. ఏజంటుకి విసుగెత్తి ఓ హెన్రీకి ఫోను చేసేసరికి, ఫరవాలేదులే అన్నాడు నవ్వుతూ. ఆ కథ కాస్త సర్ది, క్రిస్టమస్ కథగా తయారుచేసి, తనే ఇంకో పత్రికకి అమ్మేశాడట. ఇదీ సారాంశం.

కొందరు, దగ్గర కూర్చుని కథ రాయించుకు పోయేవారు.

"ఏమండీ కథ రాశారా?"

"ఆహా. పూర్తి అయిపోయింది" అనేవాడు ఓ హెన్రీ.

"అయితే ఇస్తారా?"

"ఆ అదా...పూర్తి అవడం అంటే రాయడం అనికాదు నేనన్నది. ఇదుగో



ఇక్కడ...అంతా బుర్రలో ఉంది. కావలిస్తే వినండి" అంటూ రాసిన కథ చదివిన పద్ధతిలో పూసగుచ్చినట్టు అన్ని వివరాలతో ఆ కథ చెప్పేసేవాడు ఓ హెన్రీ. ఆ వచ్చిన పెద్దమనిషి 'సరే. ఇప్పుడు రాసియ్యండి' అంటే, "సరే పదినిముషాలు కూర్చోండి," అని చకచక రాసిచ్చేసేవాడు.

తన 47 ఏళ్ళ జీవితంలో ఓ హెన్రీ అనేక తరహాల మనుష్యులమధ్య మసలి, ఎంతో అనుభవం గడించాడు. అన్నిరకాల అనుభవాలూ చవిచూచాడు. జన్మస్థలం ఉత్తర కరోలినా రాష్ట్రంలోని గ్రీన్సబరో అనే చిన్న బస్తీ. 20-వ సంవత్సరం వరకూ అక్కడే గడిచింది. ఆ తరవాత, టెక్సాస్ వెళ్ళి, రాంచి (పశుపోషణ క్షేత్రం) లో పనిచేశాడు. దరిమిలా ఆ రాష్ట్రం రాజధాని ఆస్టిన్ వెళ్ళి ఒకచోట కొలువుకి కుదిరాడు. ఎథెల్ ఎస్టిస్ అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరవాత ఆస్టిన్‌లోని నేషనల్ బ్యాంకులో ఉద్యోగం సంపాదించాడు. 1894 లో ఆ ఉద్యోగం సరిపడక ఒక పత్రిక పెట్టాడు. ఆపైన హూస్టన్ పోస్టు అనే పత్రికలో చేరాడు. అంతలో అతని మీద ఆరోపణ ఒకటి పడింది. నేషనల్ బ్యాంకులో కొంతడబ్బు దుర్వినియోగం చేశాడని. అందువల్ల ఆస్టిన్ కోరుకు వచ్చి సంజాయిషీ చెప్పుకోవాలని తాఖీదువచ్చింది.

హెన్రీ కోర్టుకు వెళ్ళక, సెంట్రల్ అమెరికాకు పారిపోయాడు. భార్యను కూడా రమ్మని కబురంపాడు. అప్పటికి క్షయతో తీసుకుంటున్నందువల్ల ఆమె వెళ్ళలేదు. కొద్దిరోజులలోనే చనిపోయింది. ఆతరవాత అతను కోర్టుకు వెళ్ళాడు. ఆరోపణ ఖాయపరుస్తూ కోర్టువారు ఐదేళ్ళ కారాగార శిక్ష వేశారు.

ఓ హెన్రీ కటకటాలమధ్య ఉన్నప్పుడే కథలు వ్రాయటంలో మంచిపేరు తెచ్చుకున్నాడు. అతని సత్ప్రవర్తనచూచి, అధికారులు శిక్షకూడా తగ్గించారు.

ఖైదు శిక్ష తనకు అన్యాయంగా వేశారని ఓ హెన్రీ చనిపోయే వరకూ అంటూనే వచ్చాడు.

"నా జీవితంలోనే నెన్నడూ ఏదీ దొంగిలించి ఎరగను. బ్యాంకు డబ్బు కాజేశానని నామీద అభాండం వేశారు. నిజానికి నేనందులో దమ్మిడీ ఎరగను" అని ఒకసారి అతను జైలు డాక్టరుకి చెప్పాడు.

తను దోషిగా, ఖైదులో కొంతకాలం ఉండవలసి వచ్చిందన్న భావం వల్లనే ఓ హెన్రీ అలా ఉండేవాడని ఆయన పరిచితుల, మిత్రుల భావం. కథా రచయితగా, తన అసలు పేరు—విలియం సిడ్నీ పోర్టర్ వాడుకోకుండా ఓ హెన్రీ అనే మారుపేరు ఉపయోగించడానికి కూడా, ఇదే కారణమని అంటారు. జైలు అధికారులలో ఆరిన్ హెన్రీ అనే ఒక ఆసామి ఉండేవాడనీ, ఆపేరునుబట్టే ఓ హెన్రీ అని ఈయన పేరుపెట్టుకున్నాడనీ చెబుతారు. ఓ హెన్రీ కథలలో ఇది చాలా మంచిది అని ఏరి చెప్పడం కష్టం. ప్రతీదీ విశిష్టమైనదే ఈయన కథల సంపుటం తొలిసారిగా 1904 లో కాబేజెస్ అండ్ కింగ్స్ పేరిట వెలువడింది. తరువాత ఫోర్ మిలియన్ అని మరొకటి వచ్చింది.

1910 జూన్ 5న ఓ హెన్రీ చనిపోయాడు. తుదిఘడియలలో తన పరిచారికకు అతను చేసిన వినతి:

"కిటికీలు తెరచివెయ్యి. చీకటిలో ఇంటికెళ్లడం అంటే, నాకు భయం" ★



[illegible]   [illegible] : [illegible]

డిటెక్టివ్ సీరియల్

అపూర్వ హంతకులు

మూలం: ఎడ్గార్ వాలెస్   అనువాదం: 'వినాయక'

10
ముగ్గురి మరణం

రైలు కెన్సింగ్టన్ స్టేషన్ దగ్గరికి వచ్చేసరికి ఒక ప్రయాణీకుడు ఆరైలుకున్న డామని తాపీగా రైలుపెట్టె తెరిచాడు. తెరవగానే దగ్గుతూ నిర్ఘాంతపోయి నిలుచున్నాడు. ఇంతలో ఒక రిపోర్టరు, స్టేషన్‌మాస్టరు అక్కడికి పరిగెత్తుకువచ్చారు. పోర్టర్ పెట్టెతలుపులు తెరిచాడు. దానిలోనించి భరింపరాని పాడు దుర్వాసన వాయువు బైటకు వ్యాపించింది.

దానితో కొందరు ప్రయాణీకులు పెట్టె ముందు గుమిగూడారు. ఒకరొకరిని తోసుకుంటూ పెట్టెలో ఏమున్నదో అని తొంగి చూశారు. స్టేషన్ ఇన్‌స్పెక్టరు దర్యాప్తు ప్రారంభించాడు. అంతలో ఒక డాక్టరుకూడా అక్కడికి వచ్చాడు. తరవాత ఇంకో పోలీసు స్ట్రెచరుతోసహా అక్కడ హాజరయ్యాడు.

వారంతా కలిసి ఆ రైలుపెట్టెలో నించి ఒక శవాన్ని తీసి మెల్లిగా స్ట్రెచరు మీద పెట్టారు.

"అక్కడ ఇంకేమన్నా కనిపించిందా!" అడిగాడు పోలీస్.

"ఒక పెంకిటి — ఇంకో పగిలిపోయిన సీసా! అంతే!"

పోలీస్ చనిపోయినఆసామీ జేబులు తడిమాడు. "ఇక వాటిల్లో అతనెవరో తెలుసుకోడానికి వీలుగా పేపర్లేమీ దొరుకుతాయని నమ్మకం లేదు! ఇదుగో ఫస్టుక్లాస్ టికెట్. ఈజేబులో ఇంకో కార్డుకూడా కనబడింది. బలవంతంగా ప్రాణం తీసుకున్న వాడలే! ఏమీ సందేహం లేదు!"

తరవాత అతడా కార్డు అటు ఇటు తిప్పి నాలుగుమాటలు చదివాడు. దానితో హఠాత్తుగా అతని ముఖకవళిక మారిపోయింది. పక్కవాళ్లతో అదరా బాదరాగా ఏవో నాలుగు మాటలుచెప్పి వెంటనే పక్కనే ఉన్న టెలిగ్రాఫాఫీసుకి పరిగెత్తాడు.

సూపర్నెంట్ ఫాల్‌మూత్ కానింగ్ స్ట్రీట్ లో వెళ్ళాగో అలాగ రెండు మూడు గంటలు వ్యవధికల్పించుకుని ఒక చిన్న కునుకు తీశాడు. తరవాత లేచి, లోలోపల ఏదో కొంప మునిగిఉంటుందని కంగారు పడుతూ అదరాబాదరాగా కోటు తొడుక్కుంటూంటే అసిస్టెంట్ పోలీసుకమీషనర్ తన

జరిగిన కథ:-

స్పెయిన్ దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవం జరుగుతున్న రోజుల్లో విప్లవకారులు ఇంగ్లండులో మకాం వేశారు. వాళ్ళని వెళ్ళగొట్టడంకోసం ఆంగ్లదేశమంత్రి పార్లమెంటులో ఒక చట్టం ప్రవేశపెట్టాలని అనుకున్నాడు.

'అపూర్వహంతకులు' ఆ చట్టం ప్రవేశపెడితే చంపేస్తామని బెదిరిస్తూ ఉత్తరం రాశారు.

తరవాత 'అపూర్వ హంతకులు' లిమిటెడ్ కంపెనీ పేర ఒక పెద్దభవనం అద్దెకు తీసుకుంటారు. దానిలో మాన్‌ఫ్రెడ్ గోన్సాలెజ్ లిద్దరు ఒక మారణపదార్థం తయారు చేస్తారు. పిమ్మట 'టాకా'లో ఒక దురంతం జరిగింది. సంపాదకునికి కూడా ఒక బెదరింపు ఉత్తరం అందింది. ఆ తరవాత థెరీ 'టాకా' కార్యాలయంలో ప్రత్యక్షమైనాడు! అతడు 'అపూర్వహంతకుల' గుట్టు బయటపెట్టేలోగా ఒక ముసుగుమనిషి రివాల్వరుతో అక్కడివారిని బెదిరించి, థెరీని విడిపించుకుపోతాడు. తరవాత హంతకులు మంత్రి హత్యకోసం చెయ్యవలసిన ఏర్పాటులన్నీ చేశారు. ఈలోగా ఒక హంతకుడు పోలీస్ సూపర్నెంటు వేషంతో మంత్రికి ఆఖరి హెచ్చరిక అందజేస్తాడు! ఈ లోగా బిల్లీ మార్క్స్ అపూర్వహంతకుల నోట్ బుక్ కొట్టేస్తాడు. అది పోలీసుల చేతుల్లోపడింది. పోలీసులు బిల్లీని విడిచిపెట్టి ఆ నోట్‌బుక్-ఆసామీ ఎక్కడైనా పట్టుకోమని పంపిస్తారు. బిల్లీ దురాశవల్ల అది నెరవేరదు.

కోసం బాధ్యతని వహిస్తున్నాడని కబురు వచ్చింది. వెంటనే అతన్ని లోపలికి పిలిపించాడు.

అసిస్టెంట్ కమీషనర్ లోపలికి వస్తూనే ఇలాగన్నాడు:

"మీ రిపోర్టు అందింది. మార్క్సని విడిచిపెట్టడం చాలా తెలివైనపని. ఈ వేళ ప్రొద్దున్న అతన్నిగురించిభోగట్టా ఏమన్నా తెలిసిందా?"

"లేదు"

"నాకిదంతా చాలా చిత్రంగా ఉంది!... ఇంతా చేసి ఆ హంతకులు బిల్లీవల్ల తమకు రాబోయే అపాయంసంగతి పసికట్టారేమో"

"పసికడితే పసికట్టి ఉండవచ్చును! అయితే నేం?"

"ఆ పరిస్థితిలో వాళ్ళేం ఎత్తు లేస్తున్నారో! మీరేమన్నా ఆలోచించారా?"

"లేదు! చేస్తే దేశాన్నించి పారిపోవాలని ప్రయత్నం చెయ్యాలి! అంతే!"

"మార్క్స వాళ్లకోసం వెతకడానికి ముందుగానే వాళ్లే అతన్ని వెంటాడిస్తున్నారేమో! మీరిది ఆలోచించారా?"

డిటెక్టివ్ కొంచెం కంగారుపడుతూ—

"ఆ భయమేమీ లేదు! బిల్లీ చాలా చురుకయినవాడు!" అన్నాడు.

"వాళ్లూ చురుకైన వాళ్లే! ఈ పరిస్థితిలో నా సలహా ఏమిటంటే—ముందుగా బిల్లీ ఎక్కడున్నాడో పట్టుకోండి! అతనికి కాపలాగా మరి ఇద్దరు జవాజట్టీల్లాంటి పోలీసుల్ని పంపించండి."

"అవును! నిజమే! వెంటనే ఇద్దరు పోలీసుల్ని పంపిస్తాను. అసలీ జాగ్రత్త కాస్తా ఇంతకుముందే తీసుకోవలిసింది" అన్నాడు

ఆపైన అసిస్టెంట్ కమిషనర్ "నేనిప్పుడే సర్ పిలిఫ్ రేమన్ దర్శనానికి వెడుతున్నాను!" అన్నాడు. తరవాత కొంచెం తటపటాయిస్తూ ఒక చిన్ననవ్వు నవ్వి—"నేనాయన్ని కొంచెం గాభరా పెట్టాలని చూస్తున్నాను!" అన్నాడు.

"ఏమిటి కథ?"

"మీరీవేళ పొద్దుటి పేపర్లు చూశారా? ఆయనతో ఈ చట్టం పాస్ చేయించవద్దని చెబుదామని అనుకుంటున్నాను!"

"పేపర్లేవీ చూడలేదే!"

"అందరు ఎలాగయినా ఈ బిల్లు ఆపు చెయ్యాలని అంటున్నారు. దేశంలో దీని మీద వాదోపవాదాలు బయలుదేరాయి. అదీకాక అది అంత కొంప మునిగిపోయే చట్టమేమీ కాదు. తీరా అది పాస్ చేస్తే మంత్రికి ప్రాణాపాయం కలగవచ్చునని కూడా భయపడుతున్నారు. నామట్టుకు నాకూ భయంగానే ఉంది."

అని చెప్పి అసిస్టెంటు కమిషనర్ మెట్లె[illegible]కి వెళ్లాడు. కాని అతనికింది అధికారులే అతన్ని లోపలికి వెళ్లనివ్వలేదు! ఈ మధ్యనే మారువేషం హంగామా జరిగిన తరవాత ఈ కట్టుదిట్టం కూడా ఏర్పాటయింది. విదేశమంత్రికి ఆ వ్యవహారం అంతా ఒక పెద్ద హైలుశిక్షలా తయారయింది. ఎవరు ఎవ్వరినీ నమ్మడం లేదు. ఎవరైనా లోపలికి రావాలంటే గుర్తుకోసం ప్రత్యేకంగా ఒక్కొక్క మాట చెప్పవలసిందే! ఇంతేగాక మనుషుల్ని గుర్తుపట్టడంకోసం ప్రత్యేకంగా ఇంకా మరికొన్ని ఏర్పాట్లు కూడా చేశారు. వెనకాల జరిగిన పొరబాట్లేవీ మళ్ళీ జరగకుండా—గట్టిగా కట్టుదిట్టాలు చేశారు.

కమీషనరు మంత్రి గది గుమ్మందాకా వెళ్లాడు. మెల్లిగా తలుపు తట్టబోయాడు. ఇంతలో తన మోచేయి ఎవరో గట్టిగా పట్టుకున్నట్టయింది. వెనక్కి తిరిగి చూశాడు. ఎదురుగా సూపర్నెంట్ ఫాల్ మాత్ ప్రత్యక్షం. అతని మొహంలో కత్తివాటు వేసినా ఎక్కడా ఒక్క నెత్తురుచుక్కైనా లేదు!

"వాళ్లు బిల్లీని చంపేశారు!" అన్నాడు డిటెక్టివ్ అతి కంగారుగా. ఆపైన "అతని శవం కెన్సింగ్టన్ స్టేషన్‌లో రైలుపెట్టెలో కనిపించింది" అన్నాడు.

అసిస్టెంట్ కమిషనరొక ఈలవేసి—

"అరె! ఎలాగ చంపారు?" అన్నాడు.

ఫాల్ మాత్ మొహం బాగా పీక్కుపోయింది.

"హైడ్రోజన్ సైనేడ్ గాస్‌తో చంపేశారు" అన్నాడు దిగాలు పడిపోయి. తరవాత "వాళ్లకి పైన్నూ అదీ బాగా తెలుసు! ఇదిగో! నామాటవిని ఈపాటికైనా మంత్రిగారి నా దరిద్రగొట్టు బిల్లు చల్లగా జారవిడిచి వెయ్యమనండి!" అన్నాడు.

తరవాత కొంతసేపుండి—మంత్రిగారి కేసి వేలుపెట్టి చూపిస్తూ—

"ఈయనగారి నిక మనం కాపాడటం కష్టం! నాకు లోలోపల ఈ మంత్రి ఇక చచ్చిపోయిన వాళ్లలో జమే! అని గట్టి నమ్మకం కలుగుతూంది" అన్నాడు.

దానిమీద అసిస్టెంటు కమిషన రిలాగ మండిపడ్డాడు. "ఏమిటీ అర్థం పర్థం లేని మాటలు! మీకు క్రమక్రమంగా ఉన్న మతి కాస్తా పోతూన్నట్టుందే! ఇదిగో! సూపర్నెంట్! నిన్న రాత్రి మీరు తిన్నగా నిద్రపోయినట్లు కనబడదు! ఇవి మీనోటంట రావలిసిన మాటలుకావు! ఏమైనా సరే! మనం మంత్రిని రక్షించితీరాలి".

తరవాత అసిస్టెంటు కమిషనరు మెట్ల దగ్గర కాపలా కాస్తూన్న పోలీసుతో ఇలాగన్నాడు:

"సార్జంట్! ఇన్స్పెక్టర్ కాతిస్కితో



★ అపూర్వ హంతకులు ★

వెంటనే రిజర్వ్ పోలీసు అందరినీ రడీచేసి పెట్టమని చెప్పు! నేను మంత్రి చుట్టూ గట్టిగా బందోబస్తు ఏర్పాటు చెయ్యాలి! ఎవడైనా మంత్రిదరి కూడానికి వచ్చాడంటే వెంటనే హతమారి పోవలసిందే!"

అటు పిమ్మట లండన్ నగరంలో అంతకు పూర్వ మెన్నడు ఎవ్వరు కనీ వినీ ఎరగనంతటి మహాద్భుతం జరిగింది. ప్రతి చోటి నుంచీ పోలీసుల్ని పిలిపించారు. దీనికోసం రైళ్లు, కారులు, బస్సులు అన్నీ కాళీ చేయించారు. ఏ సేవనులో చూసినా రిజర్వ్ పోలీసుల గుంపులే! ఏ వీధిలో చూసినా కొత్తగా వచ్చిన పోలీసు బలగమే! అదంతా చూసి లండన్‌జనాభా పట్టణం సంరక్షణ కింతటి కట్టుదిట్టమైన ఏర్పాటు అన్నాయి గదా! అని చాలా సంతోషించారు.

వైట్‌హాలంతా ఎక్కడా ఒక్క అంగుళమైనా కాళీ లేకుండా రిజర్వ్ బలాలతో నిండిపోయింది. సెంట్ జేమ్స్‌పార్కు ఆ బలగంతో ఇసక వేసినా రాలనంతగా కిక్కిరిసి పోయింది. ఇంకా వైట్‌హాల్, చార్లెస్ స్ట్రీట్ మొదలైన పెద్ద పెద్ద వీధుల్లో అంతటా సాయుధ రక్షక భటులు గుర్రాలెక్కి సిద్ధంగా నిలబడ్డారు. సెంట్ జార్జ్ వీధి వీధంతా పోలీసుల హయాంలోకే వచ్చేసింది! ప్రతీ ఇంటి కప్పుమీద పోలీసు పహరా ఏర్పాటు చేశారు! విదేశ మంత్రి ఇంటి కెదురుగా ఉన్న ప్రతీ ఇంటిముందు గదీ పూర్తిగా సోదా చేశారు. నిజానికా ప్రాంతంలో అంతటా సైనిక శాసనం ప్రకటించినట్లే ఉంది!

రెండు పటాలాల సైనికులు సర్వసన్నద్ధులై సిద్ధంగా నిలుచున్నారు సర్ ఫిలిప్ లేమన్ గదిలో అసిస్టెంటు కమీషనరు, ఫాల్ మాత్‌తో సహా ఆ చట్టం ఆపు చేయించవలసిందని అనేక విధాలుగా వాదిస్తున్నాడు. మంత్రి మాత్రం మొండి పట్టు పట్టుకు కూర్చున్నాడు. చిట్టచివరికి అసిస్టెంటు కమీషన రతనితో ఇలా అన్నాడు.

"అయ్యా! మే మింతకన్నా చెయ్య గలిగిన దేమీ లేదు! అయినా నా కింకా భయంగానే ఉంది. వీళ్లకేవో అత్యద్భుతమైన శక్తిసామర్థ్యా లున్నట్టు కనిపిస్తున్నాయి! మనం ఎంతగట్టిగా కట్టుదిట్టాలు చేసినా ఎక్కడో ఒక లోటుండిపోయిందేమోనని నా భయం! మనం ఎక్కడైనా ఒక్క చిన్నవిషయంలో పొరబాటు పడితే వాళ్ళది కొంచెం కనిపెట్టి మన పీకల మీదికి తీసుకువస్తున్నారేమోనని అనుమానంగా ఉంది. ఓల్డ్ మార్కెట్ ఈవిధంగా వచ్చిపోవడం చూస్తే నాకు చాలా కంగారుగా ఉంది. వాళ్ళెక్కడ పడితే అక్కడే ప్రత్యక్షమౌతున్నారు! ఇక వాళ్ళు చేయలేనిపని అంటూ ఏదీ కనబడదు! మీరు కొంచెం ముందువెనక లాలోచించి మరీ ఇందులోకి దిగవలసిందని నా ప్రార్థన ఇప్పుడీ చట్టం పాస్ చేయించవలసినంత పెద్ద అవసరం ఏమి ఉంది?"

అని కొంతసేపాగి—

"అంత మీ ప్రాణాలకు కూడా తెగించవలసిన అత్యవసరపరిస్థితి ఏమి వచ్చింది?" అని కుండ బద్దలుకొట్టినట్లు అడిగేశాడు. ఈ ప్రశ్న విని సర్ ఫిలిప్ బాగా జంకిపోయాడు. తరవాత కొంచెంసేపు లోలోపల ఏదో ఆలోచించుకొని గొంతు తగ్గించి నింపంగా ఇలా అన్నాడు:

"ఏమైనాసరే! నేనీ చట్టం ఉపసంహరించడం జరగదు! నేనిందులో చాలా దూరం వెళ్ళిపోయాను! మరి ఇప్పుడిక వెనకంజ వెయ్యడానికి వీల్లేదు! ఇక ఇందులో న్యాయాన్యాయ విచక్షణ తప్ప మరేమీ లేదు! గాభరాపడి భయపడిపోతే ఇక లాభమేమిటి?

ఈ విదేశీయు లెవళ్లో మనదేశంలో తిష్ఠవేసు కూర్చున్నారు. చట్టం ప్రకారం వీళ్ళనేమీ చెయ్యడానికి వీల్లేదు. ఇందుచేత బరితెగించి పైవాళ్ళచేత కూడా దారుణాలు చేయించేస్తున్నారు. వీళ్ళని వెళ్లగొట్టడానికి నేనిప్పుడు ప్రవేశపెట్టిన ఈ చట్టం న్యాయమా? అన్యాయమా? అన్నదొకటే ప్రశ్న! నేను చేసేది - న్యాయమైతే — ఆ అపూర్వ హంతకులు చేసేదంతా తప్పేనన్న మాట! వాళ్లు చేసేపనే న్యాయమయితే — ఈ 20వ శతాబ్దంలో నేనొక దారుణమైన చట్టం ప్రవేశపెడుతున్నానన్నమాట! ఈ చేసేదంతా తప్పే నన్నమాట! ఏది ఏమైనా ఈ వ్యవహారంలో మంచి చెడ్డలు నిర్ణయించి, నిశ్చయించుకోవలసింది నేనొక్కణ్ణే ఇక ఈ వ్యవహారంలో ఒక నిశ్చయానికి వచ్చేశాను. దీనివల్ల వచ్చే కష్టసుఖాలన్నీ ధైర్యంగా ఎదుర్కోవాలని కూడా నిశ్చయించాను."

అక్కడ ఉన్న వారిద్దరు కనురెప్పపాటు లేకుండా అలాగే అతనికేసి చూస్తూ నిలబడి పోయారు.

తరవాత మంత్రి మళ్ళీ ఇలా అన్నాడు:

"మీరీ కట్టుదిట్టాలు చెయ్యడం మంచి పనే అయింది. నేనవసరంగా మీమీద రుసరుసలాడాను—"

అసిస్టెంట్ కమీషన రతని మాటకు అడ్డుతగిలాడు: "మనం ఇంకా బాగా జాగ్రత్త పడాలి. ఈ వేళ సాయంత్రం ఆరున్నర మొదలుకొని 8 గంటలదాకా మీరు చదువుకొనే గదిలోనే కూర్చోవాలి. ఇది చాలా మంచిదని మా అభిప్రాయం! ఏమైనా సరే! ఎవరు వచ్చినా సరే! తలుపు తెరవకూడదు. ఆఖరికి నేను, ఫాల్‌మాత్ వచ్చినా సరే! ఆ సమయంలో మీరు తలుపు తాళం వేసుకొని లోపలే కూర్చోవాలి."

తరవాత కొంచెం తటపటాయించి—

"లేకపోతే మాలో ఎవరమయినా మీ పక్కన కూర్చోడం అవసరమయితే కూర్చుంటాం!" అన్నాడు.

మంత్రి "వద్దు! వద్దు! అది వీల్లేదు. నిన్న వాళ్లు మారువేషం వేసుకు వచ్చినప్పటినించీ ఒంటరిగా ఉండడమే మంచిదనిపిస్తోంది! అదే మంచిది!" అన్నాడు కంగారుపడుతూ.

కమీషనరు—"అబ్బే! ఆ భయమేమీ లేదు! ఇందులోకిక నరమానవు డెవడూ రాలేడు. రాత్రి గదిలో ప్రతి అంగుళము సోదా చేయించాను. పైగా ఇంకా గట్టి కోసం ఉక్కుతలుపులు, ఊచలుకూడా బిగించారు."

అని చెప్పి ఆ గది వ్యవహారం అంతా తనకి క్షుణ్ణంగా తెలుసునన్నట్లుగా హేలగా అటు ఇటు చూశాడు. తరవాత అతనికక్కడ ఒక సరికొత్త వస్తువు కనిపించింది. అది ఒక చిన్న పింగాణీ పూలకుండీ. దాని నిండా గులాబీ పువ్వులు! "ఇది ఇక్కడి కెలా వచ్చింది?" అన్నాడు, ఆ పువ్వులు వాసన చూడడానికి కొంచెం వంగుతూ.

"అవునవును! అవి నిన్ననే మా సొంత భవంతినించి పంపించారు!" అన్నాడు మంత్రి!

అసిస్టెంటు కమీషనరు మెల్లిగా ఒకపుత్త్యేక తుంచి పరిపిలేస్తూ—

"ఇతరి అచ్చంగా అసలు గులాబీపుత్తుల్లాలు లాగే ఉన్నారే!" అన్నాడు.

ఇలా మాట్లాడుతూంటే అతనికి ఇంకేదో భయంకరమైన ఆలోచన తట్టింది. తరవాత అతను నెమ్మదిగా ఆ పాలరాతిమెట్లు దిగి కిందికివచ్చాడు. అక్కడ మెట్టు మెట్టుకీ ఒక పోలీసు కాపలా కాస్తున్నాడు. తరవాత కమిషన రక్కడ నిలబడిన ఫాల్ మాత్ తో ఇలా గన్నాడు:

"అంత మొండిపట్టు పట్టుతున్నాడంటే - దానికి కారణం లేకపోలేదు! నిజానికి ఈ వేళ ఆయన గుండె నిబ్బరంచూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. కాని—లోలోపల మాత్రం నాకీ విషయంలో చాలా కంగారుగా ఉంది. ఏమో ఏం జరుగుతుందో మరి!"

ఇది విని ఫాల్ మాత్ మాటాడ కూరుకున్నాడు,

అసిస్టెంటు కమీషనరు మళ్ళీ మొదలు పెట్టాడు.

"ఆ నోటుబుక్కులో అంతగా చెప్పకోదగ్గ దేదీ కనిపించడంలేదు! కాని ఆ వీధుల జాబితా చూస్తే మాత్రం చాలా కంగారుగా ఉంది! నా మట్టుకు నాకా వీధుల జాబితా లోలోపలి అర్థమేమిటో బోధపడడంలేదు!"

తరవాత అసిస్టెంటు కమీషనరు పోలీసు గుంపుల మధ్యలోనించి వీధిలోకి వెళ్లిపోయాడు. గట్టిగా కట్టుదిట్టంగా ఏర్పాటు చేసిన బందోబస్తులవల్ల జనానికి డౌనింగ్ స్ట్రీట్ లోలోపల ఏమేమి జరుగుతూందో ఏమీ బోధపడడంలేదు! చివరికి రిపోర్టర్లను కూడా లోపలికి రానీయడం ఆపివేశారు. ఇక సాయంత్రం పేపర్లకు స్కాట్లండ్ యార్డ్ కొసరి కొసరి అందిచ్చిన భోగట్టా ఒక్కటే శరణ్యమయింది. ఈ పేపర్లకు చేజిక్కిన భోగట్టా చాలా కొంచమే. కాని దానిమీద ఆ పేపర్లు కట్టిన గాలిమేడలు మాత్రం ఆకాశందాకా వెళ్ళిపోయాయి!

ఇక 'బాకా' ఈ అపూర్వ హంతకుల వ్యవహారం యావత్తు తనకే సంబంధించినదని బుజాలెగర వేసుకుని దానికి సంబంధించిన వివరాల సంపాదనకో సంతాపత్రియ పడడం మొదలుపెట్టింది ఇక ఆ చివరిక్షణం దగ్గిర పడేసరికి లండన్లో ఎప్పుడూ కనీవినీ ఎరగనంతటి గందరగోళం బయలుదేరింది. సాయంత్రం పేపర్లు బయటపడిన ఉత్తరక్షణంలో వేడిగా వేడిగా అమ్ముడుపోయాయి! అయితే ఆ పేపర్లలో జనం ఆదుర్దాకు తగినన్ని విశేషాలేవీ ఉండేవికావు గాని—వాళ్లంతా ఉన్నవాటితోనే సంతృప్తిపడి ఊరుకునేవారు. ఇక మంత్రి, విదేశశాఖ కార్యాలయం, డౌనింగ్ స్ట్రీట్ మొదలైనవాటి ఫోటోలు ఎక్కడపడితే అక్కడే వాల్లాడిపోయాయి. ఇక అపూర్వ హంతకుల ఫోటోలను గురించీ, వాళ్ళ సాహసకృత్యాలను గురించీ వేరుగా చెప్పనే అక్కరలేదు!

ఇలాగ ఇంగ్లండు ఇంగ్లండంతా అట్టుడికి పోయినట్టుడికి పోతూంటే దానిమీద బిల్లీమార్క్స్ హత్య ఒక పెద్ద బాంబులా విరుచుకుపడింది.

అతణ్ణి కేసులో ప్రత్యేకంగా ఒక డిటెక్టివ్ గానే ఏర్పాటు చేశారని కొందరు కొన్ని పుకార్లు పుట్టించారు! మరికొందరతగాడు విదేశశాఖ ఉద్యోగే అయిఉండవచ్చునని అన్నారు. మొట్టమొదట రైల్వే కంపార్ట్ మెంట్ లో ఆత్మహత్యగా ప్రారంభమైన ఆ హత్యా వృత్తాంతం క్రమక్రమంగా చిలవలు పలవలు వేసి పెద్ద మహా వృక్షంగా మారిపోయింది. హత్యేమో జరిగినమాట నిజమే! కాని దానికి ఉన్నవీ లేనివీ మరికొన్ని పుట్టగించి పేపర్లనిండా ఆ అతిశయోక్తులు గుప్పేరారు! అంతా ఆశ్చర్యమే! అంతా అద్భుతమే! ఈ సమయంలో ఆ చిరుగులకోటు బిల్లీమార్క్స్ ఎక్కడినుంచి ఊడిపడ్డాడు? ఇక స్నైలాగ హత్య చేశారు? ఇలాగ రకరకాలయిన ప్రశ్నలు బయలుదేరాయి. క్రమక్రమంగా రిపోర్టర్లు కొంత భోగట్టా జాగ్రత్తచేసి చేతనైనంతవరకు పాఠకుల కందించారు. ఇలా ఉండగా పోలీసులు వైట్ హాలంతా ఆక్రమించుకున్నారన్న వార్త ఒక్కసారిగా నాలుగువైపులా పాకిపోయింది. దీనినిబట్టి అధికారులు ఎంత కట్టుదిట్టంగా పనిచేస్తున్నారో గ్రహించవచ్చును.

'బాకా' వార్తా సంపాదకుడు దీన్ని గురించి ఇలాగ వ్యాఖ్యానించాడు.

★ అపూర్వ మాంత్రికులు ★

"నేను అక్కడినుంచి చూస్తుంటే వైట్ హాల్ అంతా నాకళ్ళ యెదురుగా ప్రత్యక్షమౌతున్నది! లేకపోతే ఇక్కడ ప్రత్యక్షమయినంతటి అత్యద్భుత దృశ్యం నే నెన్నడూ కనీవినీ ఎరగను! ఎక్కడ చూసినా పోలీసుల బలగాలే! వాళ్ళ సందుల్లోను, గొందుల్లోను కూడా నిండిపోయారు! నరమానవుడెవడూ వాళ్ళని దాటిపోలేడు!"

ఇక పోలీసు కమీషనరు ప్రతి చిన్న విషయంలోను లోక్యం కల్పించుకొని బాగా కట్టుదిట్టంగా పనిచేశాడు. లండన్ పోలీసులు ప్రపంచంలో అంతటా బాగా ప్రసిద్ధి కెక్కారు! వాళ్ళ ధైర్యసాహసాలంతకన్నా ప్రసిద్ధి కెక్కాయి. అలాంటివాళ్ళు కూడా కంగారుపడిపోయి ఇలాంటి కట్టుదిట్టాలు చేశారంటే ఆ అపూర్వ మాంత్రికు లెంతటి అలజడి కలిగించారో గ్రహించవచ్చును!

[illegible] హత్యసంగతి తెలిసి పొక్కగానే వైట్ హాల్ దగ్గర చేరినజనం గుంపు బాగా పెచ్చుపెరిగిపోయింది. రెండుగంటలయ్యేసరికి వెస్టుమినిస్టరు బ్రిడ్జిదగ్గర రాకపోకలాపుచేయించవలసిందని ఫర్మానా జారీ అయిపోయింది. 3 గంటలు గడిచేసరికి సర్ ఫిలిప్ రేమన్ భవంతికి అయిదు వందలగజాలదూరం వరకు ఉన్న ప్రదేశం అంతా పోలీసుల స్వాధీనంలోకి వెళ్ళిపోయింది. ఇక పార్లమెంటు సభ్యులందరికీ పెద్దపెద్ద గుర్రాలెక్కిన పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ సభ్యులకు కొత్తగావచ్చిన ఈ గొప్పదనం చూసి జనం పెద్దగా హర్షధ్వానాలుచేశారు. ఆవేళ సాయంత్రానికి అక్కడ సుమారుగా ఒక లక్షమంది జనం పోగయ్యారు. పాపం వాళ్ళందరికీ అక్కడ కనిపించినవి పోలీసుల దుస్తులు, పార్లమెంటు భవనం, గోపురాలు, ఖాళీఅయిపోయిన భవనాలుమాత్రమే! ఆ విధంగా ఆజనసమూహంఅంతా ఇసక వేసినా రాలకుండా అల్లాగే నిలబడిఉన్నారు. ఒక విదేశీయుడెవడో అక్కడికివచ్చి ఆ జనసమూహాలనుచూసి ఆశ్చర్యపడి—"ఏమిటిదంతా? జనంఅంతా ఇక్కడ ఎందుకు పోగయ్యారు?" అని అడిగాడు.

దానికి సమాధానంగా ఇంకొక ఆసామీ కాలుస్తూన్న పైపు కొనతో ఆవైపు చూపిస్తూ—

"అక్కడ ఒకాయన హత్య జరగాలి! మేమంతా దానికోసమే నిలబడిఉన్నాం!" అన్నాడు.

పత్రికలమ్మే కుర్రవాళ్ళు జనం తొక్కిడిలో ఎలాగో అలాగ కొంచెం సందుచేసుకుని కాయకష్టలా పేపర్లవ్యాపారం సాగించారు. జనం తలలమీదినించే వేలాది పత్రికలు సరఫరాఅయ్యాయి! ప్రతి అరగంటకు కొత్తకొత్త ప్రత్యేకసంచికలు వెలువడ్డాయి. ఆఖరికి థేమ్స్‌నది గట్టుమీదినుంచి జనాన్ని ఖాళీచేయించిన విషయానికికూడా ప్రత్యేకంగా కొత్తసంచికలు బయలుదేరాయి! వెస్టుమినిస్టరు బ్రిడ్జిమీదినించి రాకపోకలు నిలిపివేసినందుకు మళ్ళీ ఇంకొక ప్రత్యేక సంచిక వెలువడింది. పాపం ఈలోగా ఒక సోషలిస్టు ట్రెఫాల్గర్ స్క్వేరుదగ్గర చేరిన జనాన్ని చూచి ఉపన్యాసం దంచడం మొదలుపెట్టాడు. వెంటనే అతగాణ్ణి పోలీసులు అరెస్టుచేశారు. దానికికూడా ఇంకొక ప్రత్యేకసంచిక తయారయింది. ఆ వేళ పత్రికల్లో ఏదిపడినా జనం అదంతా ఆమూలాగ్రంగా చదివేశారు.

ఆ సాయంత్రందాకా జనం అంతటా అపూర్వమాంత్రికుల వింతలన్నీ విస్తారంగా చెప్పుకుంటూ వాటినిగురించి చిత్రచిత్రంగా ఊహాగానాలు చేస్తూ కాలక్షేపం చేశారు. ఒక ఆసామీ ఎదురుగా కనిపించే పెద్ద బిగ్ బెన్ వాచీకేసి చూస్తూ—"ఇక రెండంటే రెండేగంటలు" అన్నాడు. దానినిబట్టి ఆ హత్య జరగడంలో జనానికిగల ఉబలాటం, ఉత్సాహం పసిగట్టవచ్చును. జనసమూహాలకెక్కడా దయ, దాక్షిణ్యము ఉండవు!

తరవాత బిగ్ బెన్ 7 గంటలు కొట్టింది. జనం కోలాహలంఅంతా అణిగిపోయింది. లండన్ నగరంఅంతా నిశ్శబ్దంగా ఆ ఆఖరి గంట అలాగే గడిచిపోవడం నిరీక్షించారు.

పిమ్మట డౌనింగ్ స్ట్రీట్‌లో చేసిన ఏర్పాట్లలో కొన్ని కొన్ని చిన్న చిన్న మార్పులు చేశారు. ఇక ఏడు కొడుతుందనగా సర్ ఫిలిప్ రేమన్ తను చదువుకునే గది తలుపు తెరిచి పోలీస్ కమీషనర్ని, డిటెక్టివ్ సూపర్నెంట్ ఫాల్‌మాత్‌నీ లోపలికి రావలసిందని పిలిచాడు. అంతవరకు అతడు ఒంటరిగానే ఉన్నాడు. వారిద్దరు అతనికొక వాలుగైదడుగుల దూరంలో నిలబడ్డారు.

మంత్రి మొహం బాగా పాలిపోయింది. పాపం అతని మొహంమీద కొత్తగా కొన్ని ముడతలు కనిపించాయి. ఇవి అంతకుపూర్వం లేనేలేవు! ఈ మధ్యనే బయలుదేరాయి. అతని చేతిలో ఒక అచ్చు కాగితం ఉంది. మనిషి చాలా వ్యగ్రంగా కనిపించాడు: ప్రతీమాటా తూచినట్టుగా మాట్లాడుతూ మంత్రి ఇలాగన్నాడు:

"ఇదిగో! నేను లోపల కూచుని తలుపు తాళం వేసుకుంటున్నాను! మనం అనుకున్న ఏర్పాటులన్నీ అక్షరాలా జరిగిపోతున్నాయా?"

కమీషనర్ గంభీరంగా—"అవును సార్! అన్నీ అక్షరాలా జరిగిపోతున్నాయి!" అన్నాడు.

సర్ ఫిలిప్ మళ్ళీ ఏదో మాట్లాడాలని అనుకున్నాడుగాని ఎందుచేతనో ఆ విషయం ప్రస్తావించడం మానేశాడు. తరవాత ఒక్క నిమిషం మాట్లాడకూరుకుని తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా ఇలాగన్నాడు:

"నాకు తెలిసినంతవరకు అన్నీ న్యాయంగానే చేశానని అనుకుంటున్నాను. చివరికి ఏది ఎలాగ జరిగినా సరే—నేను న్యాయంగానే నడుచుకున్నాననే ధీమాతోనే పని చేశాను.—అదేమిటా గోల?"

వీధిలోనించి ఒక పెద్ద గోల వినిపించింది!

ఫాల్‌మాత్ పైకి చూసి—"జనం మీ ధైర్య సాహసాలు మెచ్చుకుంటున్నారు సార్!" అన్నాడు. మంత్రి వెటకారంగా పెదిమలు కొరుకుతూ—ఇలాగన్నాడు:

"చివరికి ఏమీ జరక్కపోతే ప్రాణం వాళ్లంతా చాలా నిరుత్సాహ పడిపోతారు! ఇందులో ఏమీ అనుమానం లేదు! ఇక ఈ జనం మాట! భగవంతుడు నన్ను వీళ్ళ దూషణ భూషణ తిరస్కారాలకు దూర దూరంగా తీసుకుపోతే బతికిపోతాను!"

అని చెప్పి మంత్రి పక్కకి తిరిగి తను చదువుకునే గది తలుపు తెరిచాడు. మెల్లిగా ఆ గది లోపలికి వెళ్లి, లోపల తాళం వేసు కున్నాడు. ఇవతల నిలబడి ఇదంతా చూస్తు న్న ఇద్దరికీ తాళం వేసిన చప్పుడు స్పష్టంగా వినిపించింది!

ఫాల్‌మాత్ తన చేతి వాచీ చూసి వ్యం గ్యంగా "ఇక నలభై నిమిషాలే!" అన్నాడు!

* * *

ఆ అపూర్వ వ్యక్తులు నలుగురు అక్కడ చిమ్మ చీకటిలో నిలబడి ఉన్నారు.

మాన్‌ఫ్రెడ్ "టయమైపోవచ్చింది" అన్నాడు. థేరీ చీకటిలో ముందుకువెళ్ళి దేనికోసమో తడుముకోవడం మొదలు పెట్టాడు.

"ఒక అగ్గిపుల్ల గీస్తాను!" అన్నాడు స్పానిష్ భాషలో బాగా వినుస్తా.

"వద్దు!"

అది పాయ్‌కార్ట్ తీవ్ర కంఠస్వరం! పాయ్‌కార్ట్ గబగబ ముందుకువెళ్ళి వేళ్లతో తడుముకుంటూ ఆ ప్రదేశానికి దగ్గరగా వెళ్ళి పోయాడు! అక్కడ అతనికొక చిన్న ఇనపతీగ చేతికి తగిలింది. అది జాగ్రత్తగా థేరీ చేతికి అందిచ్చాడు. ఇంకా కొంచెం ముందుకువెళ్ళి ఇంకొక తీగ పట్టుకున్నాడు. థేరీ ఆ రెండు తీగలు అతిజాగ్రత్తగా అతికించాడు! థేరీకి ఈ హడావిడిలో ఊపి రాడడం లేదు! ఎలాగో అలాగనిలబడి,— "ఏం టయిమైందా?" అని అడిగాడు.

మాన్‌ఫ్రెడ్ అతిజాగ్రత్తగా ఆ చీకటిలో వాచీకేసి చూశాడు. కొంతసేపంతా నిశ్శ బ్దంగా ఉన్నారు!

వెంటనే మాన్‌ఫ్రెడ్ "టయిమయి పోయింది!" అన్నాడు!

తరవాత థేరీ కుడిచెయ్యి ముందుకు చాపాడు! చాచీచాచడంతోనే కుప్పగా కూలి నేలమీద పడిపోయాడు! మిగిలిన ముగ్గురు థేరీ మూలుగులు విన్నారు! వాళ్ళకి థేరీ తిన్నగా కనబడలేదుగాని అటూ ఇటూ దొర్లుతున్న అతని శరీరం మాత్రం కొంచెం చూచాయగా కనిపించింది. అంతకుముందు అతడు దభీమని కిందపడిన చప్పుడుకూడా వినిపించింది.

"ఏం జరిగింది?" అని వణికిపోతూ ఎవరో అడిగినట్లు వినబడింది. ఆ అడిగినవాడు గోన్సాలెజ్!

మాన్‌ఫ్రెడ్ థేరీ పక్కగా నిలబడి అతని నడ్డి పట్టుకోవాలని ప్రయత్ని స్తున్నాడు. మెల్లిగా ఇలాగన్నాడు:

"థేరీ చేతివాతా గాకుండా వ్యవహరిం చాడు. వెంటనే దానిఫలితం అనుభవిం చాడు!"

"మరి రేమన్ మాటో?"

మాన్‌ఫ్రెడ్ నేలమీద పడిపోయిన థేరీ గుండెమీద చెయ్యిపెట్టి పరీక్షిస్తూ—

"ఆ సంగతి నేను చూస్తానుగా! ఇంత లోనే మించిపోయిందేముంది!" అన్నాడు.

* * *

ఫాల్‌మాత్‌కా నలభై నిమిషాలు ఒక పెద్ద యుగంలా కనిపించాయి! తనింతకు పూర్వం పనిజేసిన పెద్ద పెద్ద కేసుల వ్యవహా రాలు, వాటిల్లో తన సాహసకృత్యాలు తలుచుకుంటూ ఆ కాసేపు కులాసాగా గడిపి వెయ్యాలని అనుకున్నాడు గాని అతనికి పూర్తిగా మతిపోయినట్టయింది. లోలోపల అంతా కంగారే! అంతా ఆందోళనే! ఏమీ తోచలేదు! ఆ ప్రాంతంలో ఎవరూ పెదిమలుకూడా కదపకూడదని ఫర్మానా జారీచేశారు! ఎక్కడా గుసగుసలు మినహా ఏమీ వినబడడం లేదు! అంతా నిశ్శబ్దం!

పోలీసులు ప్రతిచోటా- మూల మూలలా కాపలా వేశారు! ఆ పోలీసులందరి చేతు ల్లోను ఆయుధాలున్నాయి! ఫాల్‌మాత్ ఒక్కసారి మళ్ళీ వాళ్ళందరినీ పరీక్షించాడు అతడు కార్యదర్శి ఆఫీసులో కూర్చున్నాడు. ప్రతీ తలుపు తెరిచివేశారు. పోలీసులందరు ఒకరొకరికి బాగా స్పష్టంగా కనబడాలనే ఈ ఏర్పాటు చేశారు.

ఫాల్‌మాత్ పోలీసుకమీషనరుతో మాటి మాటికీ చెప్పిందే చెబుతున్నాడు. మళ్ళీఅదే చెబుతూ మెల్లిగా ఇలాగన్నాడు.

"ఇంతకీ ఏమౌతుందో చెప్పలేనుగాని వాళ్ళన్నమాట నెగ్గించుకోవడం చాలాకష్టం. ఇందులో ఏమీ అనుమానం లేదు!"

దానికి కమీషనరు చెప్పిన సమాధానం ఇది: "వాళ్లుచెప్పిన ప్రకారం జరగకపోతే ఇంక ఈ గొడవ తలపెట్టకుండా గప్‌చిప్‌గా మాట్లాడ కూరుకుంటారా? లేకపోతే మళ్ళీ ప్రయత్నిస్తారా? ఇదే నేనాలోచిస్తు న్నాను! ఒక్కటిమాత్రం నిజం! రేమన్ కనక ఈగండంగడిచి బయటపడితే ఆ దరిద్ర గొట్టు బిల్లు ఆట్టే గొడవలేకుండా పార్లమెం టులో పాసైపోతుంది!"

అని వాచీ చూశాడు. నిజానికి సర్ ఫిలిప్ గదిలోకి వెళ్ళినప్పటినించీ అతడా వాచీ అరి చేతులో పెట్టుకుని మాటిమాటికీ దానికేసి చూస్తూనే ఉన్నాడు. తరవాత—

"ఇక అయిదేనిమిషాలు!" అన్నాడొక పెద్ద నిట్టూర్పు విడుస్తూ.

తరవాత సర్ ఫిలిప్ గది తలుపు దగ్గరికి వెళ్ళి

అపూర్వ హంతకులు

తలుపుమీద చెవిపెట్టి జాగ్రత్తగా విన్నాడు. పిమ్మట "ఏమీ వినబడడంలేదే!" అన్నాడు.

తరవాత అయిదునిమిషాలూ గడిచేసరికి అతనికి మళ్ళీ ఒక పెద్దయుగం గడిచినట్టయింది.

"సరిగ్గా ముల్లు ఎనిమిదిమీదికి వచ్చింది!" అన్నాడు ఫాల్‌మాత్ అతి కష్టంమీద! దూరంగా బిగ్ బెన్ గంటకొడుతున్న ధ్వని వినిపించింది! ఇద్దరూ ఊపిరికూడా విడవడం మానేసి ఆధ్వని విన్నారు

"రెండు!" అన్నాడు ఫాల్‌మాత్ గంటలు లెక్కపెడుతూ.

"మూడు!"

"నాలుగు!"

"అయిదు!—ఆగేమిటి?" అన్నాడు కంగారుగా!

"నాకేమీ వినబడలేదే!—అవునవును!—ఏదో వినిపించింది."

అనిచెప్పి తలుపుతాళంచెవి సందుదగ్గిర చెవిపెట్టాడు. తరవాత—

"ఏమిటది! ఏమిటది!" అని రెండు కేకలు పెట్టాడు.

తరవాత ఆగదిలోనించి ఒక పెద్దకేక, వెంటనే ఏదో పడిపోయిన చప్పుడు వినిపించాయి!—తరవాత మళ్ళీ నిశ్శబ్దం!

"త్వరగా రండి! త్వరగా రండి! ఇదిగో ఇక్కడికి!" అని గట్టిగా అరిచాడు ఫాల్‌మాత్ వెంటనే కాయశక్తులా గదితలుపు గుంజడం మొదలుపెట్టాడు!

ఎంత తోసినా తలుపు ఒక అంగుళమైనా జంకలేదు!

"అందరూ కలిసి గట్టిగా గుంజండి! త్వరగా!" వెంటనే ముగ్గురు పిడిరాళ్ళలాంటి కనిస్టేబులు కలిసి తలుపుగట్టిగా గుంజారు. దబాలున తలుపు తెరుచుకుంది!

"అమ్మయ్యో!" అని ఫాల్‌మాత్ గట్టిగా అరిచాడు! విదేశమంత్రి సర్ ఫిలిప్ రేముజ్ శరీరం ఎదురుగా బల్లమీదికి పడి ఉంది! బల్లమీద సామానులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి! ఏదో అక్కడ కొంత గలభా జరిగినట్టే ఉంది.

కమీషనరు ఒక్కఅంగలో లోపలికివెళ్ళి బల్లమీద పడిపోయిన మంత్రిని కూర్చోబెట్టాడు. అతనికేసి చూస్తూనే దప్పరించివేసి- "ప్రాణం పోయింది!" అన్నాడు మెల్లిగా. ఒక్కసారి చుట్టూ చూశాడు! అక్కడ ఆ మంత్రిశవము- చుట్టూ పోలీసులు! ఇంక అంతకన్నా అతనికా గదిలో ఇంకేమీ కనబడలేదు! అసిస్టెంటు కమీషనరు మొహం తెల్లగా కళాయివేసినట్లయింది!

—ఇంకా ఉంది.

మరీచిక

ఇంత ప్రొద్దున్నే ఎవరు పిలుస్తున్నారా అని డాక్టర్ మోహన్ ఆశ్చర్యంగా, బద్ధకంగా ఆవలిస్తూ, చిటికలు వేస్తూ కళ్లు తెరిచాడు. కాలివేళ్లతో కప్పుకున్న రగ్గు క్రిందికి లాగుతూ, తూర్పువైపు కిటికీ తెరిచాడు. నగరమంతా మసకచీకటి దుప్పటిలో ముఖం దాచుకుని బద్ధకం తీర్చుకుంటోంది. ఉదయాకాశంలో తొంగిచూసే కాంతిరేఖలలో మంచుకి తడిసిన ఆకుల గుబుర్లన్నీ అద్దాలమేడలలాగా మెరుస్తున్నయ్.

కాలింగ్ బెల్ [illegible] సేపటినుంచీ ఒక్క వరసన మాగు [illegible] సమాధానం లేని సుదీర్ఘ ప్రశ్నార్థకంగా సాగుతూ వాగుతోంది.

ఇంకా నౌకరైవరూ పనికి రాలేదు. తన ఆసుపత్రి తొమ్మిదింటికి కాని తెరవరని అందరికీ తెలుసు. ఇన్నేళ్ళ అనుభవంలోనూ ఇంత పెందలకడవచ్చి తనికి నిద్రాభంగం చేసినవాళ్లు ఒక్కరూ లేరు. తను మానసిక వ్యాధుల చికిత్సలో విదేశాలకికూడా వెళ్లి విశేషమైన కృషి చేసి విశిష్టమైన నైపుణ్యం సంపాదించివచ్చాడు. తన దగ్గరికి వచ్చే రోగులకి నిమిషాలలో ముంచుకుపోయే ప్రమాదం ఏమీ వుండదు. అందువల్ల అర్ధరాత్రివేళ తెల్లవారుజామునా వేళకాని వేళల్లో వచ్చి పీక్కుతినే రోగులతో అతనికి పరిచయం లేదు. కనక నే మరీ ఆశ్చర్యంగావుంది. గ్రేప్‌సూట్ పేస్టు వేసుకుని, జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ వెళ్లి తలుపుతీశాడు. తన కళ్లని తను నమ్మలేకపోయాడు. చూస్తున్నది స్వప్నమో సత్యమో తెలుసుకోలేక తికమక పడ్డాడు. తెమునికలల పాలపుంతలలోంచి కాలుజారి మెరుపువ పొలిమేరలలోకి పొరబాటునవచ్చి నిలిచిన లావణ్యరాశియేమో అని ఆశ్చర్యంతో రెప్ప వాల్చలేకపోయాడు.

పెదవులమీద ఒయ్యారంచిందే చిరునవ్వు కొంటుకతో పదునెక్కిన చురుకు చూపులు. చేతిలో ప్లాస్టిక్ సంచీ, కాళ్లకి ఎత్తుమడమల ముఖుమల్ జోళ్లు, మెళ్లో పచ్చటి శరీర కాంతితో సరసాలాడుతున్న నల్లటి పూసలదండ, కుడిచేతికి చిన్న గడియారం. ఆ సుకుమార శరీరపు సోయగంలో కలిసి కరిగిపోతున్న సాలీడు దారాలని వెక్కిరించేటంత నాజూకైన తెల్ల సిల్కు చీర, దానితో దోబూచులాడుతూ ఆకుపచ్చ వెల్వెట్ చోళీ!

డాక్టర్ మోహన్‌రావు ముఖంలో పొడగట్టిన ఆశ్చర్యాన్ని దిగ్భ్రమనీ ఒక్క నవ్వుతో చెరగొడుతూ "ఇంతపొద్దున్నే వచ్చి నిద్రాభంగం చేసినందుకు మన్నించాలి" అని కళ్ల కొనలలోంచి వాలుగా చూసింది.

"మరేం ఫరవాలేదు లోపలికి రండి." అని మోహన్రావు ఆహ్వానించాడు.

అతని వెనకాలే నడిచివచ్చి డ్రాయింగ్ రూమ్ లో సోఫాలో కూచుని వచ్చిన పని మరిచిపోయినదానికి మల్లే గోడల నున్న బొమ్మలూ, కేలండర్లూ పరిశీలిస్తున్నది. ముఖం కడుక్కోటం పూర్తి చేసి చింపిరవంపిరగా రేగిన క్రాపు సరిగా దువ్వుకుని సోఫాలో ఎదురుగా కూచున్నాడు డాక్టర్. కాఫీకోసం ఎదురుచూస్తూ ప్రసంగం అందుకున్నాడు.

"నన్ను మీరెప్పుడూ చూసివుండరు. కాని నేనుమాత్రం మిమ్మల్ని గురించి చాలా విన్నాను" అంది ఆమె ఏమీ బదులు చెప్పాలో తోచక నవ్వి ఊరుకున్నాడు.

"మానసిక వ్యాధులకు కుదర్చటంలో మీకు మీరేసాటి అని ఎందరో అనుకోగా విన్నాను సుమండి".

లోపల అమ్మయ్య అనుకున్నాడు మోహన్. ఇంతేకదా ఇంకేం విన్నదో అని భయం వేసింది మొదట.

"మీ వాళ్లెవరైనా మనోవ్యాధితో బాధపడుతున్నారాయేమిటి?" అని కుశలప్రశ్న వేశాడు డాక్టర్. తన ప్రజ్ఞని గురించిన ప్రశంసకి గుబ్బుం ఎక్కినంత పని అయింది.

"ఎవరో అయితే ఇంత శ్రమపెడతానా మిమ్మల్ని? ఇంత పొద్దున్నే మునిగిపోయినట్లు వచ్చి నిద్రమంచంమీదినుంచి లేవకొడతానా చెప్పండి?" అని కళ్లు తిప్పుకు మురిపించింది. మాటల్లో తేనెల సోనలు.

"మీకు దగ్గరవాళ్ళయి వుంటా రనుకుంటాను. నిజమేనా? జబ్బులక్షణా లేమిటి?"

"అవునవును సరిగ్గా ఊహించారు. అందుకే ఇతరుల మనస్సులని తెరిచిన పుస్తకాలలాగా చదివెయ్యగలరని అంతా అంటారు. మావారి విషయం సంప్రదించటానికే వచ్చాను".

"మీ వారి పేరు?"

"షా ఫూల్‌చంద్ ముఫత్‌లాల్; పెద్ద వజ్రాల వ్యాపారి. మీరు విని వుంటారు".

"అల్లా గంటారేం? వారిపేరు వినని వెవరుంటారు? చాలా యేళ్లు మునిసిపల్ చైర్మన్ గా ఉన్నారు".

"అవునవు. అప్పటికి వారిని నే నెరుగను లెండి. ఇటీవలే మా వివాహం జరిగింది బొంబాయిలో..."

"ఓ! అల్లాగా. మరి సేఠ్ గారికి సుస్తీ యేమిటి?"అన్నాడు డాక్టర్. ముఫత్ లాల్ సేఠ్ మీద పట్టలేని అసూయ కలిగింది. వసివయస్సు దాటి కూడా ఇంత సుందరాంగిని ఎల్లా పొందగలిగాడో! డబ్బుతో కొనలేని వస్తువంటూ లోకంలో లేదా అనిపించింది.

"సేఠ్ గారికి లేని సుస్తీ ఏమిటని అడిగితే జవాబు చెలికవుతుంది. ఈమధ్య ఆయనకు గొప్ప మానసికవ్యాధి ఒకటి పట్టుకుంది. అస్తమానమూ అదే ఆలోచన. అందరూ తనకు బాకీవున్నా రంటారు. పుస్తకాల నిండా ఏవేవో పేర్లురాసి వీళ్లు వెయ్యి, వీళ్లు నాలుగువేలు, ఇంకోళ్లు పదివేలు ఇవ్వాల్సి ఉన్నారని కాకుల లెక్కలు తయారు చేస్తారు. మెడమీద తలకాయవున్న ప్రతివాడు తనదగ్గిర వంచిపస్తువో, బంగారపు గొలుసో రాళ్ళ ఉంగరమో కొని

★ మరీచిక ★

డబ్బు యివ్వలేదంటాడు. నిజమో నేమో
నని ఆరాతీస్తే అవతలివాళ్లు "రామ రామ!
విమీ ఎరగం!" అంటున్నారు ఈయన
మాటలు నమ్మకపోతే ఈయనకి కోపం. నిజ
మని నమ్మి అవతల వాళ్లని అడగబోతే వాళ్లకి
కోపం. మధ్యన నేను నలిగిపోతున్నాను.
నాకు దిక్కు తెలియటం లేదు. ఆయన జబ్బు
కుదిర్చి నన్ను రక్షించాలి. ఫీజు విషయం,
సంకోచించకండి డాక్టరుగారు! మీరు ఎన్ని
వేలడిగినా సరే. జబ్బు కుదరాలి కాని డబ్బుకి
లెనకాడేది లేదు..." అని నిట్టూర్చింది;
చేతి రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ ఆ
రుమాలుతోపాటు మల్లెపూల పరిమళం
రెక్కలు విప్పుకుని గది అంతా ఎగిరింది.

"అంతా తనకి బాకీపడ్డట్లు ఊహించు
కుంటారన్న మాట సేర్ గారు. ఇదొక
భ్రాంతి. అది తొలగిపోతేగాని మనశ్శాంతి
దొరకదు. సరే ఇవాళ వారిని ఇక్కడికొక
సారి తీసుకు రాగలరా? కొన్ని ప్రశ్నలు
వేసి పరిశీలన చేసి చికిత్స ప్రారంభిద్దాం."

"అయితే శెలవు డాక్టరుగారూ! మీ మేలు
ఎన్నటికీ మరిచిపోలేను. సాయంకాలం
మూడూ నాలుగూ మధ్య వస్తాం. మీరు తీరు
బాటుగా వుంటారా?"

"మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను.
ఇంతకీ మీ పేరేమిటో చెప్పారు కారు!...

"మిసెస్ శంపాలతా ముఫత్ లాల్! శెలవా
మరి?" అని చేతులెత్తి నమస్కారం చేసి
ఇంకో ఒయ్యారపు చిరునవ్వుతో గది నంత
టినీ వెలిగించి వెళ్ళిపోయింది.

మనిషికి తగినపేరు! నిజంగా మెరుపు
తీగె! మబ్బుల్లో వొంకెలు తిరుగుతూ తాచు
పాములాగా దూసుకుపోయే మెరుపుతీగె!

హృదయ కుసుమపు మృదుదళాలని మధు
రంగా కదిలించే వింతరంగుల సీతాకోక
చిలుక!

మూడు ఎప్పుడవుతుందా అని మోహన్
రావు వెయ్యికళ్ళతో వేచి కాచుకున్నాడు.

స్థాపితము: 1920 సంగరం.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరా
లకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.

2

"ఈ నెక్ లెస్ ఖరీదెంత సేర్ జీ?" అని
ఆ యువతి నాజూకైన వేళ్ళతో ఆ ప్యా
యంగా నిమురుతూ, మెరిసే రాళ్లని కలిపే
బంగారపు పనితనాన్ని మెచ్చుకుంటూ అడి
గింది.

సేఠ్ ముఫత్ లాల్ టోపీ సవరించుకుంటూ
సిల్కు లాల్చీ లోంచి తొంగిచూస్తున్న
లంబోదరాన్ని నిమురుకుంటూ "మీకు
నచ్చిందా? పసంద్ చేస్తే ధరదేముంది. పది
ఇటో అటో!" అన్నాడు. తన యౌవనం
అప్పుడే అంతరించిపోయి జీవితంలో శిశిరం
తొంగిచూస్తున్నందుకు పుట్టెడు దిగులు
వేస్తోంది. ఇటువంటి జవానీలని చూసి
నప్పుడు గతకాలపు రసికత్వమూ, లాలసా
ముఫత్ లాల్ మనస్సులో తలఎత్తి బాధపెడ
తయ్. మీ శాలమీద తేనెలు! ట్చ్...

"ఇంతమంచి ఆభరణాలు మీరు ఎక్కడ
తయారుచేస్తారు సేఠ్ జీ! మీ దగ్గర దొరికిన
మాదిరి రాళ్ళు, రవ్వలూ,
వజ్రాలు ఇంకెక్కడా
దొరకవని అంతా అనుకుంటూ వుంటారు!"
అని నెక్ లెస్ ని కేసులో పెట్టి మూసివేసింది.

అసలు పళ్ల స్థానంలో నిక్కిన బంగారపు
పళ్లు ఒక్కసారి మెరిసేట్లు నవ్వి "భాయ్!
దో కప్ గరమ్ చా లావో!" అని కేక
వేశాడు.

"నేను చా తాగను సేఠ్ జీ!"

"కాఫీ తెప్పిస్తాను మేడమ్!"

"ఇప్పటికే చాలా డోసులయినయ్. వద్దు.
థాంక్స్."

"కూల్ డ్రింక్స్ తెప్పిస్తాను పుచ్చు
కోరూ!"

"అమ్మో! ఇంత చలికాలంలో కూల్
డ్రింక్సా? ఏమీ వద్దులెండి. మీ షాపులో
నిలబడి ఈ తళతళ మెరిసే హారాలకేసి
చూస్తుంటే లోకమే మరిచిపోవాలని
పిస్తుంది...నక్షత్ర మండలంలో నిలబడ్డట్లుగా
వుంది"...

"హాహ్హ హ్హా" అని ముఫత్ లాల్ ఎదురు
గుండావున్న నిలువెత్తు అద్దంలో నీడ చూసు
కుంటూ తొంగిచూసే తెల్ల వెంట్రుకల్ని
టోపీలోకి తోస్తున్నాడు.

"సేఠ్ జీ! చెప్పండి, దీని ధర ఎంతో?"
అని గోముగా అడిగింది ఆమె తల విలాసంగా
తిప్పుతూ.

"మీరు అడుగుతున్నారుగనుక పదిహేను
వేలకు. దమ్మిడీ తక్కువలేదు. ఇంకెవరైనా
అయితే ఖచ్చితంగా పదిహేడువేలు చెప్పే
వాణ్ని!" అని ఆమె ముఖంకేసి చూశాడు.

ప్రతిభ

చదువుకున్న భార్యలున్న
శోభనాద్రు లిద్దరు కలుసు
కొన్నారు.

"మా నరూకి తెలియనిది
లేదోయ్. ఏవిషయంమీద
నైనాసరే అలా అనర్గళంగా
మాట్లాడేస్తుంది" అన్నా
డొకాయన.

"మా ఆవిడకి ఏదో ఒక
విషయం ఉండాలన్న పట్టింపు
ఏంలేదు తెలుసా?" అన్నాడు
రెండో ఆయన.

"ఓస్! ఇంతేనా? పాతిక వేలదాకా
వుంటుందనుకున్నాను సుమా!" అంటూ
పెట్టె తెరిచి ఇంకోసారి నెక్ లెస్ కేసి తనివి
తీరా చూసింది.

ఇంకో వెయ్యి ఎక్కువ చెప్పకపోయానే
అని లోపల నాలుక కొరుక్కున్నాడు సేఠ్
ముఫత్ లాల్. కాని అటువంటి అందాల
రాశి తన దుకాణంలోకి అడుగుపెట్టి అంత
సేపు తన లావణ్యకాంతులతో నింపివేసి
నందుకు ఆపాటి త్యాగం చెయ్యకపోతే
ఎల్లాగా అని అతని అణగారే రసికత్వం
మందలించింది.

"తీసుకువెళ్లి వారికి చూపించి ఒప్పిస్తాను.
మధ్యాహ్నం మూడున్నరకి వచ్చి మీ పైకం
తీసుకుపోవచ్చు. ఏం సేఠ్ జీ! నా మీద
నమ్మకం లేదా? పోనీ మీ కుర్రవాడి నెవరి
నైనా వెంట పంపండి"

"ఎంత మాట! మీ మీద అపనమ్మకమా!
పోనీ వారు కూడా ఇక్కడికే వచ్చి చూసు
కుంటే బాగుండదూ?" అన్నాడు వ్యాపార
సరళిలో. ఇచ్చే ధైర్యమూ లేదు, ఇవ్వకుండా
వుండే నిబ్బరమూ లేదు.

"వారికి క్షణం తీరిక లేదు. నన్ను వెళ్ళి
సెలక్టుచేసి తెచ్చుకోమన్నారు. డబ్బు
విషయం ఏం అనుమానం వద్దు. మీకు
నమ్మకం లేకపోతే వద్దు లెండి. హీరాచంద్
షాపుకి వెళ్తాను. అసలు ఎప్పుడూ అక్కడే
కొంటాం. కొత్త మోడల్లున్నయ్యేమోనని
ఇక్కడికొచ్చాను..."

"మాఫ్, కీజియే! తీసుకోండి. మీ దగ్గిర
డబ్బు ఎక్కడికి పోతుంది? బాంక్ లో
వున్నట్టే. మూడింటికి మేమే వస్తాంలెండి.
అమానత్ రాసుకుంటాం. మీ పేరు?" అని
అడిగాడు ముఫత్ లాల్.

ఆ నెక్ లెస్ పెట్టెని తీసి సంచీలో సవరించుకొంటూ "మిసెస్ సౌదామినీ మోహన్ రావ్" అని కొంటె చిరునవ్వుని పెదవుల్లో మెరిపించి, సేఠ్ జీ గుండెల్లో రేగుతున్న అనుమానాలని ఒక వాలుచూపుతో కట్టేసి గడప దాటి వెళ్లిపోయింది.

గల్లాపెట్టె ముందు కూచున్న సేఠ్ జీ ప్రాణంలో మాధుర్యం ఒకవంకా, అనుమానం ఒకవంకా సాగరమథనం సాగించినయ్. ఇంత నమ్మకమా? బుద్ధి గడ్డితిని పోయిందా? అయినా అంత పేరు మోసిన డాక్టరు, నెలకి వేలకి వేలు సంపాయించే డాక్టరు తనని మోసం చేస్తాడా? ఎప్పుడు మూడుకొడుతుందా అని వెయ్యికళ్లతో గడియారం కేసి చూస్తూ, బూరుగుదూదిదిండు మీద కూచున్నా తుమ్మముళ్లమీదే కూచున్నట్లు జపం చేస్తున్నాడు ముఫత్ లాల్. కాలం గొంగళిపురుగులాగా పాకుతోంది.

3

సరిగ్గా మూడుంబావు అయింది. పదిహేను వేలకి బిల్లు రాసుకుని సేఠ్ ముఫత్ లాల్ డాక్టర్ మోహన్ రావు ఆసుపత్రికి వచ్చాడు.

"రండి ఒక్కరే వచ్చారా?" అని నిరుత్సాహంతో అడిగాడు డాక్టరు. కంపాలత దర్శనం కాకపోయేసరికి గుండె జారిపోయింది.

"ప్రశ్న అర్థంకాక బిల్లు జేబులోంచి తీసి పదిహేను వేలు మాత్రమే!" అన్నాడు ముఫత్ లాల్.

"వాకే పెట్టావా ఎసరు? నీభార్య చెప్పినట్లుగా నీ కిదోక జబ్బుకింద తయారయింది లాగుంది. నిన్ను నెలరోజులపాటు నర్సింగ్ హోమ్ లో అట్టేపెట్టి పరిశీలించాలి."

"ఇదేమిటండోయ్! డాక్టరుగారు! నాకు జబ్బేమిటి? నా భార్య వచ్చి మీకు చెప్పడమేమిటి? నా భార్య చనిపోయి ఇరవై యేళ్లయిందిగా! బిల్లు తాలూకు పైకం ఇప్పించండి ఇష్టంలేకపోతే నా నెక్ లెస్ వాపసు చెయ్యండి వెళ్లిపోతాను నాకే మేజబ్బూ లేదు"

"నెక్ లెస్ ఏమిటి? ఎవరు కొన్నారు? నేను మీ షాపు మొహం ఎరుగుదు నా?' అన్నాడు డాక్టరు నివ్వెరపోయి.

"మీ భార్య వచ్చి పొద్దున మాషాపులో తీసుకువచ్చారు. పదిహేను వేలకి బేరం ఫైసలు చేశారు. మూడున్నరకి వస్తే పైకం ఇప్పిస్తామన్నారుగా"

"అదేమిటి సేఠ్ జీ! మీరు పొరబడుతున్నారు. నాభార్య మీషాపుకి రావటమేమిటి? నాకింకా పెళ్లికాలేదు. నేను బ్రహ్మచారిని!" అని డాక్టరు అనేసరికి కుర్చీలో కూచున్న ముఫత్ లాల్ నోరు వెళ్లబెట్టి కొయ్యబారిపోయాడు.

నెక్ లెస్ అదృశ్యమైపోయింది. ఇంత లాఘవంగా దాన్ని హరించిన ఆ సుందరి ఎవరో ఇప్పటికీ అంతుచిక్కలేదు.

"అయితే కంపాలతా ముఫత్ లాల్ మా భార్య కాదన్న మాట!"

"రామ రామ, మరి సౌదామినీ మోహన్ రావు తమ భార్య కాదన్న మాట!"

"ఊఁ హుఁ"

ఇద్దరికళ్లనీ జిగేలుమనిపించి ఇద్దరికీ టోపీ వేసి మటుమాయమైన ఆ మెరుపుతీగ ఎవరో ఏమయిందో ఇంతవరకూ ఎవరూ కనుక్కోలేకపోయారు. [ఒక ఆంగ్లకథ ఆధారంగా]

గృహాన్వేషణ

"నేనిప్పుడు ఉంటూఉన్న ఇల్లుమార్చదలుచుకున్నాను. ఇంకో ఇంటికోసం వెతకాలి. నువ్వు కూడా రావాలి" అన్నాడు సూర్యం.

"ఏం; ఇప్పుడున్న ఇంటికేం? అది బాగానే ఉందిగా" అన్నాడు రామం.

"ఆయింటికివచ్చిన ప్రమాదమేమీ లేదు" అన్నాడు సూర్యం.

"మరి?" అన్నాడు రామం.

ఆయిల్లుమార్చడం ఏమాత్రమూ సబబుగా తోచలేదు రామానికి. ఆ యింటికోసం సూర్యంతోపాటు తానూ ఎంతో శ్రమపడి తిరిగాడు. మళ్ళీ ఇప్పుడు ఇల్లు వెదకాలంటే ఆషామాషీ వ్యాపారమా? అసలాయింటిని గురించి రామందృష్టే వేరు.

ఆయింటికేం; అది తాటాకుఇల్లూ కాదు; పెంకుటిల్లూ కాదు; డాబా. చుట్టూ-అంతదక్కడది కాకపోయినా ప్రహరీగోడ ఉంది. ఉత్తరపువైపున ఒక గజం మేర కాస్త పడిపోయింది. ఆద్వారాన వరాహసందోహాలు వచ్చి పోతూఉంటాయి దొడ్లో మినుములూ పెసలూ వంటి వాటిని ఎండబోసిన ఆడవాళ్లు అశ్రద్ధగా ఇంట్లో కూచొని కునుపాట్లు పడుతున్నారో ఏమో అని కాస్తపర్యవేక్షించి, ఎడనెడా హెచ్చరించి పోయే ఆమూగజీవాలమీద కోపపడటం ఏమంత సంస్కారం ఉన్నట్టు?

దొడ్లో మంచినీటి కుళాయి లేదన్నమాటేగాని చక్కగా - చుట్టూ గచ్చు చేయించిన నుయ్యి ఉంది. బారెడంటే బారెడే తాడు చాలు అందులో నీరు కాస్త ఎక్కువ ఉప్పగానే ఉండవచ్చుగాక, అంతపైకి ఉండటంవల్ల తోడుకోవటానికి ఎంత సుఖం! ఆనీళ్లు చెంబులూ తప్పాలాలూ తోలుచుకోవటానికీ, ఏగతా వాడకానికీ పనికివస్తాయి.

అవి చెంబులు తోలటానికి పనికిరావనీ, వాటతో చెంబులుతోలిస్తే ఆ చెంబులు వండి పెంకులలా తయారవుతాయనీ, ఆనీళ్లని కాచినపెంటే తెట్టె గడుతుందనీ, ఆనీటితో మొహం రుద్దుకుందామంటే ఎంత రుద్దినా సబ్బు అరుగుతుంది కాని నురగరాదనీ సూర్యంభార్య అంటుంది కాని, అవి నమ్మదగిన మాటలు కావు.

ఆ నీళ్ళతో పప్పుకూడా ఉడుకుతుందంటారు కొందరు.

'ఉడక కేం చేస్తుంది? పొయ్యి మీద పడేసి మంట పెట్టటం ప్రారంభిస్తే సరి, ఇవ్వాళటికి కాకపోతే ఆపటికయినా ఉడుకుతుంది!" అని సూర్యంభార్య అంటుంది కాని ఆవిడ మోస్తరే అంత.

ఇంటి ముందే కుళాయి ఉంది. జనం రద్దీ కాస్త ఎక్కువయినప్పుడు - బాహాబాహీ, శిఖాశిఖి, బిందెబిందె యుద్ధాలు జరుగుతుంటాయి అనే మాట యథార్థమే అయినా గుమ్మంముందు కుళాయి గనుక అది లెక్కలోకి తీసుకోవలసింది కాదు. అదీకాక, కళాత్మక దృష్టితో చూచినప్పుడు లోలాక్షుల సమరం జరగని కుళాయి శోభాహీనమే అయి ఊరుకుంటుంది కూడా

ఇరుగుపొరుగులవిషయం వేరే చెప్పక్కఱలేదు. అటువంటి పొంతన మరెక్కడా ఉండదు.

ఇంటికి దక్షిణంవైపున పోలీసు ఇన్‌స్పెక్టరుగారి ఇల్లు ఇంట్లో దొంగలు పడతారనే భయంలేదు. వాళ్ళ యింట్లోనే దొంగలు పడ్డారంటే అది వేరే విషయం.

ఇంటి కెదురుగా ప్లీడరు గారి యిల్లు. ఎప్పుడయినా సలహా అవసరమైతే ఇట్టే తీసుకోవచ్చు. ఇంటి కెదురుగా ఉన్నందువల్ల ఒరిగేదేమిటి? ఈయనమాత్రం డబ్బు పుచ్చుకోకుండా సలహా ఇస్తారా? డబ్బిస్తే డెబ్భైమంది ప్లీడర్లు' అని ఎవరైనా అంటే అది వివేచనతో కూడుకొన్న మాట కాదు. ఎలా అయినా ఎదురింటివాడు అనే మొహమాటం ఏమైపోతుంది?

ఇంటికి ఉత్తరపుదిక్కున ఒక సుప్రసిద్ధ నటుని కాపురం. ఎంచక్కా దాంపత్యం అంటే వాళ్ళదే. దంపతులిద్దరూ ఎప్పుడూ యుగళగానలోలురై ఉంటారు ఇంట్లో రేడియో లేని బాధలేదు "విసిగిచస్తున్నాం" అనే ఆక్షేపణ పసలేనిది మాటవరసకి — ఇంట్లో ఎవరైనా కాలంచేస్తారు — అస్తమానమూ అందరూ పరామర్శించటానికి వస్తూ ఉంటారు వచ్చినప్పుడల్లా ఇంట్లో వాళ్లూ ఆ వచ్చినవాళ్లూ కలిసి బృందశోకమే ఆలాపిస్తారు అప్పుడు భరిస్తారా లేదా? దానిమీద ఈ యుగళగానం ఎంత మెఱుగది!

ఇక పక్కవాటావాళ్ళతో పడటం లేదంటాడా వీల్లేదు ఎన్నోసారులు సూర్యమే అన్నాడు. ఆ పక్క వాటాలోని 'అతనూ' తనూ కలసి మెలిసి ఉంటామనీ, అతను ఎంతో మంచివాడనీ, గంగిగోవులాంటి వాడనీను. మొగవాళ్ళ మనసులు కలిసినా ఆడవాళ్ళ స్వభావాలు అతికలేదనటానికి ఆధారం లేదు. 'అతని' పత్ని ఇతని అర్ధాంగి కూడా చాలా స్నేహంగా ఉంటారని సూర్యమే చెప్పాడు.

‘అనంతం’

ఇక ఇల్లుగలవాళ్లతోటే సూర్యానికి పని ఉంటేదు.

అసలు ఆ ఇల్లుగలవాళ్లంటూ ఎందఱో లేరు. ఒక్కతే ఆ యింటికి యజమానురాలు. ధర్మశాస్త్రదృష్ట్యా ఆయింటికి ఆవిడకూ యజమాని ఇంకొకఆయన ఉన్నాడు. కాని వాస్తవికజగత్తులో ఆవిడే ఆయనకూ యజమానురాలు కావటాన ఇలా అనవలసి వచ్చింది; 'ఒక్కతే' అని.

ఆవిడ ప్రక్కవాటాలోనే ఉంటూ వీళ్లమీద ఏమన్నా అజమాయిషీ చేస్తూ లేనిపోని పెత్తనదారైందా అంటే అందు కవకాశమే లేదు. ప్రక్కవీథిలో వేరేయింట్లో ఉంటూఉండావిడ.

ఏమైనా, ఆవిడవిషయంలో సూర్యం అదోలా ఉంటూ వచ్చాడనే చెప్పాలి.

అస లాయింట్లోకి సూర్యం ప్రవేశించని ముందు సంగతి...

ఇంటికోసం తిరిగి తిరిగి ఆ డాబా 'అద్దెకివ్వబడును' అని తెలిసికొని సూర్యం-రామం కలిసి వెళ్లి ఆవిడతో అన్ని విషయాలూ మాటాడుకొన్నారు. 'ఇంక ఎల్లుండి వచ్చి ప్రవేశించాలి' అని కూడా నిర్ణయించుకొన్నారు.

'మామ్మగారూ! మేము ఎల్లుండి వచ్చి ప్రవేశిస్తాం. మీరు మీ పనిమనిషిచేత రేపు కాస్త ఈ యిల్లు కడిగించి దులిపించండి' అన్నాడు సూర్యం.

'అలాగే నాయనా! అదెంతపనీ. కాని, ఒక్కమాట చెప్పమన్నారా బాబూ, మా దాసీది ఉంది చూశారూ, వట్టి బద్ధకపు మొద్దు. దున్నబోతే దూడల్లోకీ, మెయ్యబోతే ఎడ్లలోకి పోయే రకం. 'ఆ ఇల్లు బాగు చెయ్యవే' అని నేనంటాననుకోండి. నేనన్నాను గనక మొక్కుబడిచెల్లించినట్టు ఓ చీపురలా వేసి, ఓ చెంబెడునీళ్ళలా పోసి అయిందనిపిస్తుంది. ఏం సార్థకం? నేను పనిచేయించానని మీ రనుకొంటారు. చెయ్యమన్నానుకదా అని నే ననుకొంటాను. ఎల్లుండి పొద్దున్నే మీరు వచ్చి ప్రవేశిస్తారు. కాని, మళ్ళీ అంతపనీ పాపం ఆ ఆడమూకరు ఒక్కత్తే-మీ ఆవిడ-అప్పటికప్పుడు చేసుకొంటే నేకాని సామాను సర్దుకోవటానికి వీలుండదుగద! కనకా, రేపు మీ దాసీదాన్ని రమ్మని మీరు దగరుండి బాగు చేయించుకొంటే ఎంచక్కా ఎల్లుండి రాజాలా అద్దంలాఉన్న ఇంట్లో ప్రవేశించవచ్చు. ఏమయినా పనిమనిషి చేసేపని ఏం శుభ్రంగా ఉంటుంది?" అంది ఆవిడ.

మాటు మాటాడక, ఇవతలికి వచ్చినాక 'ఈవిడ పెడసరపుకబ్బులాగుందే; పైగా చాణక్యుడి ప్రియశిష్యురా లనుకొంటాను కూడాను' అన్నాడు సూర్యం.

'వ్యవహారందగ్గిఱ నిక్కచ్చిగాఉండటం పెడసరితనమా? అంత్యనిష్ఠూరం కంటె ఆదినిష్ఠూరమే మంచిది. ఆవిడ ఎంత మంచిది కాకపోతే మీ సుఖం కోరి, తన దాసీదాని అసమర్థతనుకూడా ఒప్పుకొని, ఇల్లు బాగుచేయించుకోమని చెప్తుంది?' అన్నాడు రామం.

"మంచితనమూ లేదు మంటిగడ్డా లేదు.

★ గృహోన్మేషణి ★

అది అంతా పనిచేయించటం తప్పించుకోవ టానికి వేసిన ఎత్తు. ముందీవిడతో వేగగలము అని " అన్నాడు సూర్యం.

'సరే ఏమయినా తప్పదుగదా, ప్రస్తుతం ప్రవేశించు; తరవాత చూద్దాం. ముందే ఊహాగానం దేనికి?' అన్నాడు రామం.

ప్రవేశించాక కొన్నాళ్లు గడిచాయి.

'మటి సున్నం వేయించటంమా ఏమి చేశారు మామ్మగారు' అన్నా డోసారు సూర్యం.

'అయ్యో నాయనా, నాతో మీరు చెప్పాలా? నా యింటి అందం చందం నే నెఱుగనూ? మీరంటే ఈ ఇంటికి క్రొత్త వారు కానీ, నేను మీవంటివారి కెందఱి కద్దెకిచ్చానో! వాళ్ల కందఱికూ తెలుసు; నేను ఇంటి శుభ్రతనుగుఱించీ, అందచందాలగుఱించీ, అద్దెకుంటేవాళ్ల సౌకర్యాలగుఱించీ ఎంత శ్రద్ధ తీసికుంటానో. ఇక రెండునెలల్లో సంకురాత్రి పండగ వస్తోందా, ఇప్పుడే గోడలకి వెల్ల వేయిస్తే అప్పటికి గోడలు మాసిపోవూ? నాయనా! ఏది ఎప్పుడు మనకు అవసరమో మనమే తెలుసుకోకపోతే ఎలా?' అంది ఇంటావిడ.

పండగ వెళ్ళింది...

"పండగకి వెల్ల వేయిస్తా మన్నారు; పండగ వెళ్లిపోయిందిగాని మన గోడలు మామూలుగా నే ఉన్నాయి." అన్న సూర్యం తన యీ క్రింది వాక్యాలతోటి సమాధాన పడి, సంతృప్తి చెంది, సానుభూతి చూపాలని ఆశించిం దావిడ.

'మా అమ్మాయీ, అల్లుడూ, పిల్లలూ వస్తామన్నారు; వచ్చారు. వాళ్లు వస్తారనీ వచ్చినా ఇంతలేసి ఖర్చులు అవుతాయనీ నేను అనుకోలేదు. ఇంకా ఏమిపెట్టి నేను వెల్ల వేయించేది? బాబూ! ఇబ్బందు లందఱికీ వస్తూఉంటాయి. అందరి సుఖాలూ ఒకలాటివి కావు. కాని, కష్టాలందఱికూ సమానమే బాబూ! మీకే ఇలాటి అదనపుఖర్చులు తగిలితే ఏంచేస్తారు? పండుగకి వచ్చిన ఆడపడుచును ఆదరిస్తారా, ఇంటికి వెల్ల వేయిస్తారా?"

ఇవన్నీ చెప్పి 'ఆవిడతో మాటాడట మంటేనే భయమౌతుంది; పలకరిస్తే చాలు; పెద్ద ఉపన్యాస మిస్తుం దావిడ.' అనే వాడు రామంతో సూర్యం.

ఆవిడగుఱించి ఒకప్పుడు రామంతో ఇలా గన్నాడు సూర్యం.

"ఫస్టుతారీఖు రావటం భయం; ఇంటి మీదకు వచ్చిపడుతుంది. మార్వాడీలాగ ఇచ్చేదాకా కదలదు, వదలదు. పైగా వచ్చి వెలకోళరకంగా కూస్తుంది. ఒక్కరోజు ఆలస్యమయితే అద్దె ఇవ్వటానికి; వెయ్యి మంది తాటకలూ, పదివేలమంది శూర్పణఖలూ, లక్షమంది లంఖిణులూ ఈ విడ ఒక్కత్తె రూపం ధరించి వచ్చారనిపిస్తుంది."

సూర్యం మాటలలో ఇంత నిజం ఉంది - ఇంత అతిశయోక్తి ఉంది అని చెప్పేదాని కంటే ఆ సంఘటనలనే టూకీగా మనవి చేయటం మంచిపద్ధతి అనుకొంటాను.

'చూడు అమ్మాయీ, నెలా పూర్తి అయ్యే టప్పటికి నా అద్దె నా మొహాన పారెయ్యాలి; ఇక ఇలా ఆలస్యం చెయ్యకద్దు, అని చెప్పు మీ ఆయనతో.'

మొట్టమొదటిసారి రెండురోజులు ఆలస్యంగా అద్దె యిచ్చినపుడు ఆ విధంగా అంది ఇంటావిడ నాభార్యనని సూర్యం మిత్రుడితో చెప్పాడు.

ఇంకోసారి...

'నారు ఊరికి వెళ్లారు; రాగానే ఇస్తాము' అంది సూర్యంభార్య ఇంటావిడతో.

'వెఱ్ఱిదానా! అతను ఊరు వెళ్లాడే అనుకో! డబ్బంతా కూడా తీసుకువెళ్లాడంటావా? నీ చేతి కేమీ ఇవ్వలేదు? ఇచ్చి ఉండకపోవచ్చును. అమ్మాయీ! సంపాదించటం మగవాడివంతు; జాగ్రత్తచేయటం ఆడదానివంతు; ఇదీ తెలుసుకోకపోతే ఎలా? ఐనా నా కెందుకు. నా అద్దె కిలా ఆలస్యం చేయటం బాగోదమ్మాయీ, మళ్లీ ఓ సారి చెపుతున్నాను' అంది ఇంటావిడ.

ఈ విషయం చెప్పి 'ఇలాంటి ఉపదేశాలు చేయవలసిన దేనా?' అనడిగాడు సూర్యం రామున్ని.

ఇటీవలే సూర్యం ఊరుకు వెళ్లి ఐదో తారీఖుదాకా రాలేదు. అప్పుడు జరిగిన 'రభస'గుఱించి ఇలా అన్నాడు సూర్యం.

"ఇప్పుడే ఆవిడ విశ్వరూపప్రదర్శనం చేసింది. 'నేను మీ నౌకరునటమ్మా, మీ యింటిచుట్టూ తిరగటానికి? ఫస్టుతారీఖు సాయంత్రానికల్లా మా యింటికి తీసుకువచ్చి ఇవ్వమను మీ ఆయన్ని. ఏం పెద్దమనిషమ్మా! అద్దె ఇవ్వబడుతుందని ఊరుకు వెడుతూ ఉంటాడే,' అని నడివీథిలో నిలబడి నానా మాటలూ అనిపోయిందట.

"ఇదివఱకున్న అయ్యరు మా కెన్ని అద్దెలూ మొండిచెయ్యి చూపించి అర్ధరాత్రివేళ లేచిపోతే ఏం చేసింది? నేను న్యాయంగా కనుపిస్తున్నాననా ఇలా అల్లరి పెట్టడం?

"ఒక రోజు ముందవుతుంది వెనకవుతుంది ఇవ్వటం. మంచీ చెడ్డా తెలుసుకోవద్దూ?" అని ఉద్రిక్తుడై ముగించాడు సూర్యం.

"అవునయ్యా, ఆవిడ అలా మోసపోయింది కనకనే ఇప్పుడు జాగ్రత్తపడుతోంది. మోసంచేసేదాకా ఎవళ్లు మంచివాళ్లో ఎవళ్లు చెడ్డవాళ్లో ఏం తెలుస్తుంది? సమయానికి అద్దె ఇవ్వలేక, 'అంది' అని అభిమానపడితే అర్థంలేదు" అన్నాడు రామం.

"నువ్వేనా మాటాడేది? నువ్వద్దెకుంటే ఇంటి యజమాని నీతో ఇలాగే మసులుతున్నాడా? నువ్వు సరిగ్గా ఫస్టుతారీఖు సాయంత్రానికే ఇస్తున్నావా ప్రతి నెలా? ఏ మయినా ఇంక నేనా కొంపలో ఉండలేను. ఇంకో కొంప వెతకటానికి వస్తావా, రావా? నీ నామరుకేరం వదిలి చెప్పు" అన్నాడు సూర్యం.

"సరేనడు; నీ యిష్టం. ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక గొడవ ఉంటూనే ఉంటుంది; చిన్నదో, పెద్దదో; వడు. నీ మనసూ తీరుతుంది. మళ్లీ ఓ పట్నాన కొంప కుదిరి తరువాతుందా?" అని లేచాడు రామం. ★

జ్ఞానోదయం

వి. యస్. చెన్నూరి

ప్రార్థితం యూనివర్సిటీ తగలేసి బియ్యే పట్టా పుచ్చుకుని, పొట్టచేతపుచ్చుకుని పూరూరా తిరిగి, విఫలంకాగా, విసిగివేసారి చివరికి బ్రతుకు మీదే రోతబుట్టిన యువకుడొకడు, పిచ్చి పిచ్చిగా ఆలోచించుకుంటూ, తలొంచుకు, ఒంటరిగా, పూరి వెలుపల రాచబాటమీద నడుస్తున్నాడు రైలుకట్ట వేపు.

మానవుడై పుట్టింతరువాత యెలాగో బ్రతకాలి. బ్రతకాలంటే ప్రపంచంలో డబ్బు కావాలి. డబ్బు కావాలంటే యేదో ఒకటి చెయ్యాలి అయితే-ఏం చెయ్యాలి? ఉద్యోగంచేద్దామంటే యిచ్చేవాళ్లు లేరు. వ్యాపారంచేద్దామంటే పెట్టుబడి లేదు. కూలిపని చేసుకుందామంటే వొంట్లో బలం లేదు. నాలాంటివాళ్ళెలా బ్రతకాలి? జవాబు లభించడంలేదు. యువకుడు ఆలోచించుకుంటూ తలొంచుకు నడుస్తున్నాడు.

"ఆగు!"—ఎవరిదో గొంతుక గర్జించింది. యువకుడు వినిపించుకోలేదు. దీర్ఘంగా ఆలోచిస్తూ తలొంచుకు నడుస్తున్నాడు.

"నిన్నే! పిలుస్తుంటే వినిపించడంలేదూ" —గొంతుక మళ్ళీ గర్జించింది

ఈసారి యువకుడు తిరిగి చూశాడు. తిరిగిచూడక తప్పిందికాదు.

ఈనిర్జన ప్రదేశంలో—చీమ చిటుక్కుమన్నా వినిపించే యీ నిశ్శబ్ద వాతావరణంలో—యేమిటీ కేక!

యువకుడు ఆలోచనా ప్రపంచంలోంచి అసలు ప్రపంచంలోకి దిగాడు.

చెట్లనీడలోంచి ఓ భయంకరాకారం ప్రత్యక్షమైంది. చిక్కి చిప్పరించుకున్న తల, పెరిగినగడ్డం, మాసిన బట్టలు, నల్లగా, బక్కపలచగా, పొడుగాటి విగ్రహం! కళ్ళు నిప్పుకణికలకుమల్లే మండుతున్నయ్. యువకుడి వొళ్లు ఝల్లుమనలేదు. గుండెలు జారిపోలేదు.

మామూలుగా గుడ్లప్పగించి చూస్తూ నుంచుండిపోయాడు.

ఆకారం దగ్గరికి జరిగి, కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అడుగుతోంది.

"నీదగ్గర యేముందో తీసి గబ గబ యిప్పుడు యిలా పడెయ్, ఊఁ—ఆలస్యంచెయ్యకు"—హుంకరించింది. "ఎందుకు?"—యువకుడు నిర్లక్ష్యంగా, ఎక్కడా [illegible] ప్రశ్న వేశాడు.

ఆకారం చలించింది.

"ఎందుకా?"—దిక్కులు పిక్కటిల్లేలా వికటాట్టహాసంచేసింది.

"ఎందుకో చెప్పాలా?"—పళ్ళు పటపటలాడిస్తూ ఝుల్లోంచి యేదో పైకిలాగింది.

"ఇదేమిటో చూశావా?"

ఆకారం చేతిలోంచి ఆగాలిలో కగిరిన కత్తి కార్బ్రేవక విద్యుద్దీపకాంతిలో తళతళలాడింది.

"చెప్పినట్టు చెయ్యకపోతే ప్రాణంమీద ఆశవొదులుకోవలసి వొస్తుంది జాగ్రత్త!"

యువకుడి వొళ్లు ఝల్లుమనలేదు. గుండెలు జారిపోలేదు. కాని, యేదో, బుర్రలో తళుక్కున మెరిసింది! తెచ్చుకున్న ఉత్సాహంతో ముందుకి జరిగి అడిగాడు.

"ఒక్కపోటుతో చంపెయ్యగలవా?"

ఆకారం తెల్లబోయింది.

"వేళాకోళమా?"

"కాదు నిజం!"

యువకుడి ముఖం గంభీరంగా మారిపోయింది. మరి కాస్త ముందుకు జరుగుతూ—"ఊఁ—కానీ, సరిగ్గా వొక్కపోటుతో ప్రాణం ఎగిరిపోవాలి. ఊఁ—ఆలస్యం చెయ్యకు!"

యువకుడి గొంతులో సింహాలు గర్జించినై—కళ్లల్లో అగ్నిపర్వతాలు పగిలినై.

ఆకారం హడలిపోయింది. ఆకులా గజగజ వొణికిపోయింది. కాలు వెనక్కివేసింది. అటూఇటూ చూచి, గబుక్కున తిరిగి పరుగు లంకించుకుంది.

యువకుడికేమీ అర్థంకాలేదు. క్షణం ఆలోచించి, ఆకారాన్ని వెంబడించాడు. ఆకారం యింకా జోరుగా పరుగెత్తుతోంది. ఒణికేచేతిలోంచి కత్తి జారిపడింది ఇసకలో.

యువకుడు ఆగి, ఒంగి, కత్తిని చేతికి తీసుకున్నాడు.

అతని ఆశ్చర్యానికి అంతులేదు.

అసలది కత్తికాదు!

పీనా రేకు ముక్క!

"ఇదేమిటి? — యీ రేకు ముక్కతో ప్రాణం తియ్యడమెలా?" - అనుకున్నాడు.

వెంటనే తన సంశయానికి జవాబు వచ్చింది. అవును, అతనిక్కావలసింది ప్రాణాలు కావు. డబ్బు!—బ్రతకడానికి డబ్బు!! మానవుడై పుట్టింతర్వాత ఎలాగో బ్రతకాలి, బ్రతకాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే ఏదో ఒకటి చెయ్యాలి కానీ ... కానీ ... ఇదేమిటి? ఇదీ ఒక బ్రతుకే?

ఈ బ్రతుకుకంటే చావు నయంకాదూ!

అవును—చావే నయం!

తననిర్ణయమే సబబుగా కనిపించింది.

తలొంచుకు, దీర్ఘంగా ఆలోచించుకుంటూ, ముందుకంటే వేగంగా నడుస్తున్నాడు.

'వెనకటికో నక్క నీలాగే, ఎగిరెగిరి, ఎంతకీ ద్రాక్షపళ్ల గుత్తి అందకపోయేసరికి ఛీ! ఛీ! వెధవద్రాక్షపళ్లు పుల్లగా వుంటయ్. ఎవరిక్కావాలి?—అన్నదట. అలా వుంది నీకథ"—ఎవరో నిప్పుల కొరడాతో ఛళుక్కుమనిపించినట్టయింది. యువకుడు టక్కున ఆగి—"ఏమిటీ అంతేనా?—అని ప్రశ్నించుకున్నాడు.

"కాక? చచ్చి సాధించేదేమిటి! ఆత్మహత్య పిరికివాడి లక్షణం!" — జవాబు లభించింది.

యువకుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

"అవును బ్రతకదలచుకుంటే ఎన్నిమార్గాల్లేవు?—ఇంతమంది బ్రతగ్గా నేనొకణ్ణే బ్రతకలేకపోతానా, నా పిచ్చిగానీ!" — అనుకున్నాడు.

యువకుడి బుర్రలో ఆశాలతలు చిగురించినై

ముఖంలో సంతోషరేఖలు మెరిసినై.

"అవును జీవితం ఎంత అమూల్యమైంది!"—అనుకున్నాడు.

గబుక్కున వెనక్కి తిరిగి నడవసాగాడు. ఈదఫా తలొంచుకు కాదు, ధీమాగా తలెత్తుకు. ★



నిశ్చిందిపురంలో హరిహరరాయ్‌గారి పాత పెంకుటిల్లు ఉత్తరపుకొన నుంది. అత డంత కలిగినవాడేం కాదు. తండ్రి ఇచ్చిపోయిన కొద్దిపాటి కొండ్రమీద వచ్చే రాబడికి తోడు, అయిదారుగురు శిష్యులిచ్చే వార్షికాలు కూడా ఉండటంతో, మొత్తాని కతడు ఏదో ఒడిదుడుకుల్లేకుండానే సంసారాన్ని నెట్టుకు వస్తున్నాడు.


క్రితం రోజు ఏకాదశి. హరిహరునికి వరుసకి అక్కగారైన ఇందిరమ్మ ప్రొద్దున్నే పేలాలు ఫలారం చేస్తూ కూర్చుంది వసారాలో. ఆవిడ గుప్పెడు చెల్లగా గుప్పెడు నోట్లో వేసుకుని దంతాలతో తాటిస్తూ తినటం—హరిహరుని కూతురు ఆరేళ్ళపిల్ల—గుడ్లప్పగించి చూస్తూ ప్రక్కనే కూర్చుంది.

క్రమక్రమంగా ఒట్టిపోతున్న గిన్నెకేసి కూడా మధ్యమధ్య చూస్తూనేఉన్నదా పిల్ల. ఒకటి రెండు సార్లు అడుగుదామనుకుని, తీరా నాలికచివరికి వచ్చాక అడగలేక ఊరుకుంది. ఇందిరమ్మ గిన్నె ఖాళీ చేసి ఆ పిల్లదానికేసి చూస్తూ "కాసిని నీకూ అట్టే పెట్టాను లేవే అమ్మాయ్! అవిగో చూడు ఇంకా" అన్నది.

"ఎందుకు వద్దులే అత్తయ్యా! ఆ కాసిని కూడా నువ్వే తినేసెయ్" అన్నదాపిల్ల బిక్కమొహం పెట్టి.

ఇందిరమ్మ తన దగ్గిరున్న రెండు బొంత అరటి పళ్లలో—ఒక దాంట్లో సగంముక్క ఆ పిల్ల చేతిలో పెట్టింది. దాంతో ఆ అమ్మాయి కింత మొహం అయింది. ఆవిడ పెట్టిన ఆ ముక్క కాస్తా ఎక్కడయి పోతుందో అని, వాపిరిగొట్టులా కాస్తకాస్తే కొరుక్కు తినటం మొదలెట్టింది.

అనువాద
మద్దిప
సూ



"మళ్ళీ అక్కడ ప్రాణాధారం పడి కూర్చున్నావా? రావేం ఇవతలకి?" అంటూ అవతలి పంచలోంచి తల్లి గదమాయించింది.

"కూర్చోనివ్వూ. అదేం చేస్తుంది. నాదగ్గరే కూర్చుంది కుదర్లే. అదేం చెయ్యటంలేదు లే, కూర్చోనియ్" అన్నది ఇందిరమ్మ.

ఆవిడలా అన్నా, తల్లి ఊరుకోలేదు. "ఎవరైనా తింటున్నప్పుడు ఎందుకలా వాకిరిగొట్టు మొహం వేసుకుని ఎదురుగా కూర్చోటం? నా కలాంటివన్నీ కిట్టవు ఏమనుకున్నావో, రావేం ఇంకా? నీ కెవ్వడూ చెప్పేది?" అంటూ తల్లి మరోసారి కేం్రడించింది.

ఆ అమ్మాయి భయంభయంగా లేచి వెళ్ళిపోయింది.

హరిహరరాయ్‌కి ఇందిరమ్మ చాలా దూరపు చుట్టం. మాతామహుల వైపు తరాలన్నీ తిరగవేసి చూస్తే ఎక్కడో కలుస్తుందా చుట్టరికం. హరిహరుని తాత ముత్తాతల వసలు ఈ ఊరు కాదు. దాని ప్రక్కనున్న యశోదా విష్ణుపురం. హరిహరరాయ్ తండ్రి రామచంద్రరాయ్‌కి చిన్నతనంలోనే భార్య పోయింది. అయినా తనకి మళ్ళీ పెళ్ళిచేదామనే సదుద్దేశ్యం తండ్రికి ఏకోశానా లేకపోవటం, అతడికి చాలా దారుణంగా తోచింది. నోరు తెరిచి అడగటానికి బిడియపడి ఓ పదామ్మాత్రం ఎలాగో గడిపేశాడు. అప్పటికే తండ్రి అలాంటి ప్రయత్నమేమీ చేస్తున్నట్లు కన్పడకపోయేసరికి రామచంద్రరాయ్ చాటుగానే కాకుండా ఎదుటపడికూడా రకరకాల అస్త్రాలు

ప్రయోగించక తప్పలేదు. మధ్యాహ్నమప్పుడు మామూలుగానే భోంచేసి వచ్చి మంచంమీద పడుకుని, ఊరికే ఆపసోపాలు పడుతూండేవాడు. ఎవరైనా దగ్గరకొచ్చి 'ఏమిటలా ఉన్నావేం?' అని ఆదుర్దాగా అడిగితే 'ఎవరున్నారు నాకు? నా ఆలనా పాలనా ఎవరికి కావాలి? కొంపతీసి ఏ తలనొప్పి అయినా వస్తే మాత్రం ఎవరు నాకిక్కడ దిక్కు?' అంటూ ఏడుపుమొహం పెట్టేవాడు. ఇలాంటి ఎత్తులన్నిటికీ పర్యవసానంగా ఈ నిశ్చిందిపురంలో రెండో వివాహం జరిగిందతడికి. పెళ్ళి అయిన కొద్ది రోజులకే తండ్రి చనిపోవటంతో విష్ణుపురంలో మకాం ఎత్తేసి, ఈ ఊళ్ళోనే స్థిరపడిపోయినాడు. ఇది అతడి చిన్ననాటి ముచ్చట...

రామచంద్రరాయ్ ఇక్కడికి వచ్చాక మామగారి ప్రోద్బలంతో పాఠశాల్లో చేరి సంస్కృతం చదవటం మొదలెట్టాడు. తర్వాత తర్వాత ఈ ప్రాంతాలకల్లా మంచి పండితుడనే పేరు కూడా తెచ్చుకున్నాడు. అయినా ప్రయోజకుడని అనిపించుకొనే తగిన పనిమాత్రం ఎన్నడూ చేసిఎరుగడు. అసలలాంటిదేమీ చెయ్యలేడేమో అని శంకించటానికి కూడా కావలసినన్ని ఆధారాలుండేవి. భార్య, కొడుకు ఏడాదిలో తొమ్మిది నెలలు మామగారింట్లోనే ఉండేవారు. తాను పష్టి గడియలూ పొరుగున ఉన్న పతిరామముఖర్జీగారింట చదరంగమో, చీట్లపేకో ఆడుతూ కూర్చుని, భోజనానికిమాత్రం రెండుపూటలా అత్తగారింట హాజరు అవుతూ ఉండేవాడు. 'ఏం పండిత మహాశయా! భార్య, పిల్లవాడు ఉన్నారాయె. వాళ్ళకైనా ఏదో గట్టియేర్పాటు చూడకపోతే ఎలా మరి?' అని ఎవరైనా మాటవరసకి అంటే—'మరేం బెంగలేదు తమ్ముడూ! వ్రజచక్రవర్తిగారి గాదెలదగ్గర రాలే గింజలు ఏరుకుంటున్నా చాలు. ఎన్నితరాల వారికైనా చులాగ్గానే గడిచిపోతాయి రోజులు!' అని సమాధానం చెప్పేసి, అంతలో మళ్ళీ తనదగ్గరున్న త్రించాపాడిలో ఎదుటివాడి కొంప నిలువునా ఎలాగా కూల్చటం అన్న ఆలోచనలో పడిపోయేవాడు— రామచంద్రరాయ్.

వ్రజచక్రవర్తిగారి ధాన్యపుగాదెల స్థిరత్వానికి సంబంధించినంత వరకు, తనది యెంత తప్పు అంచనా అయిందీ మామగారు చనిపోయాక రామచంద్రరాయ్‌కి తెలిసిరావటానికి ఎంతో కాలం పట్టలేదు. ఈ వూళ్ళో అతనికి వేరే భూమీ - పుట్రా యేంలేదు. చేతిలో నగదూ, నాణెమయినా అంతగా యేంలేదు. అయితే అక్కడా అక్కడా అయిదారుగురు శిష్యులు మాత్రం దొరికారు. వాళ్ళ సాయంతో సంసారాన్ని గడుపుకుని వస్తున్నాడు. అతడి పెళ్ళికి ముందు వాళ్ళ దాయాది సోదరుడొకడు ఆ యింటి ఆపపనునే చేసుకున్నతడున్నాడు. వాళ్ళ కుటుంబం కూడా యిక్కడే ఉండేది. రామచంద్రరాయ్‌కి వాళ్ళుకూడా చాలా సాయం చేస్తూండేవాళ్ళు. ఆ దాయాది సోదరుని కొడుకు నీలమణి రాయ్ 'కమిసరేట్'లో పనిచేస్తూండేవాడు. ఉద్యోగరీత్యా అతడెప్పుడూ పరాయి దేశంలో వుండవలసి రావటంతో ఇక్కడి నివాసం యెత్తేసి, చివరికి ముసలితల్లిని కూడా తీసుకుని, తాను ఉద్యోగం చేస్తున్న వూరికి వెళ్ళిపోయాడు. ఇప్పుడా యింట్లో ఎవరూ లేరు.

తూర్పు ప్రాంతం వాడైన ఓ సుప్రసిద్ధ కులీనుడు ఇందిరమ్మని చేసుకున్నాడని చెప్పుకునేవారు. పెళ్ళయాక ఆమె భర్త ఎప్పుడన్నా ఓసారి ఆ ఊరు రావటంకూడా కద్దట! వచ్చినప్పుడు ఓ రాత్రో, రెండు రాత్రులో వుండి, త్రోవఖర్చులూ, కులీనులకు జరగవలసిన గౌరవ సత్కారాలూ పుచ్చుకుని, వచ్చినట్టు హాజరుమాత్రం వేయించుకుని, మళ్ళీ మూటా—ముల్లె కట్టుకుని, వరుసక్రమంలో తర్వాతి అత్తవారింటికి వెళ్ళిపోయేవాడట; అంచేత భర్తంటే ఇందిరమ్మ కెప్పుడూ అంత గట్టిగా గుర్తుకూడా ఉండేవాడు కాదట! తలితండ్రుల తదనంతరం ఆమె తమ్ముడిదగ్గిరే ఉంటూ కాలం వెళ్లతీస్తూ వచ్చింది. కాని కాలం కలిసిరాకపోవటంతో ఆ తమ్ముడుకూడా చిన్న వయసులోనే చనిపోయాడు...ఆ తర్వాత కొద్ది రోజులకే హరిహరుని తండ్రి రామచంద్రరాయ్ వారి నివేశనంలో ఇల్లు కట్టాడు. ఇందిరమ్మ ఈ ఇంట్లో అడుగుపెట్టడం అదే మొదలు. అవన్నీ కాలం నాటి గాథలు కాని ఈనాటి కథలు కావు.

ఆ తర్వాత చాలా రోజులు గతించాయి...శంఖు చెరువులో తామరదొంతర్లు ఎన్నో విడతలు పుట్టాయి, అంతరించాయి. చక్రవర్తిగారి ఖాళీస్థలంలో సీతానాథముఖర్జీ క్రొత్తరకపు మొక్కలన్నీ తెచ్చి తోటవేశాడు. ఆ మొక్కలన్నీ పెరిగి పెద్ద మ్రానులై, ఈనాడు పడిపోయేస్థితిలో ఉన్నాయి. ఎన్నో నివేశనాల్లో క్రొత్త కుటుంబాల ఇళ్ళు లేచాయి. పచ్చని కుటుంబాలుంటున్న ఎన్నో ఇళ్ళు పాటుదిబ్బలై పోయాయి. ఎంతమంది వ్రజచక్రవర్తులు, గోలోక చక్రవర్తులు చితికిపోయారు, చివికిపోయారు. ఇచ్ఛామతీ స్వచ్ఛజలవాహిని—కాలవాహినితో పోటీపడి, ఇక్కడి నీలి తోటల యజమానులైన ఎంతమంది జాన్సన్‌లను—టాన్సన్‌లను, కూలీలను బెలుగుబెండుల్లా, అలల అంచుల నురుగులా ఏరేసే తీరాలకు విసరి పారేసిందో!...

ఇందిరమ్మ మాత్రం ఇంకా ఇప్పటికీ బ్రతికే ఉంది. అవిడ పద్దెనిమిదివందల ముప్ఫైనాలుగో సంవత్సరంలో — మిసమిసలాడుతూ వయసు ముమ్మరంలో ఉన్న పడుచు కాదు; డెబ్భై అయిదేళ్ళు పైబడ్డ పండు వృద్ధు. దవడలు జారిపోయి గొళ్ళలా వ్రేళ్ళాడుతున్నాయి. నడుము వంగి, పల్లకీబొంగులా అయిపోయింది. చూపు మునుపటంతదూరం ఆనటంలేదు. ఎండ చురుకు తట్టుకునేందుకు కళ్ళకిపైన చెయ్యి అడ్డంపెట్టుకుని, 'ఎవరా వచ్చేదిక నవీనా? భేహారా? అహా. కాదల్లే ఉందే! హరి నువ్వా రాజా?' అంటూ దారినిపోయేవాళ్ళని పలకరిస్తూ ఉంటుంది.

ఇందిరమ్మ కళ్ళముందు ఈ వాడనికూడా ఎన్ని మార్పులొచ్చాయని! ఇప్పుడు అడవిలా ఉన్న ఈ వ్రజచక్రవర్తిగారి స్థలంలో— ఆ రోజుల్లో ఆశ్వయుజ పూర్ణిమనాడు ఊరివారంతా కలసి సంతర్పణ చేస్తూ వీధికి విస్తళ్లేసి వడ్డించేవారు. ప్రొద్దునకాని, సాయంత్రముకాని ఊరి మంటపం దగ్గరకీ రచ్చబండ దగ్గరకీ వచ్చికూర్చునే వాళ్లు ఎవరైనా! అప్పుడిదంతా ఇలా వెదురుతుప్పలతో, రుప్పలతో నిండి వుండేదా? పుష్యశుద్ధ పూర్ణిమకు క్రొత్తధాన్యం గాదెల కెక్కించే ముందు, అర బస్తాడైనా తీసి అటుకులవడ్లు పోసేవారు. కళ్లు మూసుకుంటే చాలు, ఇందిరమ్మకి ఆరోజులు కళ్ళకు కడుతుంటాయి. రాయ్‌గారి చిన్నకోడలు ఇరుగు పొరుగమ్మల్ని ఇద్దర్ని ముగ్గుర్ని వెంటబెట్టుకుని ఎంత టీవిగా వచ్చేది అటుకుల్లో పోటు వేయడానికి! కుందనపు బొమ్మలాంటి కోడలు. ఎర్రగా ఒరిసిన అరచేతుల్ని మధ్య మధ్య ఉఫ్ ఉఫ్ అని ఊదుకుంటూ, వెనక్కీ ముందుకీ అంచక్కగా అడుగువేస్తూ ఎంచక్కగా వేసేదిపోటు! కోడలంటే కోడలా! చక్కని చుక్క. గుణాల కుప్పకదూ. ఇందిరమ్మకి యీ రాలొచ్చిన కొత్తల్లో ప్రతి ద్వాదశికీ తానే ఏ చలిమిడో ఏదో ఫలహారం చేసి స్వయంగా తీసుకువచ్చి, దగ్గర కూర్చుని తినిపించేది. వాళ్లంతా ఏమైపోయారో! ఆకాలం ఏమయిపోయిందో! కొత్త కష్టం, సుఖం తెల్సుకుందామన్నా ఆనాటి వాళ్లెవరూ బ్రతికి లేరుకదా ఇప్పుడు.

ఆ తర్వాత ఈ కుటుంబంలో రామచంద్రరాయ్ నాటి

పోయాక, అతడి కొడుకు హరిహరరాయ్ దిక్కయినా దాపెలి. అప్పటి కతడెంత? బొట్టికాయలా వుండేవాడు. ఎప్పుడూ ఊరికే చెరువులవెంట, దొరువులవెంట, చెట్లవెంట పుట్లవెంట దిప్పకోయలా తిరుగుతుండేవాడు. ఓనాడు–చింతగుల్ల కోసమని ముఖర్జీగారి చింత చెట్టు చిటారుకొమ్మ కెక్కి, అక్కడినుంచి పడి చెయ్యికాలూ విరగ్గొట్టుకుని, తర్వాత రెండునెలలు మంచమెక్కాడు కదూ! ఇప్పటిదా! ఎప్పటిమాటో ఇది! అతడికి చిన్నతనంలోనే ఎంతో ఘెళఘెళాగా పెళ్ళయింది! తండ్రిపోయాక ఆ పెళ్లాడిన పదేళ్ల పిల్లనీ పుట్టింట్లోనే విడిచిపెట్టి దేశాలమీదికి పోయా డెక్కడికో. ఏడెనిమి దేళ్ళదాకా ఏమైపోయాడో అజా—పజా తెలియనేలేదు. తర్వాత ఏడాదికీ ఆర్నెల్లకీ ఎప్పుడైనా ఓ ఉత్తరమ్ముక్క రాయటం మొదలెట్టాడు. అప్పుడో అయిదు అప్పుడో అయిదు ముసలమ్మపేర మని యార్డరు కూడా పంపిస్తూ ఉండేవాడు... ఈ యింటిని కనిపెట్టుకుని ఉండటానికై ఆమె ఎన్ని కష్టాలు పడాల్సివచ్చింది; ఎన్ని ఉపోషాలు చేయాల్సివచ్చింది! ఎదుటివారి దయాధర్మాలకై ఎందరి గుమ్మాల్లోనో పడిగాపులు పడి ఉండాల్సివచ్చింది. ఎన్ని దిగుళ్ళతోనో రోజులు వెళ్ళతీయాల్సి వచ్చింది!

చాలా కాలానికి హరిహరరాయ్ తిరిగివచ్చి, కాపురంపెట్టి ఓ యింటివాణ్ణి అయినానని అనిపించుకున్నాడు. ఇది జరిగికూడా ఆరేడేళ్ళయిందిప్పటికి. అతడికో కూతురు కూడా పుట్టింది. ఆ పిల్లదానికీ అయిదారేళ్లొచ్చాయి. ఇన్నాళ్ళకి మళ్ళీ ఆ వెనుకటి సంసారం కుదుటపడింది. 'అమ్మయ్య' అనుకుంది ఇందిరమ్మ. తన గుడిగుడికుంచపు బ్రతుకులో ఆవిడ మరోక సుఖాన్ని దేన్నీ అపేక్షించలేదు. తక్కిన సుఖదుఃఖాల్ని గురించి తాపీగా కూర్చుని ఆలోచించలేనంత అశక్తురాలావిడ. మొదట్నుంచీ అలవాటైపోయిన ఆ వెనుకటి బ్రతుకు బాటలోకే—మలుపుతిరిగయినా మళ్ళీ వాగలిగితే చాలు, అదే పదివేలు అవిడకి. అంతకు మించిన ఆనందం అవిడకి తెలీలేదు.

హరిహరుని కూతురు ఒక్కక్షణం కనుమరుగైతే చాలు, అవిడ ప్రాణం కొట్టుకుపోయేది! కాలంగా దానిడికి ఓ కూతురుండేది, విశ్వేశ్వరి... చిన్నతనంలో పెళ్ళయింది. పెళ్ళయిన కొద్ది రోజులకే ఆ పిల్లకాస్తా పోయింది. నలభైయేళ్ళకి మళ్ళీ ఆ విశ్వేశ్వరే ఇలా హరిహరుని కూతురు రూపంలో అనాథయైన తన తల్లి ఒడిలోకి వచ్చిందా అనిపించేది! నలభైయేళ్ళనుంచీ ఆవిడలో నిద్ర పోతున్న మాతృత్వం—ఈ పిల్లదాని ముఖంలోని భయవిహ్వలమైన చాంచల్యంతో, ఆ అమాయకపు కళ్లలో తొణికిసలాడే నవ్వుల తరకలతో—తన బ్రతుకు రుడుముట్టిపోతుందే అన్న ఆందోళనతో మేల్కొన్నట్టుంది.

కాని ఆవిడ అనుకున్నంత చల్లగా మాత్రం రోజులు వెళ్ళటంలేదు. హరిహరుని పెళ్ళాం మాపుల కెంత ఒక్క నిముక్క

యింకేం లాభం! ఆమె కోప తెగ ... మాట 'మహా పెళుసు. ఒట్టి కజ్జాకోరు మనిషి. తనని కంటినిండా చూడలేదు. నా అనే వాళ్లందర్నీ వదిలేసుకుని ఎక్కడినుంచో శనిదేవతలా వచ్చి కూర్చుందిట తానీ యింట్లో! అన్నిటికన్నా చోద్యం, తనకీ వారికీ ఏ వంక చూసినా చుట్టరికమే లేదట! తేరగా తిండి తినటానికే వచ్చి కూర్చుందిట!...

ఆమె చిన్నం—చితుక ప్రతీ దానికీ పనికట్టి ముసలమ్మతో రెండు పూటలా తగవు పెట్టుకుంటూంటుంది. ఆ తగవు మరీ ముదిరినప్పుడల్లా ఇందిరమ్మ తన పాత ఇత్తడి చెంబు, చింకి గుడ్డల మూట దంక పెట్టుకుని బయలుదేరి 'పోతున్నాలే అమ్మా, పోతున్నాలే. మళ్లీ ఈ నట్టింట అడుగు పెడితే నా పేరు—' అంటూ బయటికి నడిచేది. పగలల్లా దిగులుతో, ఏ వెదురు తోపులోనో కూర్చుని గడిపేసేది. ఆవిడ అక్కడ ఉన్నట్లు హరిహరుని కూతురు సాయంత్రానికల్లా పసికట్టి, పరుగు పరుగున వెళ్ళి, కొంగు పట్టుకు లాగుతూ 'రా, అత్తయ్యా. ఇక నీతో యెప్పుడూ పోట్లాడవద్దని అమ్మతో నేను చెపుతాన్లే రా.' అనేది. ఆ పిల్లదాని చెయ్యి పుచ్చుకుని, చీకటిపడే వేళకల్లా ఇందిరమ్మ మళ్ళీ మామూలుగా ఇంటికి వచ్చేసేది. సర్వజయ వెంటనే ముటముటలాడించుకుంటూ 'వచ్చావా మళ్ళీ? రాక ఎక్కడికేమిటి వెళ్లేది ఏట్లోకి! ఎక్కడికైనా వెళ్ళి ఉండేందుకు ఇంతకు తప్ప నేతెడంత ఇరవుండేగా! మళ్లీ మాట్లాడితే ముక్కుడితో రేపే అంత రోషాలుమాత్రం ఉన్నాయి.' అనేది.

ఆమె ఇలా అడిపోయటం ఇవాళేం క్రొత్తకాదు. తాను ఈ యింటికి కాపురానికి వచ్చినప్పట్నుంచీ మొదలెట్టింది. ఇలా లెక్కలేనన్ని సార్లు జరిగిందిప్పటికి. ఇలాంటివి మామూలై పోయాయి.

హరిహరుని నివేశనంలోనే తూర్పుప్రక్కన ఒంటి నిట్టాడి పూరిపాక ఒకటి చాలా రోజుల్నుంచి మరమ్మతుల్లేకుండా పడి ఉంది. ఇందిరమ్మ ఆ పాకలోనే ఉంటూంటుంది. దణ్ణెం గడబోత రెండు పాతనైనుపంచెలు వ్రేలాడేసి ఉంటాయెప్పుడూ. చిరుగులున్న చోట చివరలు రెండూ కలిపి ముడి వేసుకుంటుంది. ఇందిరమ్మ కిటీవల సూదిలో దారం ఎక్కించలేనంతగా చూపు సన్నగిల్లటంతో చిరుగులు కుట్టుకునే భాగ్యంకూడా లేకుండాపోయింది.

మరీ వాలికలైపోతే మాత్రం ముళ్లేసుకుంటుంది. ఓ చినిగిపోయినచాప, అలాంటిదే ఓ కప్పుకునే బొంత కూడా ఉన్నాయి. మంచి బొంత ఒకటి కుట్టుకుందామనే ఆశ కొద్దీ ఇక్ష్వాకుల నాటి సాలనుంచి భద్రపరచుకున్న పాతగుడ్డ పీలికల మూట కూడా ఒకటుంది. కాని వాటి అవసరం ఎప్పుడూ వచ్చినట్టు లేదు. ఇప్పుడొకవేళ వచ్చినా బొంత కుట్టుకోగలిగినంత చూపెక్కడుంది గొందలో! అయినా వాటిని మాత్రం అలాగే పదిలంగా దాచిపెడుతూ, శ్రావణమాసం వెళ్లగానే ఓసారి ఆ మూట విప్పి



బెంగాలీనవల "పథేర్ పాంచాలీ" రచయిత
శ్రీ శ్రీ విభూతిభూషణ్ బెనర్జీ.

వాటిని ఎండలో వేస్తూ ఉంటుంది. తన పెళ్ళికి అరణం ఇచ్చిన పేముపెట్టెలో ఎర్రఅంచుచీరల్లో ముక్కలు కొన్ని దాచిపెట్టి ఉంచింది. అవి ఆవిడ కూతురు విశ్వేశ్వరివి...ఇవికాక ఓ మూతేసిన ఇత్తడిచెంబు, రెండు మూడు మట్టిముంతలు, ఒకటో రెండో మట్టి బాకలూ కూడా ఉన్నాయి. ఒక దాంట్లో కొనిని పేలాలు, కొత్త పేలపిండి, ఓ దాంట్లో కొత్త ఉప్పూకారం, మరోక దాంట్లో రవంతనూనె, ఇంకోదాంట్లో ఇంత ఖర్జూరపుపండు కూడా జాగ్రత్త పెట్టుకుంది. నోరుతెరిచి అడిగినా సర్వజయ అన్నప్పుడల్లా ఇలాంటివన్నీ ఇవ్వకపోవచ్చునని ముసలమ్మ ముందు జాగ్రత్తలో మంచిగా ఉన్నప్పుడే వీటిని సంగ్రహించి, ఆ పెళ్ళినాటి పేముపెట్టెలో పదిలపరచుకుంది.

సర్వజయంటే ఈ పాకలోకి ఎప్పుడైనా ఓమారు వస్తుంది కాని, నిత్యం సంజవేళ ఆమెకూతురు ఆరేళ్ళపిల్ల దుర్గ వచ్చి, పంచలో పరిచిన చిరుగుల బొంతమీద కూర్చుని, ముసలమ్మచేత బోలెడన్ని కథలు చెప్పించుకుని వింటూ ఉంటుంది. ఏ కథ చెప్పినా చివరికి మళ్ళీ—"అత్తయ్యా. ఆవేళ చెప్పిన దొంగల కథ మళ్ళీ చెప్పవూ? ...అదే! యాభైయేళ్ళ క్రితం—ఊళ్ళో వెలిఅయినవాళ్ళింట్లో దొంగలు పడ్డ కథ చెప్పావే, అదే!" అని అడుగుతూ ఉంటుంది. ఎన్నిసార్లు చెప్పినా, ఎన్ని కథలు చెప్పినా మధ్య మధ్య మళ్ళీ ఆ కథ ఇంకోసారి చెప్పందే మాత్రం ఆ పిల్ల విడిచిపెట్టదు...ఇహ తర్వాత ఆవిడచేత పూర్వతరపు పాటలన్నీ పాడించుకుని వింటూవుంటుంది. ఇందిరమ్మకు ఆకాలంనాటి పాటలు చాలానోటికి వచ్చు. అన్ని పాటలూ రావటంవల్ల చిన్నప్పుడు తన సావాసకత్తెలలో ఆమె కెంతో పేరు, మెప్పు ఉండేవి. ఈకాలంలో అసలవన్నీ ఆసక్తితో వినేవాళ్ళే కరువయారు. అంచేత ఆ పాటలన్నీ ఎక్కడ తుప్పుపట్టిపోతాయో అని ఇప్పుడు నిత్యం సంజదీపాలవేళ ఆవిడ ఆ పాటలన్నీ యీ పిల్లదానికి పాడి వినిపిస్తూ, తానూ జ్ఞాపకం చేసుకుంటూవుంటుంది.

'ఒప్పులకుప్పా — విన్నావా యీ చోద్యం!
పందె వేళను, దొంగవోలెను — గో.. '

అంతవరకు పాడి ఇందిరమ్మ నవ్వు మొగంతో ఆపిల్ల కేసి చూడగా నే-.. 'ఏంగు డెరిగెను, రాధ యింటికి .. ' అంటూ ఆ అమ్మాయి అందుకుని ఇందిరమ్మగొంతులో గొంతు కలిపేది. ఆవిడ 'ఏం'! ఊతం యిచ్చి, నొక్కి పాడటం ఆపిల్ల కెంతో బావుండేది.

ఇందిరమ్మ సగం సగం చరణాలుపాడి, ఆ పిల్లదానిని బురిడీ కొట్టటానికి మిగిలినవి జ్ఞాపకం చేసుకుని పాడతానులే అంటే, పది రోజులు పోయినా అది మరిచిపోకుండా మిగిలిన చరణాలు పాడే దాకా వేపుకుతి నేది ఆ పిల్ల.

బాగా చీకటిపడ్డాక తల్లి అన్నానికి రమ్మని పిలవగాపిలవగా అప్పుడు లేచివెళ్ళేదా పిల్ల

2

హరిహరరాయ్ తాతముత్తాతల నివాసమైన యశ్ డా విష్ణుపురంలో ఐశ్వర్యవంతులైన చౌధురీ వంశీయులు వెనుక యెప్పుడో కొందరు బ్రాహ్మల్ని ఈనాములిచ్చి పిలిపించి, వారి కక్కడ స్థిర వసతులు కల్పించారు. అలా అక్కడికి వచ్చి వున్నవారిలో హరిహరరాయ్ పూర్వపురుషుడు విష్ణురామరాయ్ ఒకడు.

అప్పటికింకా దేశంలో బ్రిటిష్ పరిపాలన స్థిరంగా పాతుకో లేదు దారులూ, డొంకలూ దొంగలతో, దోపిడికాండ్రతో నిండి ఉండేవి ఈ దొంగల ముఠాల వాళ్ళందరూ చాలావరకు డొమ్మరి, ఉప్పరి, యానాది, ఒడ్డెకులాలకు చెందినవాళ్లు ఉక్కుగుండల్లా ఒళ్లూ వాళ్లూ ఎలా ఉండేవాళ్ళని! కత్తిసాము, కర్రసాముల్లో గడి తేరినవాళ్లు. ఆ కాలంలో చాలా ఊళ్లలో వాళ్లు చాటుగా నెల కొల్పిన కాళికాలయాల చిహ్నాలు ఇప్పటికీ ఉన్నాయి. పగల్లా మామూలు పెద్దమనుషుల్లాగా నే నటిస్తూ చీకటిపడగా నే కాళికి మొక్కి, దూరపు టూళ్లలోని సంపన్నుల యిళ్లు దోచుకోటానికి బయలుదేరేవాళ్లు ఆ కాలంలో అయిన కుటుంబాలవాళ్లు కూడా చాలామంది, తెరచాటున ఉండి ఇలా దొంగతనాలు చేయించి ఆర్జించేవాళ్లు వంగదేశంలోని చాలామంది జమీందారుల, సంపన్నుల సంపదలకు పునాదులు-వాళ్ళ పూర్వులిలా ఆర్జించిన ధనరాసులే. ప్రాచీన వంగదేశచరిత్ర క్షుణ్ణంగా తెలిసినవారందరికీ ఈ సంగతి తెలుసు..

విష్ణురామరాయ్ కుమారుడు వీరురాయ్ని గురించి కూడా ఇలాంటి అపప్రథే ఉండేది. అతని చేతి క్రింద జీతాలకి పనిచేసే దొంగల ముఠా ఒకటుండేది నిశ్చిందిపురం గ్రామానికి ఉత్తరంగా 'నాయాడాంగా' నుంచి నవాబ్‌గంజ్ మీదుగా 'తక్కి' పోయే బాటుబాటకి ప్రక్కగా 'సోనాడాంగా' మైదానం మధ్యన ఉన్న ముసలమ్మ చెరువు గట్టు ఈ ముఠా వాళ్ల పీఠం ఆ చెరువు ఒడ్డున తరతరాల నాటి నుంచి ఉన్న మర్రిచెట్టుచాటున దాక్కునిఉండి, దారినపోతున్న బాటసారులను అడ్డగించేవాళ్లు. వీళ్ల దోపిడిపద్ధతి అంతా వేరు దారినపోయేవాళ్లను ముందు దుడ్డుకర్రలతో మోది చంపి, తర్వాత వాళ్లదగ్గిర ఏమేం ఉన్నాయో అని తడిమేవాళ్లు. తీరా వాళ్లు ప్రాణాలు వదిలాక ఒకొక్కళ్ళదగ్గిర ఎర్రని ఏగానీ దొంకక పోవటంకూడా కద్దు అంగుళం వింతేమీ లేదు ఆ శవాల్ని చెరువులోకి లాగి కుక్కి, ఈ దంపెగమారి శ్రమకు ఈసారి వచ్చేవాళ్ళ దగ్గరైనా ఇంత కింత ప్రతిఫలం దండుకు తీరాలనే తహతహతో మళ్ళీ ఆ మర్రిచెట్టు క్రిందికి చేరుకునేవాళ్లు. ఆ గ్రామానికి ఉత్తరంగా ఉన్న మైదానంలో ఆ మర్రిచెట్టు యిప్పటికీ ఉంది. ఆ దారి ప్రక్కన పల్లంగాఉండే ప్రదేశాన్ని ఇప్పటికీ ముసలమ్మ చెరువనే అంటూ ఉంటారు. చెరువుతాలూకు చిహ్నాలుమాత్రం యేమీ లేవు ఇప్పుడు. ముప్పాతిక మువ్వీసం అంతా పూడిపోయింది. దుక్కులు దున్నే రోజుల్లో ఆ పల్లపుచోటులో ఇప్పటికీ రైతుల నాగలి కొర్రులకు మానవ కపాలాలు బయట పడుతూనే ఉంటాను.

పరంపరగా చెప్పుకునే పాతగాథ ఒకటుంది — తూర్పు ప్రాంతీయుడైన ఓ ముసలిబ్రాహ్మడు కొడుకుని వెంటపెట్టుకుని, కాళీగంజ్ ప్రాంతాలనుంచి శ్రీపురంమీదుగా మళ్ళీ తనదేశం వెడుతూ ఈ దారిన వచ్చాడట! కార్తికమాసపు చివరిరోజులవి. కూతురుపెళ్ళికి సొమ్ము సంతనాచేసుకోటానికై ఈ ప్రాంతానికి వచ్చాడు. ఆయనదగ్గిర కొంత నగదు, ఇతర సామగ్రికూడా ఉన్నాయి మధ్యాహ్నం హరిదాసపురం సత్రంలో ఆగి, వంట చేసుకుని భోంచేసి, పొద్దు ఏటవాలుకి తిరగగానే మళ్లీ బయలుదేరి నడక సాగించారు. అక్కడికి అయిదు క్రోసుల దూరంలో ఉన్న నవాబ్‌గంజ్ చేరుకుని, ఆ రాత్రికి అక్కడ సత్రంలో ఉందామని వారి సంకల్పం దొంగలభయం ఉన్న దారి అన్న సంగతి తెలియనిది కాదు. కాని అంచనాలో వ్యత్యాసం వచ్చి ఉంటుంది! కార్తికమాసం, పగలుపొద్దు తక్కువ నవాబ్‌గంజ్ చేరుకోటానికి చాలా ముందుగానే 'సోనాడాంగా' మైదానంలో కే

'బాబ్బాబు, ఒక్క ఆటంబాంబు పడెయ్యండి!'

"బాబ్బాబు" నాపొలంమీద ఒక్క ఆటంబాంబు పడెయ్యండి" అని అమెరికా విదేశాంగ ఉపమంత్రి ఫారెస్టాల్‌కు ఒక అమెరికన్ రైతు మహజరు పంపుకున్నాడట. ఇది 1948 నాటి సంగతి.

ఆటంబాంబు పడినందువల్ల భూమిసారం పెరిగిందని హిరోషిమా, నాగసాకి ప్రాంతాల రైతులు కనిపెట్టినట్లు ఈ అమెరికన్ రైతు ఒక పత్రికలో చదివాడట తనపొలం మరీ చవుడు బారిపోతున్నందువల్ల, ఆ బాంబేదో తన పొలం దగ్గరకూడా పడేసి పుణ్యం కట్టుకోమని విన్నవించుకున్నాడు.

ఉత్తరం అంతా వ్రాశాక, తనకి ఇంకో ఊహ తోచింది. బాంబు వెయ్యడానికి ఒక రోజు ముందుగా తనకామైనం తెలియచేస్తే, దూరంగా పోతానని తాజాకలం వ్రాశాడు.

"అన్నట్టు ఈ ముక్క మా ఇరుగుపొరుగువారి చెవినవేసేరు జాగ్రత్త" అని ఒక హెచ్చరికకూడా చేశాడట.

ప్రొద్దు ఛగ్గన జారిపోవటం చూసి, బాగు శాస్త్రకారులు ఘూర్ణించి గబగబ నడవటం మొదలెట్టారు. ఈ చెరువుగట్టు ఎక్కుతూనే దొంగలచేతికి చిక్కారు.

ముందు దొంగలు దుడ్డుకర్రతో బ్రాహ్మణ్ణి నెత్తిమీద కొట్టారు. అతడు ప్రాణభయంతో కేకలెట్టుకుంటూ మైదానానికి అడ్డంపడి పరుగెత్తసాగాడు. అతడి వెనకాలే కొడుకు కూడా పరుగు అందుకున్నాడు. కాని ఒకరు వృద్ధు, మరొకడు కుర్రవాడు–దొంగలకు చిక్కకుండా ఎంత దూరమని పరుగెత్తగలరు! కాసేపట్లోనే దొంగలొచ్చి చుట్టుముట్టారు. ఇహ చేసేదేంలేక ఆ బ్రాహ్మడు–తనని చంపితే చంపారు కాని, కొడుకుకైనా ప్రాణభిక్ష పెట్టమని, వంశానికి వాడొక్కడే అంకురమని, వాడు కాస్తా పోతే తనకు 'పిండలోపం' జరుగుతుందని ఎన్నో విధాల వాపోతూ వాళ్ళని వేడుకున్నాడట. ఆనాడు కర్మవశాత్తూ ఆ ముఠాలో వీరురాయ్ కూడా వున్నాడట. అతణ్ణి బ్రాహ్మణ్ణిగా గుర్తించి, ప్రాణభయార్తుడైన వృద్ధుడిదగ్గిరకు వచ్చి, తన కొడుకునైనా విడిచిపెట్టమని కాళ్లు పట్టుకున్నాడట. కాని తనకి పిండలోపం జరిగితే అది ఎదుటివాడికి కంఠం పట్టుకునే సమస్య కాదన్న సంగతి పాపం, ఆ వెర్రి బ్రాహ్మడు గ్రహించలేకపోయాడు. ఆ కుర్రవాణ్ణి అలా వదిలెయ్యటమయినా ఆ దొంగలకి ప్రమాదమేగా. దురదృష్టవంతులయిన ఆ తండ్రీకొడుకుల శవాల్ని ఆ శీతకట్టు రాత్రివేళ ఒకేసారిగా ముసలమ్మచెరువులోకి లాగించేసి, జమ్ముగుబ్బుల అడుగున కుక్కెయ్యండని ఆ దొంగలకి పురమాయించి, వీరురాయ్ తిన్నగా ఇంటికి చేరుకున్నాడు.

ఈ సంఘటన జరిగిన కొద్ది కాలానికే–సరిగ్గా మరి యేడు శరన్నవరాత్రులు సమీపిస్తున్న రోజులు. వీరురాయ్ తన అత్తవారి ఊరు 'హలూద్‌బేడా' నుంచి పడవ చేసుకుని సకుటుంబంగా స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. 'నకేపూర్'కి దిగువ ఉప్పునీళ్ల గంగను దాటి మధుమతీ నదిలోకి వచ్చి, రెండు రోజులు పాటు పోయి కనుక వదిలితే, పడవ ఛర్రున దక్షిణ శ్రీపురం ప్రాంతాల ఇచ్ఛామతి నదిలోకి ఇట్టే వచ్చేస్తుంది. అక్కడినుంచి ఇహ పేముండి-మూడు నాలుగు రోజులు ప్రయాణం తమ ఊరికి.

రోజల్లా ప్రయాణం చేసి, అపరాహ్ణవేళకి తాకీరేవు చేరుకుని, పడవని అక్కడ కట్టేసుకున్నారు. ఇంటిదగ్గర నవరాత్రి పూజలున్నాయి. "తాకీ" సంతలో పూజల కవసరమైన సామానులన్నీ కొనుక్కుని, ఆరాత్రికి అక్కడే గడిపి, తెల్లవారకట్ల పడవను విప్పి, అందరూ స్వగ్రామానికి ప్రయాణమైనారు. రెండోనాటి పండవేళ ధల్‌చిత్ కాలవ, ఇచ్ఛామతీనది కలిసినచోట నిర్మానుష్యంగా ఉన్న లంకలో పడవకి లంగరువేసి, పోటువేళకి ఎదురు చూస్తూ, అక్కడే వంటలు చేసుకోవటం మొదలెట్టారు. పెద్ద లంక, అక్కడక్కడ తుప్పలు, రెల్లుమబ్బులు తప్ప వేరే చెట్లేమీ లేవు. ఒక వైపున వీరు రాయ్‌భార్య, మరొకవైపున పల్లెకారులు పొయ్యిలు పెట్టి, వంటలు ప్రారంభించారు. రెండు రోజుల్లో ఇళ్లకు చేరుకోబోతున్నాం కదా అనే ఉత్సాహంలో ఉన్నారందరూ. పైగా దసరా పండుగలు దగ్గిర కొస్తున్నాయనే సంతోషం కూడా ఒకటుందిగా!

బాగా వెన్నెల వచ్చింది. గంగానదిలో ఉప్పునీళ్లు మిలమిల లాడుతున్నాయి. గాలి జోరుకి రెల్లుపూలు ఆకాశాన్ని, వెన్నెలని, నదీసంగమస్థలంలోని నీటిని సుళ్లు తిరియటం గా చేస్తున్నాయి.

ఉన్నట్టుండి చటుక్కున ఏదో పెద్ద చప్పుడవటం విని, ఒకళ్లిద్దరు పల్లెవాళ్ళు చేస్తున్న వంటలు వదిలేసి, లేచి నుంచుని నాలుగు వైపులా పారచూచారు. రెల్లుదుబ్బుల వెనుక ఏదో జర్రుమన్న ధ్వని, హడిలిపోయి, బిగుసుకుపోయిన గొంతుతో ఎవరో అరిచిన ధ్వని విన్పించి, మళ్ళీ అంతలో అణగిపోయింది. ఏమిటో చూసి వద్దామని ఆత్రంగా ఆ పల్లెకారులు ఆ రెల్లుదుబ్బులుచుట్టి వస్తూంటే ఒడ్డుమీదినుంచి ఏదో దభీమని నీళ్ళలోకి దూకి మునిగింది. అటు వైపున లంకంతా నిర్మానుష్యం. ఎంత చూసినా ఎవరికీ ఎక్కడా ఏమీ కన్పడలేదు.

'ఏమై ఉంటుంది—ఏం జరిగింది' అని తెలుసుకునే లోపుగానే మిగిలిన పల్లెకారు లందరూ అక్కడికి వచ్చేశారు. ఆ గలభా విని, వీరురాయీ, అతడి నౌకరూ కూడా అక్కడికి వచ్చారు. వీరురాయ్ కొడుకు—ఒక్కగానొక్క కొడుకు—ఇప్పటిదాకా పడవమీదే ఉన్నవాడు ఏమయినాడో కన్పడలేదు. వంటలవటానికి ఆలస్యం ఉందని, వెన్నెల్లో కాసేపు ఆ ఇసుకలంకమీద తిరిగివద్దామని వాడింతకుముందే పడవ దిగి వెళ్లాడని తెలిసింది. పల్లెవాళ్ల ముఖాల్లో బల్లెం పొడిచినా నెత్తురుచుక్క లేదు. ఈ లంకల్ని గురించి వాళ్లకి ఉన్న అనుభవాల్నిబట్టి, రెల్లుపొదచాటున పల్లపు ప్రదేశంలోని ఒక మొసలి వచ్చి పొంచి ఉండిఉంటుందని, వీరురాయ్ కొడుకు ఆ ఇసుక తిన్నెమీదికి రాగానే వాడిని చటుక్కున పట్టుకుని, నీళ్లలో దుమికిఉంటుందని ఊహించారు.

తర్వాత ఇహ జరగవలసిన తతంగం అంతా జరిగింది. పడవ తెడ్లు బుజాన్కెట్టుకుని అందరూ ఆ లంకంతా తిరిగి వెతికారు. పడవలో నది నడిమయందాకా వెళ్ళి, అర్ధరాత్రివరకు గడలు వేసి దేవి చూశారు. ఏం చేసినా అనూ-పానూ చిక్కలేదు. ఆతర్వాత ఏడుపులు—పెడబొబ్బలు—అంతకంటె చేయకలిగిం దేముం దిహ? నిరుడు ఇంచుమించు ఇదేవేళకి ముసలమ్మచెరువు ఒడ్డున జరిగినసంఘటనను, ఈ ఏడు ఏ అదృశ్య న్యాయాధిపతో నిర్మానుష్యంగా ఉన్న ఈ ఇచ్ఛామతి నది ఇసుక లంకమీద విచారణ జరిపి తీర్పు ఇచ్చినట్లయింది. ఆ అదృశ్య న్యాయాధిపతిని ముసలమ్మ చెరువులోని జమ్ముదుబ్బులు మాటుచేసి మభ్యపెట్టలేదని, కారుచీకట్లో నయినా అతడు తన న్యాయపథాన్ని గుర్తించగలడనీ, ధూర్తుడైన వీరురాయ్‌కి ఇంత దైవవంచన జరిగాక ఇప్పటికి తెలిసివచ్చింది.

ఇంటికి తిరిగి వచ్చాక వీరురాయ్ ఇంక ఆట్టేకాలం బ్రతకలేదు. వాళ్ల వంశంలో ఇహ నిది ఒక విపరీతపు అనువాయితిగా మారింది. అతడి వంశం లుప్తమైపోయినా అతడి సోదరుల వంశవృక్షం నిలిచింది. కాని ఆ వంశంలోకూడా జ్యేష్ఠ సంతానంఅ నేది జీవించటమంటూ లేదు. పది పన్నెండేళ్లు వచ్చి బాల్యం గడిచేక్కలోగానే ఏదో ఒక జబ్బుతో వైతరణీగట్టెక్కేవాళ్లు వాళ్ళు... ఈ వంశానికి బ్రాహ్మణశాపం తగిలిం దనుకునేవారు లోకులు. హరిహరరాయ్ తల్లి మాత్రం తారకేశ్వరుని దర్శించుకుని, ఆ ఆలయంలోని ఒక సన్యాసిని అర్థించి రక్షరేకు ఒకటి తెచ్చుకుంది. రక్షరేకు ప్రభావంవల్లనయితేనేం, రెండు మూడు తరాలు గడిచేసరికి బ్రాహ్మణ శాపంలోని పటిమ కర్పూరంలా హరించిపోవటంవల్లనయితేనేం, ఇంత వయస్సు వచ్చేంతవరకూ హరిహరుడు మాత్రం బ్రతికే ఉన్నాడు. (ఇంకా ఉంది)



‘[illegible]’ [illegible]



ప్రతిభా వారి 'ఏది నిజం' లో జానకి.



"కిస్మత్ కా ఖేల్"లో వైజయంతిమాల నాట్యభంగిమ.



సాధనా వారి "భలే రాముడు" లో రేలంగి, సీత, సి. యస్. ఆర్.

★

రాజ్యం పిక్చర్స్ నిర్మిస్తున్న 'హరిశ్చంద్ర' లో ఎస్. వి. రంగారావు, మాస్టర్ శేషగిరి, లక్ష్మిరాజ్యం.





జ్ఞాన్ ముఖర్జీ నిర్మిస్తున్న "షట్రంజ్" లో అశోక్ కుమార్, మీనాకుమారి.

బొంబాయి సినిమా లేఖ

భారత దేశంలో తయారైన చిత్రాలలో చుంబనాలున్న దృశ్యాలు ప్రదర్శించటానికి సెన్సార్లు ఇంతవరకూ ఎన్నడూ అనుమతించలేదు. ఈ సంప్రదాయాన్ని తోసిపారేసి ఫిలింస్తాన్ వారు వ్యతిరేకించారు. వీరు నిర్మించిన సినిమాస్కోప్ చిత్రం "బాంబే ఫ్లైట్ 417" లో ఇటువంటి దృశ్యాలను చిత్రించారు. ఈ చిత్రములో నాయిక భూమిక నిర్వహించిన తెలుగు నటి శకుంతలను అమెరికన్ నటుడు ఆలెక్స్ డి ఆర్సీ చుంబిస్తున్న సన్నివేశం వుంది. నిగార్ బట్, అశోక్ కుమార్, ప్రేమ్ నాథ్, బ్రిటిష్ నటుడు జాన్ లాయిడ్ నటించిన ఈ చిత్రాన్ని ఫిలింస్తాన్ వారు బ్రిటన్ లో ప్రదర్శనకై ప్రత్యేకం లండన్ తీసుకువెళ్ళి అక్కడ డబ్ చేయిస్తున్నారు. భారతీయ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నిమిత్తమై బ్రిటిష్ ఫిలింవర్గాలు ఎదురుచూస్తున్నారు.

ఈ చిత్రంలో, ముద్దులున్న దృశ్యాలను భారత దేశంలో సెన్సార్ అంగీకరిస్తారా అని తర్కించుకుంటున్నారు.

* * *

"నాలో ఏం మార్పు వచ్చింది చెప్పు" అని అడుగుతున్నాడు 'ఆర్ పార్'తో అంతను పెరిగిన సంగీత దర్శకుడు ఓ. పి. నయ్యర్. రెండేళ్ళ క్రితం ధరించిన వస్త్రాల వంటివే ఇప్పటికీ వేసుకుంటున్నాడు కట్టు బాట్లో, ఇప్పుడు ముఖ్యంగా నడకలో మాటా తెలియక మార్పు లేదు. అయినా రెండేళ్ళనాడు తెలిస్తా గొప్పచేసిన ఒకానొక చిత్రనిర్మాత, మొన్న నయ్యర్ ను ఆప్యాయంగా పిలిచి, మర్యాదచేసి ఇప్పుడు మరల "అసలు సిసలు మ్యూజిక్ డైరెక్టర్ లా తున్నావు" అని పొగడటం తప్పలేదు.

రెండేళ్ళ క్రితం ఈ నిర్మాత దగ్గరికి నయ్యర్ వచ్చాడు అవకాశం కోసం. తన సంగీతం తనకు కావాలని చెప్పాడు నిర్మాత కోరికపై రెండు మూడు పాటలుపాడి, అక్కడున్న వారందరిని మెప్పించాడు. నిర్మాత సరే అంటా తేస్ అన్నారు. "అయితే నాకు ఉద్యోగం ఇస్తారా" అన్నాడు నయ్యర్. అక్కడే వచ్చింది చిక్కు. నిర్మాత సావకాశంగా, నయ్యర్ విగ్రహాన్ని ఎగాదిగా చూసి, "నీ వాలకం చూస్తే సంగీత దర్శకుడివి అనిపించటం లేదు" అన్నాడట నయ్యర్ వెళ్ళిపోయాడు 'ఆర్ పార్'తో నయ్యర్ పేరు నాలుగుచోట్లా మారుమ్రోగింది. ఫలానా

★ బొంబాయి సినిమాలేఖ ★

నిర్మించిన కొత్తచిత్రం 'భాగం భాగ్'కు కూడా సంగీతం సమకూర్చాడు. రెండేళ్ళనాడు నవ్వి ఊరుకున్న నిర్మాత మొన్ననే నయ్యార్‌ను పిలిపించి, తన కొత్త చిత్రానికి పనిచేయమని కోరాడు.

కాంట్రాక్టుమీద సంతకం పెట్టేముందు, నయ్యార్, నిర్మాతవంక తిరిగి, రెండేళ్ళనాడు మీరు నన్ను అన్నమాటలకి ఇప్పుడు ఏకబిగి అరగంటసేపు జవాబివ్వాలని ఉంది అన్నాడు. నిర్మాత పకపకనవ్వి కానియ్ అన్నాడు.

అంతా అయిపోయాక భుజంతట్టి, "నయ్యార్, ఇప్పుడూ నువ్వు అసలు సిసలు మ్యూజిక్ డైరక్టర్‌లా ఉన్నావు" అన్నాడు. నయ్యార్ విస్తుపోయాడు. రెండేళ్ళలో వచ్చిన మార్పేమిటా అని...

* * *

బొంబాయిలో అల్లర్లన్నీ చల్లారడంతో, మొన్ననే ఐదుచిత్రాలు విడుదల అయ్యాయి. వాటిలో భగవాన్ బ్రదర్స్ నిర్మించిన "భాగంభాగ్" ఒకటి. హాస్యరస ప్రధానమైన ఈ చిత్రంలో భగవాన్, కిషోర్‌కుమార్, స్మృతిబిశ్వాస్, శశికళ నటించారు. ఓ. పి. నయ్యార్ సంగీతం సమకూర్చాడు. దర్శకుడు భగవాన్. మొట్టమొదటినించి చిట్టచివరివరకూ నవ్వించగలకథ, అందుకుతగ్గట్టే, మంచినైపుణ్యంతో చిత్రించిన సన్నివేశాలు, నయ్యార్ సంగీతం గల ఈ చిత్రం 'బాక్సాఫీస్ హిట్' అవుతుందని ఇక్కడ సర్వత్రా అంటున్నారు

* * *

వైజయంతిమాల, సునీల్‌దత్, బీగంపారా ప్రభృతులతో, షాహూ ఫిలింస్ నిర్మించిన "కిస్మత్ కా ఖేల్" ఆశించినంత బాగాలేదు. వైజయంతిమాల ఈచిత్రంలో నర్తకిగాకన్న నటిగానే బాగా రాణించింది. సునిల్‌దత్ నటన నిరుత్సాహకరంగా తయారైంది.

* * *

హేమచందర్ చిత్రం "మద్ భరేనైన్" ప్రేమపురాణం కథ చిన్నదేఅయినా, చిత్రం పొడుగునా సన్నివేశాలు పునరావృత్తం అవుతూ విసుగెత్తించింది. నాయకీ నాయకులు కిశోర్‌కుమార్, బీనారాయ్‌లనటనలో కొత్తదనం ఏమీలేదు. సంగీతం పేలవంగా ఉంది.

మరోచిత్రం షాహజాదా. ఇది స్టంటు చిత్రాల తరగతికి చెందుతుంది. బీగంపారా నటనమాత్రం బాగుంది.

ఐదవది జబీన్, నసీర్‌ఖాన్, బీగంపారా నటించిన "లూటేరా". పాత్రలలాగే నటన కూడా మూసపోసిన పంథాలో ఉంది.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి)

★

నరసూవారి "భలేరాముడు"

బాంబేటాకీస్ వారి 'కిస్మత్' ఆధారంగా నరసూ పిక్చర్స్ నిర్మిస్తున్న చిత్రానికి "భలే రాముడు" అని పేరు పెట్టారు. నాగేశ్వరరావు, సావిత్రి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్నారు. ఇదే చిత్రాన్ని, జెమినీ గణేశన్ నాయకుడుగా వీరు తమిళంలో కూడా నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్య.



వాహిని వారు తీసిన పెద్ద మనుషులులో నటించిన శ్రీ లింగమూర్తికి శ్రీ రాజమన్నార్ ఉత్తమ నట బహుమతి ప్రసాదిస్తున్నారు.

సినిమా వార్తలు

వరలక్ష్మి స్వంతచిత్రం

ప్రసిద్ధనటి ఎస్. వరలక్ష్మి, వరలక్ష్మి ఫిలింస్ పేరిట "సావిత్రి" చిత్ర నిర్మాణానికి పూనుకున్నది. ముఖ్యభూమికలు ఆమె, నాగేశ్వరరావు నిర్వహిస్తున్నారు. యముడు యస్. వి. రంగారావు, రేలంగి, నాగయ్య, కన్నాంబ ఇతర ప్రముఖ భూమికలు నిర్వహిస్తారు. దర్శకుడు శ్రీ కడారు నాగభూషణం. సంగీతం శ్రీవేణు సమకూర్చుతున్నారు. ఇప్పటికి రెండు పాటలు రికార్డయ్యాయి. ఈ నెల ఆఖరువారంలో సెట్స్ మీదకు వెళ్తారు—స్టూడియో జెమినీ.

* * *

సాహిణీ వారి 'పెంకిపెళ్ళాం'

సాహిణీవారి రెండవ చిత్రం "పెంకి పెళ్ళాం"కు మొన్న రెండుపాటలు రికార్డు చేశారు. ఒకటి లీల, ఒకటి సుశీలా పాడారు. ఈ నెలాఖరు లోగా ఇంకో రెండుపాటలు రికార్డవుతాయనీ, మార్చి మొదటి వారంలో సెట్స్ మీదకు వెళ్తామనీ దర్శకుడు శ్రీ రజనీకాంత్ చెప్పారు. ఎన్. టి. రామారావు, రేలంగి, శ్రీరంజని, రాజసులోచన ముఖ్య భూమికలు నిర్వహిస్తున్నారు.

* * *

మహీవారి "గౌరిమహాత్మ్యం"

మహీ ప్రొడక్షన్స "గౌరీమహాత్మ్యం" యోగానంద్ దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది. ఆరు రీళ్ల వరకూ పూర్తిఅయింది. ఎన్. టి. రామారావు, శ్రీరంజని, రేలంగి, ముక్కామల, సూర్యకాంతం మొదలుగు వారు నటిస్తున్నారు. సంగీతం ఓగిరాల, టి. వి. రాజు సమకూర్చుతున్నారు. నిర్మాత శ్రీ శేషాచలం చెట్టియార్.

* * *

ప్రతిభావారి "ఏది నిజం"

ప్రతిభా వారు బాలచందర్ దర్శకత్వాన నిర్మిస్తున్న "ఏది నిజం" దాదాపు పూర్తి అయినట్లే. అంతా కలసి ఇంకో ఐదారు కాల్‌షీటు పని ఉంటుంది. కొంత ఔట్‌డోర్ షూటింగ్ కూడా ఉంది. దీనికై మహాబలిపురం వెళ్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు, తప్పితే మార్చి మొదటి వారంలో విడుదల అవుతుందని నిర్మాత కృష్ణమూర్తి చెప్పారు.

పలికిన పెదవి

... అయిన ఒక స్త్రీ, అడవుల వెంబడి తిరుగాడుతోంది "ఏమైనారో పిల్ల లెందున్నారో" అని తల్లడిల్లుతోంది అమ్మకోసం బెంగపెట్టుకున్నారేమో, అన్నం కోసం అలమటిస్తున్నారేమోనని పరితపిస్తోంది

ఈ సన్నివేశానికి ఎంతో బాగా ఒప్పే వసంతరాగంలో ఘంటసాల పాట కట్టారు. ఎస్. వరలక్ష్మి ఆ పాటను పాడింది ఫిబ్రవరి 9వ తేదీన వీనస్ స్టుడియోలోని ఆవరణలో పరితపనపడదన అయి తిరుగాడుతున్న రాణి భూమికను ఆమె నిర్వహిస్తోంది రెండు విద్యలలోనూ ఆరితేరిన ఆర్టిస్టు కాబట్టి, టేక్ తరవాత టేక్ వృథా కావలసిన అగత్యం లేకుండా లౌడ్ స్పీకరులో వచ్చే పాట, ఎదుట కెమెరాలో రికార్డవుతున్న బొమ్మ సింక్రనైజ్ అయిపోతున్నాయి. ఈ లిప్ మూవ్‌మెంట్ సింక్రనైజేషన్ కోసం, వరలక్ష్మి లౌడ్ స్పీకర్ పాటతోపాటు, తనకూడా గొంతెత్తి పాడింది అరదరగం అవగానే కట్ అన్నారు దర్శకుడు రజనీకాంత్ కెమెరామన్, నాగేశ్వరరావు, తరువాతి షాట్ కు సన్నాహాలు ప్రారంభించారు. వరలక్ష్మి వసంతరాగం ఆలాపన చేస్తూ ఓ కుర్చీలో కూర్చుంది ఒక నిముషం ఆగి, ఈ "రాగం చాలా బావుంటుంది కదండీ" అంది

ఈ రాగంలో ఆమె పాడినపాట గోకుల్ పిక్చర్స్ పేరిట శ్రీ దోనేపూడి కృష్ణమూర్తి నిర్మిస్తున్న కనకతార చిత్రంలోనిది

"ఇందులో నేను మూడు పాటలు, ఒక పద్యం పాడుతున్నాను" అని వరలక్ష్మి చెప్పింది...

ఫిబ్రవరి 8వ కూడా, అడవిలోనే మరి కొన్ని దృశ్యాలు చిత్రించారు దర్శకుడు రజనీకాంత్

హఠాత్తుగా అదృశ్యులైపోయిన తారా, కనకసేనుల అన్వేషణకు సంబంధించినదే అది కూడా ఈ దృశ్యాలలో పిల్లలను వెదకబోయిన విజయసేనుడుగా అమర్‌నాథ్, ఈ రాజును కూడా ఎత్తుకుపోయి బంధించిన దొంగల నాయకుడుగా కోటేశ్వరరావు, విజయసేనుడి మంత్రిగా పి శ్రీనివాసరావు నటించారు

"కనకతార దాదాపు పూర్తి అయినట్లే మార్చి మొదటివారంలో విడుదల చేస్తాము" అని దర్శకుడు రజనీకాంత్ చెప్పారు. ★



ఉత్తమ తెలుగు నటీమణులలో శ్రీమతి భానుమతి తరఫున శ్రీమతి జమున బహుమతి స్వీకరిస్తోంది.

ఉత్తమ నటీనటులకు ఫిలిం ఫాన్స్ సంఘం బహుమతులు

1954లో ఉత్తమ నటీనటులుగా ఎన్నికైనవారికీ, ఉత్తమ చిత్రాల నిర్మాతలకు, ఉత్తమమైన థియేటర్ అధిపతికీ మద్రాసు ఫిలింఫాన్స్ సంఘం ఈ నెల 9వ తేదీన బహుమతులిచ్చి గౌరవించారు బహుమతి ప్రదానోత్సవం మద్రాసు మ్యూజియం థియేటర్ లో జరిగింది

మద్రాసు ప్రధాన న్యాయమూర్తి, సంగీత నాటక పరిషత్ అధ్యక్షుడు అయిన శ్రీ పాకాల వెంకట రాజమన్నార్, సభకు అధ్యక్షత వహించి, బహుమతులను పంచిపెట్టారు సభకు ఫిలింఫాన్స్ సంఘ సభ్యులు చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులూ పలువురు వచ్చారు

శ్రీ రాజమన్నార్ ఈ సభలో మాట్లాడుతూ చలనచిత్రాలు కేవలం వినోదం సమకూర్చేవే కాక, కళా ప్రయోజనాలకు దోహదం చేసేవి కాబట్టి, ఈ పరిశ్రమలో ఉన్నవారంతా, ఉత్తమ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని వాటికి అనుగుణంగా వ్యవహరించాలని ఉద్బోధించారు ఈ సందర్భంలో సంగీత నాటక అకాడమీ విషయం ప్రస్తావించి, సంగీత నాటక కళల పురోభివృద్ధికి దోహదం చేసే సంఘాలలో ఇది అధిష్ఠాన సంఘం వంటిదని, దీన్ని ప్రభుత్వమే నెలకొల్పినా, ఇది ప్రభుత్వ సంస్థ మాత్రం కాదని శ్రీ రాజమన్నార్ అన్నారు ఈ సంస్థ పరిధిలోకి చలనచిత్రాలు కూడా వస్తాయంటూ, మొత్తానికి దేశంలో ఈ కళల పురోభివృద్ధి కృషి చేసే సంఘాల కార్యకలాపాలన్నీ సమన్వయించడం జరగాలని ఆయన చెప్పారు.

బహుమతి ప్రదానం

అనంతరం బహుమతుల ప్రదానం జరిగింది. ఉత్తమ తెలుగుచిత్రంగా ఎన్నికైన వాహినీ వారి "పెద్దమనుషులు"కు వచ్చిన బహుమతిని ఆ చిత్రం దర్శకుడు శ్రీ కె వి రెడ్డి, ఉత్తమ తమిళచిత్రం ఎ వి ఎం వారి "అందనాళ్"కు వచ్చిన బహుమతిని ఎ వి ఎం మేనేజరు శ్రీ జి. రంగనాథన్ అందుకొన్నారు.

ఉత్తమ నటీనటులుగా ఎన్నికయిన శ్రీ లింగమూర్తి (పెద్దమనుషులు), శ్రీమతి భానుమతి (విప్రనారాయణ), శ్రీ శివాజీ గణేశన్ (తూక్కు తూక్కి), శ్రీమతి పద్మిని (ఎదిర్ పారాదగు) గారలకు, నాట్యభంగిమలో ఉన్న స్త్రీ విగ్రహాలను (రజత విగ్రహాలు) బహూకరించారు

ఉత్తమ ఉపపాత్రధారులుగా ఎన్నికైన శ్రీ రేలంగి (పెద్దమనుషులు), శ్రీమతి జమున (మాగోపి), శ్రీ తంగవేలు (కుటుంబం) శ్రీమతి ఎమ్ ఎన్ రాజం (రక్తకన్నీర్) గారలకు ప్రశంసాపత్రాలిచ్చి గౌరవించారు

ఉత్తమ బాలనటుడు చి॥ వెంకటేశ్వర్ (మా గోపి) కు సువర్ణ పతకం ఇచ్చారు

ఉత్తమ థియేటర్ గా ఎన్నికైన 'బిం

ఫిలింఫాన్స్ బహుమతులు

...లాంట్'కు వచ్చిన బహుమతిని ఆ థియేటర్ మేనేజరు శ్రీ టి. వి. ఎస్. మణి అందుకొన్నారు.

నటీనటులలో శ్రీమతి భానుమతికి వచ్చిన బహుమతిని ఆమె తరఫున శ్రీ శివాజీ గణేశన్ అందుకున్నారు.

అధ్యక్షుని వినతి

కుమారి భూమి, చి|| కృష్ణవేణిల ప్రార్థనతో సభ ఆరంభం అయింది. ఫిలిం ఫాన్స్ సంఘం అధ్యక్షుడు శ్రీ ఎ. అరుణాచలం స్వాగతం చెబుతూ, ఈ సంఘం కృషిని వివరించి, ప్రభుత్వం ఇచ్చే బహుమతులకు అర్హతగల చిత్రాలను నిర్ణయించడంలో ఈ సంఘం కూడా పాల్గొనడానికి వీలు కలిగించాలని కోరారు.

ఉపాధ్యక్షురాలు శ్రీమతి రాజలక్ష్మీ అనంతరామన్ నివేదిక సమర్పిస్తూ, డా|| యు. కృష్ణారావు అధ్యక్షతన నెలకొల్పిన సంఘం, పది తెలుగు చిత్రాలు పన్నెండు తమిళ చిత్రాలూ చూచి ఈ నిర్ణయాలు చేశారని తెలియచేశారు

డా|| యు. కృష్ణారావు తాను నిర్ణయాలు చేసినప్పుడు చలనచిత్రాలు, ప్రబోధాత్మకమైనవిగానేకాక, ప్రేక్షకులపై సత్ప్రభావాలను ప్రసరింపచేసేవిగా ఉండాలన్న దృక్పథంలో ఆయా చిత్రాలను పరిశీలించానని తెలియచెప్పారు.

ప్రసిద్ధ దర్శకుడు శ్రీ కె. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫిలిం పరిశ్రమకు సంబంధించిన వివిధ సంఘాల కార్యక్రమాలు సమన్వయించబడాలన్నారు.

బాలల చలనచిత్రోత్సవం

ఫిలిం ఫాన్స్ సంఘ కార్యదర్శి శ్రీ ఇ. కె. రామ్మూర్తి మాట్లాడుతూ వచ్చే నెల మద్రాసులో బాలల చలన చిత్రోత్సవం ఏర్పాటుచేయ సంకల్పించామని చెప్పారు.

ఉపాధ్యక్షురాలు శ్రీమతి లీలా ఆశీర్వాదం వందనసమర్పణతో సభ ముగిసింది.

* * *

'పేదపిల్ల' నాటక ప్రదర్శన

తమిళనాడులో తుపాను బాధితుల సహాయార్థం, సుకృత లక్ష్మీవిలాస సభ (మద్రాసు) వారు ఈ నెల 8వ తేదీన, సౌందర్య మహల్‌లో, 'పేదపిల్ల' అనే నాటకం ప్రదర్శించారు. నాటక రచయిత శ్రీ మల్లాది సత్యనారాయణ

శ్రీమతులు ఎం. ఎ. రాజేశ్వరి, సీతా [illegible] శ్రీ [illegible] టి. ఆర్. శాస్త్రి, ఆర్. నారాయణస్వామి, పి. భద్రాద్రి, టి. గోవిందరాజులు, ఎస్. ఎం. చంద్రశేఖరన్ ప్రభృతులు నటించారు. శ్రీ పి. వెంకటరంగనాయకులు దర్శకత్వం వహించారు. ★



ఎ. వి. ఎం. వారి నాగులచవితిలో పార్వతిగా జానకి, శివుడుగా నాగభూషణ్.

అమరకవి ఉమర్‌ఖయాం

విస్టావిజన్ వర్ణచిత్రంగా నిర్మాణం

అమరకవి ఉమర్‌ఖయాం జీవిత గాథను పారమౌంట్ పిక్చర్స్ వారు తెరకెక్కించ నిశ్చయించారు. విస్టావిజన్, టెక్నికలర్‌లో వీరు నిర్మించే ఈ చిత్రంలో, సుప్రసిద్ధ అమెరికన్ నటుడు కార్నల్ వైల్డ్ ఖయాం భూమికను నిర్వహిస్తాడు. ఉమర్ ఖయాం ప్రియురాలు షారాయిన్ భూమికను, సిసిల్ బి. డిమిల్ "టెన్ కమాండ్‌మెంట్స్"లో నటిస్తున్న డెబ్రాపాజెట్‌కు ఇచ్చారు. షారాయిన్ అనేకసార్లు ఉమర్ తో [illegible] దనీ, ఉమర్ మనసారా ఆమెను ప్రేమించాడనీ చెప్పుకుంటారు. వీరి ప్రేమ పథంలో షరియా ప్రభువే అడ్డు నిలుస్తాడు. ఆయన షారాయిన్‌ను వరిస్తాడు. అక్కడితో ప్రేమికులు ఎడబాటై తపిస్తారు. రాజా మరణించిన తరువాతనే వారి పునస్సమాగమం సాధ్యమౌతుంది. పారమౌంట్ వారు తీసుకున్న కథాసూత్రాలుగా ఇవే. ఈ చిత్రానికి విలియం డైటర్లీ దర్శకత్వం వహిస్తున్నారు. సుప్రసిద్ధ నటులు రేమండ్ మాసీ, ట్రెవర్ హోవర్డ్, జాన్ డెరిక్‌లు ఇందులో ప్రముఖ భూమికలు నిర్వహిస్తారు. త్వరలో నిర్మాణం ప్రారంభం అవుతుందని తెలుస్తున్నది

* * *

ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ కొత్త చిత్రం "టు క్యాచ్ ఎ థీఫ్" త్వరలోనే మద్రాసు [illegible] థియేటర్లలో విడుదల కానున్నది.

బాలసాహితి

మత్స్యావతారము

పూర్వం ఒకప్పుడు ద్రవిడ దేశాన్ని సత్యవ్రతుడనే రాజు పరిపాలించాడు. సత్యమునే పలకటం ఆయన వ్రతం. అందువల్ల సత్యవ్రతుడనే పేరు ఆయనకు ఎంతైనా తగిఉన్నది. అన్ని ప్రాణులను చాల దయగా చూచేవాడు. ప్రజలకేకాక ఎవరికే ఆపదవచ్చినా ఆదుకొని చేతనయిన ఉపకారం చేసేవాడు. ఆయన రాజ్యంలో నలుమూలలా శాంతి నిండిఉన్నది. ఆయన శ్రీవిష్ణుదేవుణ్ణి మహాభక్తితో పూజించుతూ ఉండేవాడు. ఆ రాజు కృతమాలిని అనే నదిఒడ్డున ఆశ్రమం ఏర్పరచుకొని నీటినిమాత్రమే ఆహారంగా పుచ్చుకుంటూ శ్రీవిష్ణువునుగూర్చి తపస్సు చేశాడు. ఒకనాడు కృతమాలినీ నదిలో స్నానంచేసి విష్ణుదేవుడికి నీళ్లతో తర్పణం విడుస్తున్నాడు. దోసిలిలో ఏదో కదిలినట్లయింది. చూచాడు. అది చిన్న చేపపిల్ల, చిన్న తోక, చుక్కలవంటి కళ్లు, తళుకు తళుక్కున మెరిసే ఒళ్లు. ఒంటినిండా రంగురంగుల చుక్కలు. ముద్దులు మూటకట్టుతున్నది ఆ బుల్లిచేప. రాజు చటుక్కున నీళ్ళలో విడిచిపెట్టాడు. అప్పుడా చేపపిల్ల నీటిపైకి తేలి ఆ రాజుకళ్ళలోనికి జాలిగా చూస్తూ రాజు కర్థమయ్యే భాషలో ఇట్లా అన్నది. "ఓ దయామయా! ఈ దిక్కులేని చేపపిల్లమీద నీకు జాలి లేదా? చూడు! ఈ నదిలో ఎన్నెన్ని పెద్ద పెద్ద చేపలూ, మొసళ్లూ ఉన్నవో! మాజాతిలో జ్ఞాతిశత్రుత్వము ఉన్నదని నీకు తెలిసిందేకదా! చిన్న చేపలను పెద్ద చేపలు తింటాయి. నా కండ్ల ఎదుటనే ఇల్లాంటి ఘోరాలెన్నో జరిగాయి. నా గతి కూడ అంతేకదా? ఈ గండం ఒకవేళ గడిచినా మరో గండం తప్పదు. బెస్తవాండ్లు గాలాలువేసి గాలించి వలలు వేసి జల్లించి, ఎక్కడనక్కినా పట్టుకుంటారు. మెడపిసికి తోరణాలు గుచ్చుతారు. రాజా! నీకు తెలియనిదేమున్నది! అన్ని దానాలకంటె ప్రాణదానం గొప్పది. శరణమన్నవారిని కాపాడటం మీ రాజధర్మంకూడ," అని మొఱపెట్టుకున్నది.

రాజు హృదయం కరిగిపోయింది. నీటితో నిండిన తన కమండలంలో వేసుకొని తన యింటికి తీసుకొని వెళ్లాడు. కమ్మని మిఠాయి ఉండలు కడుపునిండా మేపాడు. ఆరాత్రి గడచింది. తెల్లవారగానే రాజు తన చేపపిల్ల ఎట్లా ఉన్నదీ చూడవలెనని వెళ్లాడు. బుల్లిచేప పెద్దదయింది. కమండలంపట్టీ పట్టనట్లుగా పెరిగింది. రాజు "ఓ బుల్లిచేపా బాగున్నావా?" అని పలుకరించాడు. "ఆఁ! నీదయవల్ల బాగానే ఉన్నాను. కాని రాజా! నాకీ కమండలం ఇరుకుగా ఉన్నది. ఇంకా కొంచెం పెద్దచోటు చూపించు" అన్నది చేప.

రాజు తన యింటిలో ఉన్న పెద్ద నీటితొట్టిలో ఆ చేపను విడిచిపెట్టాడు. చూస్తూ ఉండగానే అది ఒక ముహూర్తంలో మూడు చేతుల పొడవు పెరిగిపోయింది. "ఓ సత్యవ్రతా! ఈ తొట్టి నాకు చాలటంలేదయ్యా! ఇంతకంటె విశాలమైన తావు చూపించలేవూ! నీకు పుణ్యముంటుంది" అని అన్నది.

రాజు దాని పెరుగుదలకు ఆశ్చర్యపడుతూ దానినొక కొద్దిపాటి మడుగులో విడిచిపెట్టాడు. మరి కొంతకాలానికి ఆ మడుగు కూడ చాలనంత పెరిగింది. ప్రతిదినం రాజు దానికి ఆహారం పెడుతూ యోగక్షేమాలు విచారించి వెళ్లే

అక్కిరాజు వేంకటేశ్వరశర్మ

రాజు. ఓ చేప రేడా! ఎట్లా ఉన్నావు? అని రాజు కుశలప్రశ్న చేశాడు. "ఆఁ! అడుగు తావు! ఏదో ఇట్లా ఉన్నాను! మీనం మెదవటానికైనా తోక కదపటానికైనా, చోటు లేదాయె" అని పెదవి విరిచింది.

రాజు నవ్వుతూ ఈ వింత చేపను సరోవరంలోకి, అక్కడనుండి నది లోకి చాల ప్రయత్నం చేసి ఆవిధం గానే మార్చించాడు. కాని ఆ అబ్బురపు చేపకు అక్కడ కూడ ఇబ్బంది గానే ఉన్నది. "నేను స్వేచ్ఛగా సంచరించాలంటే ఈ నది నాకేమూలకు? ఎంతసేపూ నిలువునా ఈదవలసిందే కాని అడ్డం తిరిగితే మరి ఒడ్డు తగులుతుందిగా" అని గొణిగింది. రాజు చాల పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి మహా ప్రయాసతో దాన్ని సముద్రంలో విడిచిపెట్టించాడు. గిఱ్ఱున ఆ రాజు మెదడులో ఒక ఆలోచన మెదిలింది. కొద్ది రోజుల క్రిందట తన దోసిలిలోకి వచ్చిన బుల్లి చేపపిల్లేనా ఇది? ఎంతలో ఎంత మార్పు! ఇది నిజమైన చేపేనా? ఇందులో ఏదో రహస్య మున్నది. ఇంతకాలం తాను తపసు చేస్తున్న శ్రీమహావిష్ణువే నో! ఏమో!..."చేపరూపంలో ఉన్న ఓ దేవదేవా! నీ వెవరు? ఇటువంటి చేపను ముందెన్నడు కని విని ఎఱుగము. నీవు రోజుకు నూఱామడ పొడవు పెరుగుతావు. పైగా మాటలాడగలవు. ఇటువంటి చిత్రం ఎందైనా ఎప్పుడైనా కద్దా! నాకు అనుమానంగా ఉన్నది. నన్ను కరుణింపవచ్చిన శ్రీ విష్ణుదేవుడవు కావా?" అని మోకరిల్లాడు. చేప నవ్వి ఔనన్నట్లు తల ఊపింది.

"ఓ మహావిష్ణూ! ఈ నీచమైన చేపరూపం ఎందుకు తాల్చావు! లోకాలన్నీ పుట్టించి పెంచి లయింప చేసే మహానుభావుడవే!" అని అన్నాడు సంభ్రమాశ్చర్యాలతో.

ఆ మహామీనం ఇట్లా అన్నది. "దానికేమిలే అవసరంకొద్దీ ఏ వేషమైనా వేయవలసివస్తుంది. అందులోని మంచిచెడ్డలు నాకేమీ చెందవు. ఏ అవతారమెత్తినా నీవంటి సజ్జనులను కాపాడటం, దుర్మార్గులను శిక్షించటం, అదేగా ప్రయోజనం. ఈ మత్స్యావతారానికి కొన్ని ప్రయోజనాలున్నవి. ఇంక ఏడు రోజులకు బ్రహ్మకొక్క పగలు నిండుతుంది. జలప్రళయం రానున్నది. సముద్రాలు ఉప్పొంగి ప్రపంచాన్నంతా ముంచివేస్తవి. మూడు లోకాలూ నశించిపోతాయి. అంతా జలమయం. దానిని నైమిత్తిక ప్రళయమంటారు. ఆసమయంలో నిన్ను నేను రక్షిస్తాను. నీవున్న తావుకు ఓడను పంపుతాను. దానిలో ఎక్కు! చూడు! ఈలోపల మంచి మంచి ఓషధులను అన్ని రకాల విత్తనాలను సేకరించి, దాచి పెట్టి ఉంచుకో!" అని చెప్పి నీళ్లలో మాయమయింది ఆ పెనుచేప.

రాజు చెప్పినట్లే అన్ని ఓషధులను సేకరించాడు. దర్భలమీద తూర్పువైపు తలగడ ఉంచి మనస్సులో శ్రీమహావిష్ణువును ధ్యానించుకుంటూ ఉన్నాడు. ఆ జలప్రళయం రానేవచ్చింది. ఆకాశమంతా ప్రళయమేఘాలు అలుముకున్నవి. ఉరుములు - మెఱుపులు - పిడుగులు - తెంపులేని జడివానలు - ఏనుగు తుండములంతేసి ధారలు...అబ్బ, సముద్రాలన్నీ కలిసిపోయినవి. భూమి కనపడదు. ఏ ప్రాణీ కనపడదు. చెట్టు...పుట్ట...గుట్ట అన్నీ మునిగిపోయినవి. అంతా జలమయం. మరి సత్యవ్రతుడెక్కడ?

అదుగో! పెద్ద ఎత్తైన పర్వత శిఖరం. దానిమీద నిలుచుండి చూస్తున్నాడు. ఆ నావ ఇంకా రాలేదే! నీటి ప్రవాహం శిఖరాన్ని ముంచుతున్నది. పాదాలు తాకినై. మోకాళ్లు దాటినై, ఇంకా రాలేదే! రాలేదే...రాదేమో! అనుకుంటున్నాడు.

అదుగో! దూరంగా ఏదో చుక్కలాగా కనిపిస్తున్నది. సందేహంలేదు. నిజంగా ఓడే. చాల పెద్దదికూడ. తనదగ్గరికే వచ్చింది. ఎంత చక్కని నావ. సమయానికే వచ్చి తనను రక్షించింది. శ్రీ మహావిష్ణువు చెప్పిననావ ఇదే కాబోలు. లోపల ఎవరో వేద ఋక్కులు చదువుతున్నారు. సప్తర్షులు కాబోలు. తనను ఎక్కమన్నట్లు చేతి నూపుతున్నారు.

సత్యవ్రతుడు ఓడ నెక్కాడు. తనకు కావలసిన సౌకర్యాలన్నీ అందులో ఉన్నాయి. అంతా దేవుని మాయ అనుకున్నాడు. ఆ పెనుచేప కూడ దాపుననే ఉన్నది. దాని కొమ్ముకు పెద్దపాము గట్టిగా చుట్టుకొని ఉన్నది. తోక ఓడకానుకొని ఉన్నది. ఆ పాము తోకను ఓడకు ముడివేస్తే ఓడ కొట్టుకుపో

కుండా ఉంటుందన్నారు ఋషులు. సత్యవ్రతుడు అట్లాగే ముడివేశాడు. ఓడకు ఏ అపాయం రాకుండా చూచుకుంటూ ఓడను ఆ మహా మీనం ఎటో లాగుకొనిపోతున్నది. ఓడను పొడవాలని ఎన్నో తిములు తిమింగిలాలు వచ్చాయి. అన్నింటిని ఆ మహా మీనం మట్టుపెట్టింది అదేదో పెద్ద పర్వత శిఖరం. దాని దగ్గరకు లాగి తెచ్చి ఓడను దాని కానించింది. రాజు ఓడకు లంగరు వేశాడు. ఆ కాళరాత్రివేళ బ్రహ్మ దేవుడు గుర్రుపెట్టి నిద్రపోతు న్నాడు. పగలంతా పాపం సృష్టి చేసిచేసి అలసిపోయినాడు కాబోలు!

అంతలో హయగ్రీవుడనే రాక్ష సుడు వచ్చి ఆయనదగ్గరున్న వేదా లను దొంగిలించాడు. ఆ సముద్రం అట్టడుగుకు పోయి దాక్కున్నాడు. కాని ఇదంతా చేపరూపంలోఉన్న విష్ణువు చూస్తూనే ఉన్నాడు. ఆ పెనుచేప మీసాలు కదిపి - తోక సారించి- రెక్కలు రిక్కించి రివ్వున బాణంలాగా వెళ్లి ఆ క్రూర రాక్ష సుణ్ణి కొమ్ముతో పొడిచి చంపింది. ఆ వేదాలను తిరిగి తెచ్చింది. సత్య వ్రతుడి దయాగుణాన్ని ఎంతో ప్రశంసించింది. ధన్యవాదాలు చెప్పింది. రాజు మీనరూపంలో ఉన్న విష్ణువును స్తుతించాడు. చూస్తూండగానే ఆ మహామీనం శ్రీ మహావిష్ణువుగా సాక్షాత్క రించింది.

శంఖము - చక్రము - గద - ఖడ్గము - నాల్గు చేతులలో నాల్గు ఉన్నవి. మెడలో కౌస్తుభమణి. వన మాల. పీతాంబరం. కన్నులలో తొలికే కరుణరసం. ఎంత దివ్య మంగళవిగ్రహం. శ్రీ విష్ణువు రాజు మంచితనాన్ని, భక్తిని, పరో పకారబుద్ధిని మెచ్చుకున్నాడు. 'మనువు' అనే అధికారం ఆయన కిచ్చాడు. మనువుసంతతివారము కనుక మనకు మానవులని, మను ష్యులని పేర్లు వచ్చినవి.

అంతలో నిద్రనుండి బ్రహ్మ లేచాడు. మరల యథావిధిగా సమస్త లోక సృష్టికి పూను కున్నాడు. విష్ణువు వేదాలను తెచ్చి బ్రహ్మకిచ్చాడు. ఈ సత్యవ్రతుడు. మరల సృష్టించే పనిలో బ్రహ్మ కెంతో తోడ్పడ్డాడు. తనవద్ద నున్న బీజాలను, ఓషధులను బ్రహ్మ కిచ్చాడు. ఆ సత్యవ్రతుడే 'వైవస్వత మనువు' అనే పేరుతో ఇప్పుడు దేవలోకంలో ఉండి పరిపాలిస్తు న్నాడు. ఈయన పద్నాలుగుమంది మనువులలో ఏడవవాడు. సత్యము- దయ, పరోపకారబుద్ధి-దైవభక్తి, ఇటువంటి సద్గుణాలుండటంవలన సత్యవ్రతుడు భగవంతునికి ప్రియ భక్తుడై మనువు కాగల్గాడు. సత్య వ్రతునివలె 'ఆత్మవత్సర్వ భూతాని' అన్ని ప్రాణులు తన వంటివే అని భావించి, వేటికీ కీడు చేయక చేతనయిన ఉపకారం చేయ టం మంచిది. అట్టివారిని భగవం తుడు సత్యవ్రతుణ్ణి రక్షించినట్లు రక్షిస్తాడు. ★

మంత్రగాని మురళి

నవ్యశ్రీ

అమ్మా! మన ఊరి సంత
లో చూచా ఒక్కవింత!
బలే బలే అయిన వింత!
కలలో కనబడని వింత!

గారడి వాడొక్కడు మన
ఊరి సంత కొచ్చాడే!
చేసె మాయలెన్నెన్నో
చూచు వారి కనువిందుగ

బంకమట్టిలో మామిడి
టెంకపాతి నీరుపోసి
నిముషంలో దాన్ని పెద్ద
మామిడిచెట్టుగ చేసెను!

దాని పండు కోసిఇవ్వ
తిన్నానే కడుపునిండ!
ఎంత తియ్యగా ఉందో
అబ్బా! నే చెప్పలేనె!

రబ్బరు బంతులతో కడు
పుబ్బ నవ్వుపుట్టించా
డబ్బా! అది చూచి చూచి
అబ్బుర పడినారంతా!

ఆ మాదిరిగా వాడె
న్నో మాయలు చేశాడే!
చూచిన వారంత తమకు
తోచిన ధన మిచ్చారే!

మాయంతా వాడూదే
మాయ మురళిలో ఉందని
అన్నారే దోవలోన
నాన్నగారు నన్నుచూసి!

త్వరగా కొనవమ్మా! ఆ
మురళివంటి దొకటినాకు!
ఇల్లంతా ఇక మామిడి
పళ్ల మయము చేస్తానే!

రంగుల బొమ్మ

ప్లీడరుగారమ్మాయి 'లలిత' దగ్గరున్న బొమ్మ చాలా చక్కగా, అందంగా వుంది. ఆ బొమ్మను పంతులుగారమ్మాయి, విమల చూసి మురిసిపోయింది. ఇంత చక్కని బొమ్మ అస లెక్కడయినా వుంటుందా? బజారులో దొరుకుతుందా? దాని వెలేం ఎక్కువగా వుండదు! మహా వుంటే రెండు రూపాయ లుండొచ్చు. నాన్నకు రెండు రూపాయలేం ఒక లెక్కా! నాలుగో తేదీ చూడాలి నాన్న దగ్గర నోట్లు? ఎన్ని వుంటాయని. బోలెడన్ని నోట్లు! తను ఎప్పుడూ లెక్కపెట్టి చూడలేదు, నాన్నను అడగలేదు గానీ, కనీసం ఏ నలభై ఏభై నోట్లయినా వుంటాయి. అమ్మో నలభై, ఏభై నోట్లంటే, యేం సామాన్యమా! అబ్బో! ఇంటి నిండుకు బొమ్మలొచ్చునే! చక్కని బొమ్మలు! అందమయిన బొమ్మలు. ముచ్చటయిన ముద్దొచ్చే బొమ్మలు. రంగురంగుల గమ్మత్తయిన, మజా అయిన బొమ్మలు.

పోయిన యేడు ప్లీడరుగారింట్లో బొమ్మలకొలువుకు వెళ్లింది తను. ఆహా! అది భూలోక స్వర్గం. ఆ రోజు తనకు ఎప్పటికీ అక్కడే, ఆ బొమ్మల కొలువులో, తనూ ఒక బొమ్మయి వుండిపోవాలనిపించింది.

రాజేంద్ర

కాని అమ్మ ఈడ్చుకువచ్చేసింది. ఆ బొమ్మల కొలువు ఇప్పటికీ కళ్ళ ముందు కనిపిస్తూనే వుంది. ఇప్పుడు కొత్తగా లలిత ఎక్కడినుంచో, ఒక బొమ్మ తెప్పించుకొంది. లోకంలోని బొమ్మలన్నీ ఒక యెత్తూ, ఈ ఒక బొమ్మే ఒక యెత్తుగా వుంది. లలిత నాన్నను పిసినిగొట్టంటారే గానీ, ఆ అనేవాళ్ళే చెడ్డవారు. ఆయనకు పిల్లలంటే ఎంత అభిమానమని. లలితకేం కావలసినా, నిమషాలమీద తెచ్చియిస్తారు. తన్ను చూస్తేకూడా నవ్వుతూ మాట్లాడుతాడు.

"బాగా చదువుకో విమలా! నువ్వూ, మా లలితా యిద్దరూ చక్కా చదువుకొని గొప్పవాళ్లయి పోవాలి ఏం..." అంటా రాయన! ఎంత మంచివారాయన!

నాన్న ఎంతసేపయినా ఉట్టి మాటలే మాట్లాడుతాడు. ఎప్పుడూ ఒక మంచి బొమ్మ కొని యిచ్చింది లేదు. చెత్తచెత్త పాడుబొమ్మలన్నీ తెస్తాడు. 'వద్దో' అంటే వాటిని తెచ్చి పడేస్తాడు. ఈ సారి నాన్న లలితకున్న బొమ్మలాంటిది గాని తెచ్చియివ్వకపోతే నాన్న జుట్టు పీకి పారేయాలి. గడ్డం గీకి, పాడి చేయాలి. చంపేయాలి, అనుకొంటూ లలిత ఇంటినుంచి జోరుగా నడచి ఇల్లు చేరుకొంది-విమల.

అప్పుడే నాన్నగారు ఇంటికి వచ్చారు.

"నాన్నా నాన్నా! లలిత దగ్గర ఒక బొమ్మ వుంది నాన్నా! ఎంత బావుందని నాన్నా! నాకూ అలాంటి బొమ్మ కావాలి నాన్నా! నాన్నా అలాంటిబొమ్మ నాకూ ఒకటి కొనివ్వవూ?" అని విమల, ఆయన చేతులు పట్టుకొంది. "దానికేం. కొనుక్కుందాంలే విమలా. ఆ బొమ్మ ఎలాంటిదో చూపించు. తర్వాత చూద్దాం" అన్నారాయన.

"చూడాలా నాన్నా. అయితే వుండు. ఇప్పుడే తెస్తాను" అని పరుగు తీసింది.

"ఇప్పుడే తొందరేమిటి. తర్వాత వెడుదువులే" అని ఆయన అంటున్నా విమల వినిపించుకోలేదు

మరికొన్ని నిముషాల కాలంలో, లలిత, విమల, బొమ్మతో ఇంటికి వచ్చారు. విమల నాన్న, పంతులు గారు ఆ బొమ్మను చూశారు. మొదట ఆయన ఆ బొమ్మను, ఒక కళాభిమానిదృష్టితో చూసి 'చక్కనిబొమ్మ' అనుకొన్నాడు. తర్వాత డబ్బు దృష్టితో చూశారు. ఆలోచించి చూస్తే, దాని ఖరీదు ఎలా లేదన్నా ఏడెనిమిది రూపాయలయినా వుంటుందనిపించింది. అబ్బ! ఏడెనిమిది రూపాయలు! ఆ డబ్బు వుంటే ఎంత బియ్యం వస్తుంది? ఎన్ని రోజులకు, కూరగాయలు పాలు మజ్జిగ ఖర్చులకు వస్తుంది? ఎన్నిరోజులు, నశ్యానికి వస్తుంది? ఊహూ...ఇది తన శక్తికి మించిన ఖరీదయిన బొమ్మ! అయితే కుమార్తెను సంతృప్తిపరచడమెట్లా? విమల తను ఎంత చెప్పినా, బొమ్మ యివ్వనిది మాటలతో, ఇతర చిన్న చిన్న లంచాలతో, దారికి రాదని ఆయనకు తెలుసు. అయినా దానివెల తెలుసుకొని తర్వాత చూద్దామనుకొన్నారు.

"అమ్మా లలితా, దీని వెలెంతో తెలుసా?" అని అడిగారు పంతులు గారు.

"పదిరూపాయలని మా నాన్న చెప్పాడు మేష్టారూ" అంది లలిత. ఆ మాట వినేసరికి పంతులుగారు విస్మయపడలేదు గానీ, ఇక తను తపస్సు చేసినా, 'పదిరూపాయలు పెట్టి అలాంటి బొమ్మను విమలకు కొనిపెట్టలేనుగదా' అని విచారించారు. లలిత చేతిలోని ఆ బొమ్మను తన చేతికి తీసుకొని అటూ ఇటూ త్రిప్పిచూశారు. 'పదిరూపాయలే కావచ్చు దీనివెల' అనుకొన్నారు.

"సరే లేమ్మా. చూస్తాంలే. వెళ్ళి ఇద్దరూ భోజనం చేయండి" అని బొమ్మను లలిత కందిచ్చారు.

"వస్తా విమలా...రేపు తెల్లవారే వస్తాన్లే" అని లలిత వెళ్ళిపోయింది.

"నాన్నా తప్పకుండా కొనివ్వాలి" అంది విమల.

"అలాగే చూద్దాంలే" అన్నారాయన. అంతకన్న ఇక ఏమనగలరాయన?

కొన్ని రోజులు గడిచాయి. విమల రోజూ బొమ్మకోసం అడుగుతూనే వుంది. పంతులుగారు ఎప్పటికప్పుడు విమలకు సర్ది చెబుతూనే వున్నారు. ఇక యిలా మెత్తగా అడుగుతూవుంటే ఫలితం వుండదని, విమల ఇప్పుడు కొంత పట్టుదలగా, గట్టిగా అడుగసాగింది.

"ఏమయినా సరే నాన్నా. నాకు బొమ్మ కావాలి నాన్నా! నాన్నా బొమ్మ నాన్నా! బొమ్మా!"

ఇలా రోజూ, ఆయన ఇంట్లో వున్నప్పుడల్లా, అడుగుతూ ఏడువసాగింది విమల.

పంతులుగారి కేమి చెప్పడానికీ తోచకపోయింది. "తెస్తాను...రేపు తెస్తాను..." అనే పాతపాట ఇక, ఆమెకు తృప్తినివ్వదని తెలిపోయింది. మాటల్లో ఎంత కొత్తదనం చూపించినప్పటికి గూడా, విమల తన్ను నమ్మదు. అయితే ఇక ఎట్లా చేయడం. ఏదోవిధంగా అమ్మాయికి బొమ్మ తెచ్చిపెట్టక తప్పదు. ఇదివరకెన్నోమారులు ఇలా తెస్తాను తెస్తానని చెబుతూ, చివరికి చల్లని మాటలతో ఎలాగో మరిపింపజేసేవాడు. ఈసారిమటుకు విమల ఏవిధంగానూ ఆ 'బొమ్మ' విషయం మరచిపోయేలా లేదు.

"నాన్నా! నాకు రేపు పండుగ

★ రంగుల బొమ్మ ★

నాటికి బొమ్మ తెచ్చియివ్వాలి నాన్నా! లేకపోతే అన్నం తినను, స్నానం చెయ్యను, స్కూలుకు రాను...ఏమీ చెయ్యను...బొమ్మ నాన్నా! నాకు బొమ్మ...బొమ్మ నాన్నా! బొమ్మా!" అందొకరోజు విమల కుక్కి-ముంచుకుంటూనే కూర్చుని వున్న నాన్నతో.

పంతులుగారు ఐదు నిముషాలు ఆలోచించారు.

"ఏమమ్మా! బొమ్మ కమ్మా నీక్కావలసింది. సరే! ఎప్పుడు కావాలి...పండగనాటికేగా! సరే! తప్పకుండా తెచ్చియిస్తాను" అని మాట యిచ్చారు. ఈ మాట ఆ అమ్మాయి నమ్మి వెళ్ళిపోయింది.

ఆ రోజు నుంచీ పంతులుగారు కార్యక్రమం మొదలెట్టారు. బజారుకు వెళ్ళి, బొమ్మ తయారు చేయడానికి కావలసిన పరికరాలంతా తెచ్చుకొన్నారు. రోజూ రాత్రి తన గదిలో దీపం పెట్టించుకొని, ఒక చక్కని బొమ్మను తయారు చేయాలనే సంకల్పంతో, ఏదో చేస్తూ వుండిపోయారు. ఎంతో కష్టపడి చివరికా పండుగనాటికి ఒకబొమ్మను తయారుచేయగలిగారు. నిజానికదే మంత చక్కగా, ఆకర్షణీయంగా లేదనిపించింది. అయినా విమల దగ్గర ఇచ్చిచూద్దామనుకొన్నారు.

పండుగనాడు ఉదయం విమలను గదిలోకి పిలిచి -

"ఇదిగో. బొమ్మ తెచ్చాను చూడు. బాగుందా" అని అందిచ్చారు. ఏమి చెప్తుందోనని ఆత్రతతో విమల ముఖంలోకి చూశారు. విమల ముఖం వికసించింది.


"బలే బొమ్మ నాన్నా! రంగుల బొమ్మ! పెద్ద బొమ్మ! బలేబొమ్మ!" అంటూ బొమ్మతో తుళ్ళుతుంది పంతులుగారప్పుడు పొందిన ఆనందాన్ని వర్ణించలేము. కొలంబస్, ఇండియాను కనుగొన్నానని అనుకొన్నప్పుడు కూడా అంతటి ఆనందాన్ని పొందివుండడు.

విమల 'బొమ్మ'తో లలిత ఇంటికి వెళ్లింది. ఆ రంగు రంగుల, చిత్రమయిన పెద్ద బొమ్మను చూసేటప్పటికి, లలిత; పరుగున వచ్చి "ఆహా...ఏం బావుందీ బొమ్మ! ఎక్కడిది విమలా! బలే బావుందీ బొమ్మ! నేనూ మా నాన్నను తెమ్మనాలి" అంది. విమల సంతోషంతో పొంగిపోయింది. ఇంతలో అక్కడికి లలిత నాన్న ప్లీడరుగారు వచ్చారు. లలిత అన్నమాటల్ని విన్నారు.

"ఎక్కడ తెచ్చారమ్మా ఈ బొమ్మ! చాలా బాగుందే! ఇలాంటి బొమ్మలు మనవూళ్లో దొరకవే! డబ్బిస్తాను. మీ నాన్నగారినే ఒకటి తెప్పించమనాలి, ఏమమ్మా విమలా...తెప్పించమంటావూ?" అని విమల నడిగారాయన. అప్పుడే వెంటనే లోనికెళ్లి వచ్చారు.

"ఇదిగో...పదిహేను రూపాయలిస్తాను. ఆయనదగ్గరిచ్చి తెప్పించమనమ్మా! ఈ బొమ్మ అంతకు తక్కువ ఖరీదుకు రాదులే, అమ్మాయ్ లలితా నువ్వూ వెళ్లి. పంతులుగారి దగ్గర ఈ డబ్బు యిచ్చి చెప్పిరా! నేను చెప్పానని చెప్పు" అన్నారు ప్లీడరుగారు.

పండుగపూట స్నానమయినా చేయకుండా వచ్చేసిందే, పిలుచుకపోదామని. అప్పుడే అక్కడికొస్తున్న పంతులుగారు, ప్లీడరుగారిమాటలు విని విస్తుపోయి అక్కడే నిల్చుండి పోయారు! ★



8. ఇన్‌స్పెక్టరు జాకబ్‌కి నేరస్థుడెవరో ఎలా తెలిసింది?

ఇనస్పెక్టరు జాకబ్ ఇంట్లో ఫోన్ మోగింది. భార్య రేణు కాఫీ తెచ్చింది.

'మళ్ళీ ఎక్కడి నుంచండీ ఫోనూ?'అంది. జాకబ్ నిమిషంలో కాఫీ తాగి, 'బ్యాంకి మేనేజరు బాపనయ్య యింటినుంచి. ఏదో ప్రమాదంలో ఉన్నాట్ట. నిలుచున్నపాళాన్ని రమ్మని కబురూ. డ్రైవరు లేడు కాబోలు- సరే నేనే డ్రైవ్ చేసుకు వెడతా. నాకోసం ఎవరేనా వస్తే అరగంటలో వస్తానని చెప్పు.'

త్వరత్వరగా డ్రెస్ చేసుకుని జాకబ్ కారుషెడ్‌లోంచి 'ప్లిమత్ కారు' తీశాడు. బాపనయ్యగారిల్లు చేరుకున్నాడు.

బాపనయ్యగారిల్లు ఊరికి ఇంచుమించు చివరనున్న పెద్ద బంగాళా. బాపనయ్యగారి బంగళా మెయిన్ గేటు ముందురోడ్డు ఆ చివరనుంచి యీ చివరవరకు అప్పుడే కొత్తగా తారు వేస్తూండడం జాకబ్ లోపలికి వెడుతూ చూశాడు.

పెద్ద పెద్ద నరుగుడుచెట్లూ, చక్కటి పువ్వుల లతలూ సక్రమంగా పెరగకుండా అడ్డదిడ్డంగా అడవిలా ఉన్నా, యింటిచుట్టూ ఆ పచ్చని ప్రకృతి జాకబ్‌కు ఆనందాన్ని కలిగించింది.

నాలుగుసార్లు తలుపుగుద్ది తను ఫలానా అని చెబితేగాని బాపనయ్య తలుపు తియ్యలేదు. బాపనయ్య నిలువెల్లా ఒణుకుతున్నాడు. జాకబ్‌ను చూడగానే ఆయనకి ప్రాణం లేచివచ్చినట్లయింది...

గెక్కినట్లయింది.

'వెంటనే వచ్చారు, నన్ను బతికించారు. కూర్చోండి' జాకబ్

అవసరాల
రామకృష్ణరావు

లోపలికి రాగానే బాపనయ్య మళ్లీ లోపలతలుపు వేసేశాడు.

'ఏం జరిగిందీ? ఎందుకలా గాభరాపడుతున్నారూ?—ముందు యీ కిటికీ తలుపులు తెరవండి, ఉక్క చంపేస్తోంది' అన్నాడు జాకబ్.

'బాబ్బాబు, అవి మాత్రం తెరవకండి. మీకు పుణ్యముంటుంది'

'ఏం, నేనున్నాగా, మీకేం ఫరవాలేదు' అంటూ జాకబ్ బలవంతంగా అన్ని కిటికీ తలుపులూ తెరిచాడు. బాపనయ్య నెమ్మదిగా ప్రారంభించాడు.

'ఇవాళ ఆదివారం. బ్యాంకుకు శలవు, మీకు తెలుసుగా. సమయానికి మా ఆడవాళ్లుకూడా యింట్లో లేరు. దీపావళి కని వాళ్ల ఊరు వెళ్లారు. తీరిగ్గా ఉన్నాను కదా అని ఏవో బ్యాంకుకు సంబంధించిన ఫైల్సు తనిఖీ చేస్తున్నాను ఇంతలో మీ వెనక ఉండే కిటికీ. అందులోంచి వచ్చిందండీ రివ్వున తుపాకిగుండు. చూపువాసిలో తప్పిపోయింది. లేకపోతే యిప్పుడు మీతో యిలా...'

'అంటే మీ అభిప్రాయం? మిమ్మల్ని ఎవరయినా...'

'మొదట నేనూ కాదనుకున్నాను. ఇంతలో అటునుంచే మరొక గుండు నా చెవుపక్కనుంచి దూసుకుపోయింది. నాకేం పాలుపోలేదు. వెంటనే మీకు ఫోన్ చేశాను. సమయానికి మా గూర్ఖా కూడా లేడు. లిల్లీ కూడా లేదు'

'లిల్లీ ఎవరండీ?'

'మా యింట్లో కాపలా కాసే కుక్కండీ! నా భార్య తన కూడా తీసికెళ్లిపోయింది'

★ సమస్యాంతరంగం ★

'గూర్ఖా ఏమయ్యాడు?'

'మేటనికి వెడతానంటే నేనే పంపించాను. ఇంట్లో నేనూ మా సెక్రటరీ శేషావతారం ఉన్నామండి'

'అత నేడీ?'

'అతను మా దేశ్లనుంచి శాస్త్రయుపడి మూడొందల ఏభై కూడబెట్టి నిన్న నే 'హింద్' సైకిలు కొనుక్కున్నాడు. కొత్తది కొనుక్కున్నా డేమో సరిగ్గా ఉందో లేదో చూసుకువస్తానన్నాడు. పదినిమిషాలై వెళ్లేడు'

'ఎక్కడికి వెళ్లేడు? ఈ కాంపౌండ్ లో నేతొక్కుతుందామనా?'

'ఊలోపల ఏం తొక్కుతాడండీ, జాగా ఉన్నా అన్నీ ముళ్లూ! అలా పైకి వెళ్లొస్తానన్నాడు. ఈపాటికి వస్తూ ఉండలి. అదుగో మాటలోనే వచ్చాడు. నీకు నూరేళ్లు ఆయుష్షోయ్ శేషావతారం! చూశావా ఎంత దురంతం జరిగిందో?'

సైకిలుకు స్టాండు వేసి శేషావతారం లోపలికొచ్చాడు.

'ఏం జరిగింది సార్, వీరెవరు?

'వీరు - యినస్పెక్టర్ జాకబ్ గారు. నువ్వొ అలా వెళ్ళావో లేదో - ఎవరో రెండుసార్లు నన్ను పేల్చాలని చూశారు సుమా!'

శేషావతారం మొహంలో ఆత్రుత, భయం కనిపించాయి.

'అదేమిటండీ, యిలాంటిది ఎక్కడైనా ఉందా? దిక్కుమాలిన సైకిలు తణికీ--ఓగడియ ఉండయినా వెళ్లేను కాను-జాకబ్ గార్ని పిలిపించడం చాలా మంచిపని చేశారు. ఇలాంటి విషయాల్లో మీరు అశ్రద్ధ వహిస్తే లాభం లేదండీ ఇనస్పెక్టరుగారూ, వాడెవడో కనుక్కుని అంతు తేల్చాలి'

'తప్పకుండా వాడిఅంతు ఇప్పుడే మీ సమక్షంలోనే కనుక్కుంటాను. మీరు మీ సైకిలు బాగుందో లేదో అని అలా చాలా దూరం వెళ్లొచ్చారన్న మాట.'

'అవునండీ'

'మెయిన్ గేట్ లోనుంచేగా వెళ్లేరు! అలాగే కదూ వచ్చేరూ?'

'ఆఁ!'

'ఎప్పుడొచ్చేరు?'

'మీరు వచ్చిన పదినిముషాలకి'

జాకబ్ ఈ జవాబుకి ఎందుకో ఆశ్చర్యపోయాడు

'సరే ఏదీ మీ సైకిలు?'

ఇద్దరూ సైకిలుదగ్గిరకు వెళ్లేరు. జాకబు సైకిలుటైర్లు ఎందుకో చాలా శ్రద్ధగా చూశాడు. కొత్తగా ఉన్నాయి.

'ఏవీ మీ బూట్లు?'

బాపనయ్యకిదేం అర్థంకాలేదు. జాకబ్ శేషావతారం కొత్త బూట్లకేసి తదేక దృష్టితో చూశాడు.

'ఏవీ మీ చేతులు?'

శేషావతారం అయోమయంగా చేతులు ముందుకు జాపాడు. జాకబ్ సంకెళ్ళు తగిలించాడు.

'ఇదేమిటీ?' అన్నాడు శేషావతారం ఆశ్చర్యంగా.

'బాపనయ్యగార్ని పేల్చడానికి ప్రయత్నించిన మీ సాహసానికి మా కానుక' అన్నాడు జాకబ్ నవ్వుతూ.

తరువాత శేషావతారం తన నేరం ఒప్పుకొని మేనేజర్ పేరున ఫోర్జరీ సంతకాలుచేసి తను కొన్ని విలువైన పత్రాలు మార్చినట్టూ, ఆ సంగతి బాపనయ్యకి తెలిస్తే తనకి అరెస్టు తప్పదనీ అనుకొని యీ విధంగా చేయడానికి సాహసించానని అంగీకరించాడు.

'నా ప్రాణం కాపాడిన మీ రుణం తీర్చుకోలేను. శేషావతారం గురించి నే నసలు అనుమానించనే లేదూ! మీ రెలా కనుక్కున్నారు?' అన్నాడు బాపనయ్య జాకబ్ తో.

'దానికి మూడు కారణాలున్నాయి' అన్నాడు జాకబ్.

ఏమిటా కారణాలు? మీరు దీన్ని మరోమారు జాగ్రత్తగా చదివి జాకబ్ ఆ సంగతి ఎలా కనుక్కున్నాడో చెప్పగలరూ?

[పైవారం సంచికలో జవాబు]

★

కనకమ్మతో కాపురం

పేరిశాస్త్రి బ్రాహ్మణార్థాలు చేసుకు బ్రతికే ఒక వైదిక యువకుడు. అతను నివసించే గ్రామంలోనే కాక ఆ పరిసర గ్రామాల్లో కూడా అతనంటే మంచి గౌరవభావం ఉండటంవల్ల అతని కేలోటూ లేకుండా జరిగిపోతోంది. గోదాన, భూదానాల్లాటివి సంపాదించటంచేత పాడి, పంటలు కూడా సమృద్ధిగా వున్నాయతనికి.

కొద్దికాలం క్రితమే తల్లి, దండ్రులు గతించినమూలంగా స్వతంత్రంగా జీవిస్తున్నాడతను. అతని స్థితి బాగా వుండటంవల్ల ఒక బ్రాహ్మణుడతనికి, తన గారాల కూతురు "కనకమ్మ" నిచ్చి పెళ్ళి చేశాడు. కనకమ్మ కాపురానికి రాగానే, అప్పటివరకు వండి పెడుతున్న అప్పగారిని సారె చీరెల్తో పంపేశాడు, ఆమె కాపురానికి.

కనకమ్మ నిజంగా కనకదుర్గాదేవిలా బంగారు విగ్రహంలా వుంటుంది. కొంతకాలం వాళ్లు చిలకాగోరింకల్లా కాపురంచేశారు. అప్పటికి కనకమ్మకు వెర్రిబాగులతనం, మంకుతనం పెట్టని ఆభరణాలని గుర్తించాడు, శాస్త్రి.

ఒకనాడు భోజనమయ్యాక శాస్త్రికి తమలపాకులు చిలకలుగా చుట్టి అందిస్తూ అంది కనకమ్మ-

"మీరు పెనకేసిన సొమ్ము దాదాపు నాలుగువేలదాకా వుంటుంది కదా! నే నెప్పుడు గర్భిణిని కదా! మనకి ఒక ఆడపిల్ల పుడుతుందే అనుకోండి. అది పెళ్లీడు కొస్తే, దానికి నగలుండొద్దూ? అందుకని ఆ డబ్బుతో ఒడ్డాణం, వంకీగాజులు, దండకడియం, కాసులపేరు, రవ్వల నెక్లేసు, కెంపుల దుద్దులు, వజ్రపుటుంగరం, ముక్కుపుడకా—ఒకటేమిటి అన్నీ

పరస్యం

చేయించేసెయ్యండి. తర్వాత అవి నాద్వారా నా పిల్లకి సంక్రమిస్తాయి! ఏమంటారు?"

పేరిశాస్త్రికి ఒక తుపాను వీచి ఆగినట్లనిపించింది. "ఏమిటే? నీ సొద...ఇంకా ఏమీ లేందే పెళ్లీడు పిల్లంటావ్. అసలు మొగో, ఆడో కలగన్నావా?" అన్నాడు విసుగ్గా.

"మొగా లేదు, మొద్దలూ లేదు ఆడపిల్ల పుట్టి తీరాల్సిందే, మీ రాసొమ్ముతో నగలూ చేయించాల్సిందే!" అంది బుంగమూతి పెట్టి.

చూద్దాంలే పడుకో, నాకు నిద్ర రొస్తోంది" అన్నాడు తప్పించుకోవడానికి. అబ్బే, అలా వదుల్తుందీ ఆ పెంకిఘటం! పడుకున్నవాణ్ణి చెవి మెలిపెట్టి లేపింది. ఆ రాత్రి 12 గంటలదాకా విసిగించి "అలాగే" అనిపించిందతనిచేత.

అది మొదలు అతన్నామె వారంరోజులు విసిగించింది, ఆగోడవతో. అప్పటికే కించిత్తు పిచ్చికూడా ఉందని నిర్ధారణ చేసుకున్నాడతను, ఆమెకి.

ఒకరోజున తెల్లవారకుండానే లేపి మొదలెట్టింది సొద, భర్తతో. ఆవేళ మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఆ గోడవే. అప్పుడతనికి కాసిని మెతుకులు పెట్టి, "నగలు చేయిస్తేనేగాని, తానిక అన్నం ముట్టనని" శపథంచేసి, బైటికి వెళ్ళి కంసాలిని వెంటబెట్టుకొచ్చింది.

ఇక లాభం లేదనుకున్నాడతను. "పోనిలే, చేయిస్తే అవి ఆమెవద్దే ఉంటాయికదా" అనుకుని ఆవేళ బంగారం తెప్పించి "నగలు తొందరగా చేసి యివ్వమని," కంసాలిని పంపేశాడు. అప్పటికే సాయంత్రం 3 గంటలైంది. కనకమ్మ తృప్తిగా భోంచేసిందప్పుడు.

కొన్నాళ్ళకి నగలు తయారై వచ్చాయి. వాటిని వంటినిండా

కనకమ్మతో కాపురం

పేరిశాస్త్రి బ్రాహ్మణార్థాలు చేసుకు బ్రతికే ఒక వైదిక యువకుడు. అతను నివసించే గ్రామంలోనే కాక ఆ పరిసర గ్రామాల్లోకూడా అతనంటే మంచి గౌరవభావం ఉండటంవల్ల అతని కేలోటూ లేకుండా జరిగిపోతోంది. గోదాన, భూదానాల్లాటివి సంపాదించటంచేత పాడీ, పంటలు కూడా సమృద్ధిగా వున్నా యతనికి.

కొద్దికాలంక్రితమే తల్లి, దండ్రులు గతించినమూలంగా స్వతంత్రంగా జీవిస్తున్నా డతను. అతని స్థితి బాగా వుండటంవల్ల ఒక బ్రాహ్మణు డతనికి, తన గారాల కూతురు "కనకమ్మ" నిచ్చి పెళ్ళిచేశాడు. కనకమ్మ కాపురానికి రాగానే, అప్పటివరకు వండి పెడుతున్న అప్పగారిని సారె చీరెల్తో పంపేశాడు, ఆమె కాపురానికి.

కనకమ్మ నిజంగా కనకదుర్గా దేవిలా బంగారు విగ్రహంలా వుంటుంది. కొంతకాలం వాళ్లు చిలకాగోరింకల్లా కాపురంచేశారు. అప్పటికి కనకమ్మకు పెరిబాగుల తనం, మంకుతనం పెట్టని ఆభరణాలని గుర్తించాడు, శాస్త్రి.

ఒకనాడు భోజనమయ్యాక శాస్త్రికి తమలపాకులు చిలకలుగా చుట్టి అందిస్తూ అంది కనకమ్మ-

"మీరు పెనకేసిన సొమ్ము దాదాపు నాలుగువేలదాకా వుంటుంది కదా! నే నెప్పుడు గర్భిణిని కదా! మనకి ఒక ఆడపిల్ల పుడుతుందే అనుకోండి. అది పెళ్లీడు కొస్తే, దానికి నగలుండొద్దూ? అందుకని ఆ డబ్బుతో ఒడ్డాణం, వంకీగాజులు, దండకడియం, కాసుల పేరు, రవ్వల నెక్లేసు, కెంపుల దుద్దులు, వజ్రపుటుంగరం, ముక్కుపుడకా— ఒకటేమిటి అన్నీ

పరస్పరం

చేయించేసెయ్యండి. తర్వాత అవి నా ద్వారా నా పిల్లకి సంక్రమిస్తాయి! ఏమంటారు?"

పేరిశాస్త్రికి ఒక తుఫాను వీచి ఆగినట్లనిపించింది. "ఏమిటే? నీ సొద...ఇంకా ఏమీ లేందే పెళ్లీడు పిల్లంటావ్. అసలు మొగో, ఆడో కలగన్నావా?" అన్నాడు విసుగ్గా.

"మొగా లేదు, మొద్దలూ లేదు ఆడపిల్ల పుట్టి తీరాల్సిందే, మీ రాసొమ్ముతో నగలూ చేయించాల్సిందే!" అంది బుంగమూతి పెట్టి.

చూద్దాంలే పడుకో, నాకు నిద్ర రొస్తోంది" అన్నాడు తప్పించుకోవడానికి. అబ్బే, అలా వదుల్తుందీ ఆ పెంకిఘటం! పడుకున్న వాణ్ణి చెవి మెలిపెట్టి లేపింది. ఆ రాత్రి 12 గంటలదాకా విసిగించి "అలాగే" అనిపించిం దతని చేత.

అది మొదలు అతన్నామె వారంరోజులు విసిగించింది, ఆగోడతో. అప్పటికి కించిత్తు పిచ్చికూడా ఉందని నిర్ధారణ చేసుకున్నా డతను, ఆమెకి.

ఒకరోజున తెల్లవారకుండానే లేపి మొదలెట్టింది సొద, భర్తతో. ఆవేళ మధ్యాహ్నం ఒంటి గంటదాకా ఆ గోడవే. అప్పు డతనికి కాసిని మెతుకులు పెట్టి, "నగలు చేయిస్తేనేగాని, తానిక అన్నం ముట్టనని" శపథంచేసి, బైటికి వెళ్ళి కంసాలిని వెంటబెట్టుకొచ్చింది.

ఇక లాభం లేదనుకున్నా డతను. "పోనిలే, చేయిస్తే అవి ఆమెవద్దే ఉంటాయికదా" అనుకుని ఆవేళ బంగారం తెప్పించి "నగలు తొందరగా చేసి యివ్వమని," కంసాలిని పంపేశాడు. అప్పటికి సాయంత్రం 3 గంటలైంది. కనకమ్మ తృప్తిగా భోంచేసిం దప్పుడు.

కొన్నాళ్ళకి నగలు తయారై వచ్చాయి. వాటిని వంటినిండా

ఆమె నగలమీద వుంది, అతని దృష్టి. అవి ఎలా కాజెయ్యటమా అని అతని ధ్యాస.

"మా అమ్మాయి పుట్టమ్మ కులాసాగావుందా?" అడిగిందామె.

"ఆఁ, కులాసాగానే వుంది. మొన్ననే ప్రసవించింది, ఆడపిల్ల" అన్నాడు ప్రయత్నంగా. అదే అతని ధ్యాసకి నాంది అయింది.

"పన్నెండోరోజుని బారసాల. మీ పేరే పెట్టాలని నా కోర్కె. మిమ్మల్ని పిలవటానికొచ్చాను. పెళ్ళయినతర్వాత నేను రావటం ఇదే మొదటిసారి. మీ యిల్లు మరిచిపోయి వెదుకుతుంటే పొద్దెక్కింది; బ్రాహ్మలయిల్లేకదా, శాస్త్రి అడిగి భోంచేసి వెడదామనివచ్చాను" అన్నాడు.

"ఐతే ఏంలే నాయనా, తప్పేలేదు. మీ మామగారు పక్కవూరికి బారసాల కెళ్లారు. ఆయన ఈపాటికి వస్తూనే వుంటారులే. ఈ సంగతి విని పొంగిపోతారు" అంది.

"అలాగా?" అంటూ కంగారుగా భోజనం పూర్తిచేసి, చెయ్యి కడుక్కుని లేచి అన్నాడు.

"మీ మనవరాలికి మీ పేరే పెడుతున్నాను."

"అంతకన్నానా నాయనా. నా చిట్టి కనకమ్మ..." అని మురిసిపోతోందావిడ.

"మంచి పేరే పెడతానత్తా" అన్నాడు.

"అయ్యో! మామగారొచ్చేదాకా ఉండవూ?" అంది.

"అబ్బే, నాకు తొందరపనులున్నాయమ్మా" అన్నాడు.

"సరేలే నాయనా, ఇదిగో ఈ నెక్లేసు నా మనవరాలికి ఆనాడు చెయ్యించేం, మేం రావటం కొంచెం ముందూ, వెనకా అవొచ్చు" అని దాన్ని తీసి యిచ్చింది.

అదే సమయమనుకుని, దాన్ని పుచ్చుకుని, "అసలు ఎందరో వస్తారు, మీ అమ్మాయికి ఏం నగల్లేవు; పదిమందిలో ఎలా తిరుగుతుందో ఏమో" అన్నాడు గోళ్లు గిల్లుకుంటూ.

"నా పుట్టమ్మకి నగ లేకపోవటం ఏం ఖర్మం. నావన్నీ దానికి ఉండాల్సినవే; ఇస్తాను పట్టుకెళ్ళు. ఎప్పుడైనా కావలిస్తే నేనే ఒకసారి అడిగి తీసుకుంటాలే" అంటూ ఆ వెఱ్రి కనకమ్మ నగలన్నీ ఒలిచి యిచ్చింది. అన్నీ మూట కట్టుకుని త్వరితంగా వెళ్ళిపోయాడతను.

కాసేపటికి పేరిశాస్త్రి వచ్చాడు. జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పి "బారసాలకి వెళ్లాలి త్వరగా భోం చెయ్యండి" అంది.

"ఏ బారసాల తల్లాయమాగానూ, కొంప తీశావు, ఆ దొంగవెధవ ఎలా వెళ్లాడే?" అడిగాడు శాస్త్రి, ఆత్రంగా.

"ఆఁ, వాడు దొంగా! అలా ఈ త్వరంగా వెళ్లాడు, చప్పున వెళ్ళి పట్టుకోండి" అని తొందరపెట్టింది.

శాస్త్రి కంగారుగా సైకిలుమీద వెళ్ళాడు. కొంతదూరంలో, ఒక చెరువుతోట ప్రక్కగా రోడ్డుమీద వెళ్తూ దొంగ కనిపించాడు. "ఆగరా దొంగవెధవా, నీ తోక్క తీస్తా" అంటూ వేగంగా సైకిలు తొక్కసాగాడు శాస్త్రి. అది విని, దొంగ తోటలో దాక్కున్నాడు. తీరం వెళ్ళి తోట ప్రక్కని రోడ్డుమీద దిగి, సైకిలు స్టాండు వేసి దొంగని పట్టుకోవాలని తోటలో దూరాడు శాస్త్రి.

దొంగ ఇంకో వైపునుంచి వెళ్లిగా రోడ్డుమీదకి వచ్చి సైకిలెక్కి వేగంగా తొక్కుకుంటూ వెళ్లిపోయాడు. శాస్త్రి పల్లె గిరుకు పోయేం చెరువు అవతల్ని తప్పించుకుంటూ బైటికి వచ్చి చూసేసరికి, రోడ్డు మలుపు తిరిగి కనిపించకుండా పోయాడు దొంగ.

శాస్త్రి దుఃఖంతో ఇంటికి చేరాడు. శాస్త్రి ఇంత జరిగినా కనకమ్మ ఇంట్లో కూర్చుని తాపీగా భోంచేస్తోంది. శాస్త్రి లోపలికి వచ్చి "తాపీగా భోంచేస్తున్నావుగాని, పదపోదాం" అన్నాడు.

"ఎక్కడికండీ?" అంది కనకమ్మ నాగదీసుకుంటూ.

"ఏం, బారసాల కనుకున్నావా!... కాదులే, పిచ్చాసుపత్రి విశాఖపట్నం!" అన్నాడు తీవ్రంగా.

"ఇంత ఆలస్యంగా వచ్చారేం! అక్కడేమయిందేమా?" అందావిడ.

"నువ్వు కూతురికి నగలిస్తే, నీ అల్లుడికి సైకిలు బహుమతి ఇచ్చాను, చెప్పు ఇలా తాగాలా?" అంటూ దిగాలుగా తీసిన పక్కమీద జారబడ్డాడు గోడకి, కనకమ్మతో కాపురం వెలిగిస్తున్న పేరిశాస్త్రి.

★



విశ్వశాంతికి కృషిచేసిన జేన్ ఏడమ్స్

"మానవహృదయాలలో దాగిఉన్న అణ్వస్త్రాలు అతి ప్రమాదకరమైనవి. ఆటంబాంబులు హైడ్రోజను బాంబులు ప్రపంచోపద్రవకారకాలే అయినా హృదయాంతరాళాలలో ఉండే ఆటంబాంబులు, హైడ్రోజనుబాంబులు అతి దుర్మార్గమైనవి" అని ఒకసారి పండిత నెహ్రూ అన్నారు కీర్తిశేషురాలయిన జేన్ ఏడమ్సు "యుద్ధములో మారణహోమానికి కారకమైన వాటికంటె మానవ హృదయాలలో ప్రజ్వలించే విషబీజాలు దారుణమైనవి" అని 1935 లో జరిగిన అంతర్జాతీయ మహిళాశాంతి స్వాతంత్ర్య సాధనా సంఘముయొక్క 15 వ వార్షికోత్సవములో ప్రసంగిస్తూ అన్నది.

మానవులలో పరస్పర సుహృద్భావాన్ని పెంపొందచేయటానికీ, విశ్వశాంతిని చేకూర్చటానికీ జేన్ ఏడమ్సు (Jane Addams) తన జీవితమంతా ధారపోసింది. అమెరికా దేశచరిత్రలో ఆమె ప్రధానవ్యక్తి. ఆదేశ చరిత్రలోనే కాక ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విదుషీమణి. ఆమె జ్ఞానుల్లోజ్ఞాని-రాజకీయవేత్తలలో ప్రముఖురాలు. పావిత్ర్యములో అస్సిసిఫ్రాన్సిస్ (St Francis of Assissi) తోను, ప్రజా ప్రభుత్వ వాదిగా అబ్రహాం లింకన్‌తోను ఆమె పోల్చబడినది. ఆమె గొప్ప ప్రజాసేవిక. నిమ్న తరగతుల వారి కష్టాలను నివారించటానికి కృషి చేసి, వారి నుద్ధరించుటలో ఆమె క్రొత్త పద్ధతులను అవలంబించి కృతకృత్యురాలయినది.

ఇల్లిందల సరస్వతీదేవి

స్త్రీలలో యుద్ధప్రతికూల ప్రచారమును ప్రబోధించినది. నిమ్న తరగతుల అభ్యుదయానికి కృషిచేయటము, యుద్ధము కూడదని ప్రచారము చేయటము ఒకే లక్ష్యసిద్ధి కొరకని ఆమె భావించింది. ప్రపంచ శాంతికొరకు ఈమెచేసిన కృషికి నోబెల్ బహుమానము లభించింది. శాంతికొరకు ఆ బహుమానము నందుకొన్నవారిలో ఆమె యావత్ప్రపంచములో ఏకైక మహిళా రత్నము.

జేన్ ఏడమ్సు అమెరికా దేశములో 19 వ శతాబ్దపు రెండవభాగములో జన్మించింది. ఈమెతండ్రి జాన్ ఏడమ్సు. ఈమె రెండవయేటనే మాతృవిహీనకాగా తండ్రియే బుద్ధులూ-సుద్దులూ చెప్పవలసి వచ్చింది. వెన్నెముక వంగిపోవటముచేత ఆమె నలుగురిలోనికి పోవటానికి బాల్యములో సిగ్గుపడేది. ఈ కారణముచేత తోడి బాలబాలికలతో కలిసిమెలసి ఆడుకోవటానికి ఆమెకు ఎక్కువగా అవకాశము లేకపోయినది. దైహికమయిన ఈలోపము ఆమెలో విడియము ఎక్కువచేసింది; నిరంతరమూ ఒంటరిగా కూర్చుని ఆలోచనా సముద్రములో మునిగిపోయేటట్లు చేసింది! నిరాడంబర జీవితానికి ఆమె వశురాలయేటట్లు చేసింది.

జేన్ ఏడమ్సు తండ్రీ, అబ్రహాములింకనూ మిత్రులు. ఇల్లినాయ్ రాష్ట్రములోని శాసనసభలో వీరిద్దరూ సభ్యులుగా ఉండేవారు. నీగ్రో బానిసల స్వాతంత్ర్య పోరాటములో ఆయన ఉత్సాహముతో పాల్గొన్నాడు. వారికి స్వాతంత్ర్యము సిద్ధించుటతో ఆయనకు సంతృప్తి కలుగలేదు. తన దేశములోగాని యూరపులోగాని స్వాతంత్ర్య పోరాటము పేరు చెవికి సోకగానే అతడి ఉత్సాహము పొంగులు వారేది. ఒకనాడు జోసెఫ్ మెజ్జిని మరణించినట్లు పత్రికలు ప్రకటించాయి జోసెఫ్ మెజ్జిని ఇటలీలో స్వాతంత్ర్య పోరాటము సాగించిన యోధుడు. ఆ ప్రకటన చూడగానే జేన్ తండ్రి కన్నీరు

కార్చారు. తండ్రి దుఃఖము జేన్‌కు అమితాశ్చర్యాన్ని గొలిపింది. "ఆ చనిపోయిన వ్యక్తికీ తన తండ్రికీ ఏమి సంబంధము? ఎదుటి వారి కష్టాలను చూసి సహించ లేక పోవటానికి జాతి గాని, దేశము గాని, మతము గాని ఒకటిగా నుండవలసిన అవసరము లేదా?" ఈ ఆలోచనలలో ఆమె గొప్ప సత్యాన్ని తెలిసికొనగలిగింది—"జాతి మత భేదములెంత ఉన్నా ఆదర్శము, ఆశయము ఒకటే అయినట్లయితే మానవులు పరస్పరమూ సుహృద్భావాన్ని పెంపొందించు కొన గలరు" అని.

ఆమెకు ఆరు సంవత్సరాల వయసున, దుర్భర దారిద్ర్యముతో నికృష్ట జీవితాలను గడిపే పొరుగు వారిని చూడటము తటస్థించింది. 'ఈ ప్రజల పరిస్థితులు సంస్కరింప బడ కలిగినవేనా? అపని సాధ్యమేనా?' ఈ ప్రశ్న పరంపరకు సమాధానాలను ఆమె తండ్రివద్దనే బడసినది. ఆ చిన్న వయసులో ఆమె కృతనిశ్చయురాలయినది. "పెద్దదయిన తరువాత తాను నిర్మించుకొనబోయే భవనము ఎంత పెద్దదయినా అది పెద్ద పెద్ద మేడల మధ్య ఉండకూడదు. తన యిల్లు ఆర్తుల యిండ్లమధ్య ఉండాలి" అని అప్పటి నుండీ మానవుల పరిస్థితులలో ఉన్న అసమానతను రూపుమాపటానికి ఏదైనా మార్గము ఉన్నదా అని ఆమెకు యోచన మీద యోచన కలుగ నారంభించింది.

పేదవారి మధ్య నివసించవలెనని ఆమె తలంపు కనుక దాని కనుగుణమైనది వైద్యవృత్తి అని భావించి, ఫిలడెల్ఫియా వైద్య కళాశాలలో ఆమె ప్రవేశించింది. కాని ఆరోగ్యపరిస్థితి అనుకూలించనందున ఆమె తిరిగి ఇంటికి రావలసి వచ్చింది. ఆరు నెలల కాలము ఆమె మంచములోనే ఉండవలసిన అవసరము ఏర్పడ్డది. దాని తరువాతనే బలహీనముగా ఉన్న నరాలను ఉత్తేజపరచటానికి ఆమె విదేశాలకు పంపబడ్డది. ఎనిమిది సంవత్సరాల పాటు ఆమె విదేశాలలోనే ఉండిపోయింది. ఆ కాలములో ఆమె అనేక గ్రంథాలను చదివింది. అపారమైన విజ్ఞానాన్ని ఆర్జించింది. కాని గ్రంథాలలోని సిద్ధాంతాలు, ఆదర్శాలు ఆమెకు సంతృప్తి నివ్వలేక పోయినవి. వాటిలో క్రియాత్మకమైన ప్రణాళిక ఆమెకు లభించ లేదు. ఎన్ని ప్రదేశాలు తిరిగినా సర్వ మానవ సమానత్వమూ, సర్వమానవ సౌభ్రాతృత్వమూ, సర్వ మానవాభ్యుదయమునూ కోరే సంస్థ ఆమెకు కనబడలేదు. 'మానవులలో ప్రస్ఫుటముగా ఉన్న భేదాలను విడదీసి, ఐక్యభావముతో ఉన్నతాదర్శాలతో మానవజాతి కంతకూ ఉపయోగ కరమైన సేవాలయాన్ని నిర్మించటము అసాధ్యమా? సాధ్యమేనని తండ్రి ధైర్యము చెప్పినాడు కదా! ఆ కార్యాలను సాధించటానికి తరుణము ఎప్పుడు వస్తుంది?' అని ఆమె తపించిపోయేది. భావనా ప్రపంచాన్ని వీడి, వాస్తవిక ప్రపంచములో విహరించ దలచింది. తన ఊహా ప్రణాళికను అమలుపరచాలని ఆమె హృదయము ఉరకలు వేయసాగింది.

జేన్ ఏడమ్సు, ప్రాథమికావసరాలు కూడా తీర్చుకొనలేని ప్రజానీకము నివసించే వాడలో ఒక యింటిని అద్దెకు తీసుకొని, వారి అభ్యుదయానికై కృషి చేయ సంకల్పించింది. తన ఆశయాలతో ఏకీభవించినవారెవరయినా తనకు తోడుగా ఉండి సహకరించినట్లయితే, తలపెట్టిన కార్యము సాధించ కలుగుతా ననుకొన్నది. కాని అత్యంత సన్నిహితు లనుకొన్న మిత్రులకు కూడా తన ప్రణాళికను ఆమె వ్యక్తపరచ లేకపోయింది. దానికి కారణము ఆమెకు గల సంశయమే. 'ప్రణాళిక ఎంతవరకూ సాగుతుందో ఎంత నిలచిపోతుందో' నన్న జంకు ఆమె హృదయములో స్థావర మేర్పరచుకొన్నది. సరిగా ఈ కాలములోనే స్పెయిన్‌లో ఎడ్లపందెము (Bull fight) జరుగుతుండగా ఆమె చూడటము తటస్థించింది. రక్తపాతముతో కూడిన ఆ దృశ్యము కంటబడగానే ఆమె మనసు వికలమయినది. 'నాగరికత అంటే ఇదేనా?' అని సందేహము కలిగింది. తాను చేయదలచుకొన్న సంఘసేవలో 'ఈ అంశాలుకూడా చేర్చ తగినవేనా?' అని ప్రశ్నించుకొన్నది. దీని తరువాత ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది. తన కర్తవ్యమేదో నిర్ణయించుకొన్నది. కళాశాలలో సహపాఠిని అయిన ఎలెన్ స్టారుకు తన కార్యక్రమాన్ని తెలిపి, తనతో కూడా పని చేయటానికి ఆమె అంగీకరించినట్లయితే తనకు అభ్యంతరం లేదని జాబు వ్రాసింది. జేన్ ఏడమ్సు పవిత్రాదర్శాలను ఎలెన్ స్టారు ప్రశంసించి, ఆమెకు సహకరించే భాగ్యము తన పుణ్యముకొద్దీ లభించినదని సమాధానము వ్రాసింది.

1889 షికాగో రాష్ట్రములోని ఒక జిల్లాలో జేన్ ఏడమ్సు తన సంఘ సేవా కార్యక్రమాలకొరకు ఒక ఇంటిని బాడుగకు తీసుకొన్నది. ఆ యింటిలో అంతకు పూర్వము కొందరు సంఘ సేవికలు (Little sisters of the poor) ఉండేవారట. వారు వెళ్ళిపోయిన తరువాత కొన్నిదుకాణాలు చిన్న చిన్న కాపురాలు ఉండేవట. జేన్ బాడుగకు తీసుకొన్న కాలమునాటికి ఆయిల్లు దయ్యములకు నివాసయోగ్యముగా ఉండెనని ప్రవాదము. జేన్‌కుగాని ఆమె మిత్రులకుగాని దయ్యాల భయము లేదు. ఆ విధమైన నమ్మకాలు వారిద్దరికీ లేవు. ఆ యింటిలో వారినిద్దరినీ భయపెట్టినవి దయ్యాలు కావు-ఆ యింటి పరిసరాలే. ఆ ప్రాంతములో బాటలు సరిగాలేవు. ఆ మురికి వీధులలో మినుకుమినుకుమనే దీపాల వెలుగులో వారిద్దరూ నడువవలసి వచ్చేది. ఇళ్ళలోని చెత్త చెదారము, దుర్వాసన కొట్టే మురిగిపోయిన ఆహారపదార్థాలు అక్కడి కాపురస్థులందరు వీధిలో పారవేసేవారు. గుర్రాలశాలలు పడిపోతున్న ఇళ్లు ఒకదానికొకటి ఆనుకొని ఉండేవి. ఆవీధి భరింపరాని దుర్గంధముతో మురిగిపోతూ ఉండేది. మానవుడి నైతికపతనము, బాధ, దైన్యము వాటి పరిణామము ఆ వీధులలో ప్రదర్శింపబడుతూ ఉండేది. ఆ వాడలో బిడ్డల పరిస్థితి ఎంత నేత్ర పీడాకరమో, వారినందరినీ ఒకచోట సమావేశపరచి ఒక పావు గంటసేపు వారి మధ్యగడపటముగా కూడా అంత భరింపరానిదిగా-కష్టతరముగ ఉండేది. ఈ పరిస్థితులు ఇలా ఉండగా-షికాగో రాష్ట్ర ప్రజల మనోగతాలు కడు విచిత్రముగా వెల్లడి కాసాగినవి. 'సాంఘికముగా ఆర్థికముగా మానవుడి జీవితములో మార్పు కావాలి' అని అన్న వారిని అనుమానించేవారు. జేన్ సంఘసేవ చేస్తాననటములో ఏదో అంతరార్థము ఇమిడి ఉన్నదని వారిలో వారు ప్రశ్నించుకొని మథనపడ్డారు.

కాని-జేన్ లోకుల సంశయాలతో తన కార్యక్రమాన్ని కుంటుపడనీయలేదు. తాను సంస్కరించదలచిన పరిసరాలలో ప్రజలకు మంచి సభ్యత, సాంఘిక మర్యాదలు అలవడజేయ సంకల్పించింది. వారిలో మానవత్వము నెలకొల్పటానికి దీక్షపూనింది. ఈ కార్యక్రమాలకు కేంద్రమయిన తన యింటికి హాల్ భవనము (Hull House) అని పేరు పెట్టింది.

హాల్ భవనాన్ని స్థాపించి నిర్వహించిన జేన్ ఏడమ్సు ఒకరిద్దరు వ్యక్తులనే కాదు. సంఘముయొక్క దృక్పథాన్నే మార్చివేసింది. ఆ కాలములో ఆ ప్రాంతములో వివిధవర్గాలవారు వివిధజాతులవారు నివసించేవారు. వారిలో వారికి సరిపడేది కాదు. ఒకరి ఆచారాలను మరొకరు ఈసడించేవారు. వర్గాలు వేరు-అందులో కుటుంబాలు వేరు. వాటిలో వ్యక్తులు వేరు. ఈ విధముగా ప్రతివారు ప్రత్యేకాభిప్రాయాలతో - ప్రత్యేక సమస్యలతో బాధపడే వారు. ఇటువంటివారినందరినీ సంఘీభావముతో దగ్గరకు చేర్చవలెనని జేన్ ప్రయత్నించింది. సామాన్యులకు, మధ్యతరగతి వారికీ, పై తరగతివారికీ ఏ తరగతికి తగినట్లు ఆ తరగతిలోని వ్యక్తులకు కలసిమెలసి నడచుకొనే అవకాశాలను కల్పించింది.

విశ్వశాంతికి కృషిచేసిన జేన్ ఏడమ్స్

వ్యాపారస్థులను, సంఘసేవకులను, కళాకారులను ఒక లక్ష్యానికై కృషిచేసే కార్యకర్తలుగా సిద్ధముచేసినది.

జేన్ ఏడమ్స్ చేస్తున్నకృషిని అభినందించి అక్కడి పెద్దలు ఆమెకు తగుసహాయముచేస్తూ ఉండేవారు. పత్రికలు కూడా ఆమె కృషిని ప్రశంసిస్తూ ఉండేవి. హాల్ భవనములోని కార్యకర్తలు కార్మికులు తమ కష్టాలను వ్యక్తపరచగానే వారి అభ్యుదయ దృష్ట్యా ఒక చట్టము చేయబడ్డది. కాని ప్రజలు దానిని అనుసరించే స్థితిలో లేరు. కాగా హాల్ భవనకార్యకర్తలను దూషించటానికి పూనుకొన్నారు. హాల్ భవనము విప్లవకారుల సంఘమనీ, జేన్ ఏడమ్సును ఉరితీయవలెననీ కొందరు తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతూ వచ్చారు.

జేన్ ఏడమ్స్ వాటిని లక్ష్యపెట్టలేదు. తలవంచుకుని తన పనియందే నిమగ్నురాలై ఉండేది. నిమ్న తరగతివారిని ఉద్ధరించడమే తన కర్తవ్య మనుకొన్నది. దానికై పాటుపడేది. సంస్కరణలకై తొందరపడకూడదని ఆమె అనుభవముమీద తెలుసుకొన్నది. భూతకాలానికీ భవిష్యత్కాలానికీ వారధిగా వుండే సంస్కరణలే వర్తమాన కాలానికి యోగ్యమైనవని భావించింది. పరిస్థితులను చక్కబరచడానికి చేయబడిన సంస్కరణలు ప్రాచీనాచారాలతో సమన్వయింపబడి, భవిష్యత్తులో జరుగబోయేవాటికి నాందిగా ఉండేవే నాలుగు కాలాలపాటు నిలువగలుగుతాయని ఆమె దృఢనమ్మకము.

నిమ్నజాత్యుద్ధరణలో ఎదురయిన సంఘర్షణలు ఆమె ఎదుర్కొనజాలినవే. ఆమె వని అధికముగా బాధించలేదు. కాని ఆమె యుద్ధ ప్రతికూల ప్రచారము చేసినప్పుడు పెద్ద గాలిదుమారము చెలరేగినది.

1914 లో ప్రపంచ యుద్ధము ప్రారంభమైనది. సాంఘిక సమస్యలలో అభిరుచి కలవారు, ప్రపంచ శాంతిని కోరేవారు, సాంఘిక వ్యవస్థలో మార్పును కోరేవారు అందరూ ఏకమయి స్త్రీల శాంతి సంఘాన్ని స్థాపించి, దానికి జేన్ ఏడమ్సును అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నారు. తటస్థ జాతుల ప్రతినిధుల ద్వారా యుద్ధ కారణాల నన్వేషించి మాధ్యస్థ్యము వహించవలెననీ, అన్ని పక్షములవారిని సమాధానపరచటానికి ప్రయత్నించవలెననీ, యుద్ధము నాపుచేయుటకు ప్రయత్నించుటలో అంతర్జాతీయభావాన్ని ప్రచారము చేయవలెననీ ఆ సంస్థద్వారా ఆమె కృషి చేసింది.

1915 లో హేగ్ నగరములో 20 తటస్థ జాతుల పక్షాన ప్రపంచశాంతిని సాధించుటకు కృషి చేయ సంకల్పించి మహిళాసభ జరిపారు. దానికి అధ్యక్షురాలిగా జేన్ ఏడమ్స్ ఎన్నుకొనబడ్డది. ఆ సభలో అనేక విషయాలపైన జరిగిన తీవ్రమైన చర్చలలో స్త్రీలందరు ఒకరినొకరు అర్థము చేసుకొని పాల్గొన్నారు. వారందరి అభిప్రాయాలలో ఐక్యత గోచరించేటట్లు జేన్ చేయ కలిగింది. "మనము కఠినమైన ప్రతిపాదనల నన్నిటిని సరళముగా పరస్పర సానుభూతితో పరిశీలించాము. మన మధ్య ఉన్న సౌభ్రాతృత్వాన్నీ స్నేహాన్నీ నిలుపుకోగలిగాము. మనము సమావేశ మయినప్పటికంటె మరింత సన్నిహితులమై విడిపోతున్నాము" అని ప్రతినిధులతో చెప్పి ఆమె వీడ్కోలిచ్చింది.

1917 లో అమెరికా యుద్ధములోనికి దిగినప్పుడు స్త్రీలు శాంతిస్థాపన కెంతైనా కృషిచేయవలసి ఉన్నదను విశ్వాసము ఆమెకు ప్రబలమయినది. కాని అందరూ యుద్ధములో పాల్గొంటూండగా ఆమె సిద్ధాంతాలను సానుభూతితో ఆలకించే వారెవరు? తోడి సంఘసేవికలందరూ ఆమెను విడనాడి వెళ్ళారు. ఆమెయెడ సంఘములో ద్వేషభావము వృద్ధికావారంభించింది. కాని ఆమెలో మాత్రము ద్వేషభావము అంకురించలేదు. ఆమె ఎవరినీ దూషించి నైతికముగా నీచదశకు రాలేదు. ఈ పరిస్థితులలో కూడా ఆమె ఎదుటివారి అభిప్రాయాన్ని అర్థము చేసుకొని వారి ఉన్నతాదర్శాలను గ్రహించకలిగింది

1918 లో యుద్ధము ముగిసింది. జూరిచ్ (zurich)లో జరిగిన అంతర్జాతీయ మహిళా సభకు ఆమె అధ్యక్షతవహించింది ఆ సమయములోనే ప్యారిస్‌లో సరిహద్దుల కొరకు పురుషులు వాదోపవాదాలు జరుపుకుంటున్నారు కాని స్త్రీలు అంతకంటె లోతుగా ఆలోచింపకలిగారు "యుద్ధములో జయమందినవారు ఓడిపోయినవారిని కొల్లగొట్టి ఉంటారు కదా! అది మరియొక యుద్ధానికి కారణ మవుతుందని" వారు ఊహించారు. క్షుధార్తులకు ఆహార సౌకర్యాలు కల్పించవలెననీ అంతర్జాతీయ మహిళా శాంతి స్వాతంత్ర్య సాధనా సంఘ మొకటి స్థాపించవలెననీ ఆ సభలో స్త్రీలందరు ఏకగ్రీవముగా తీర్మానించారు. జేన్ఏడమ్సు ఆ సభలో 'మనము నైతిక బలము ప్రయోగించటము నేర్చుకోవాలి. మృత్యువు, వినాశము, కష్టములతో బాధపడుతున్న ప్రపంచానికి ఉపశాంతిని చేకూర్చేవాటిలో నైతికబలము ప్రధానమైనది. అది ఒక్కటే ప్రపంచ శాంతిని స్థాపించగలదు" అని ప్రబోధించింది.

ఆమె నైతిక విలువలను గురించి యుద్ధానంతరము ప్రచారము చేసింది. యుద్ధానంతరము పది సంవత్సరాలపాటు ఆమెను లక్ష్యపెట్టినవారు లేరు కాని ఆమె నిరాశతో నిస్పృహతో వెనుకకు మళ్ళిపోలేదు సిద్ధ సంకల్పముతో తన ప్రచారము సాగించింది.


క్రమముగా ఆమె ప్రచారానికి గౌరవము లభించసాగింది వివిధకళాశాలలు విశ్వవిద్యాలయాలు ఆమెకు బిరుదములను ప్రసాదించ నారంభించినాయి. డాక్టరు నికోలస్ ముర్రే బట్లరుతో శాంతికాముకురాలైన జేన్ ఏడమ్స్ నోబెల్ బహుమానములో భాగస్థురాలయినది.

1935 అంతర్జాతీయ మహిళా శాంతి స్వాతంత్ర్య సాధనా సంఘమువారి 15 వ వార్షికోత్సవములో జేన్ ఏడమ్స్ ప్రసంగిస్తూ "మనము మానవులను మార్చలేము కాని వారి ప్రవర్తనలను మార్పు చేయటానికి యత్నించగలము మనది ఆవేశపూరితమైన ఉద్యమము కాదు మనలోని ఓర్పును నైతిక శక్తులను పరీక్షించే ఉద్యమము మన సిద్ధాంతాలను ప్రజలు తెలిసికోవటానికి ఆలస్యము కావచ్చు అయినా మనము నిదానించాలి" అని ప్రబోధించింది.

ఆ వార్షికోత్సవము జరిగిన మూడు వారాలకే ఆమె మరణించింది ఆమెకు అంత్యసంస్కారాలు చర్చిలో చేయబడలేదు. ఆమెకు అత్యంత ప్రియమైన హాల్ భవనములోనే జరుపబడ్డాయి.


ప్రపంచ శాంతికై కృషిచేసి, కొంతవరకూ సఫలీకృత అయిన జేన్ ఏడమ్స్ ఒక వర్గానికీ ఒక మతానికీ చెందిన వ్యక్తి కాదు. ఆమె విశ్వకుటుంబిని. ఆమె కృషిచేసిన రంగము స్త్రీజాతిని సదా ఆహ్వానిస్తూనే ఉంటుంది ★


Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



అలహాబాదులో ఆనందభవన్. దిగువచిత్రం: కమలానెహ్రూ ఆస్పత్రి.

ఫోటోలు ఇ. ఎ. పద్మనాభరెడ్డి—గూడూరు




ఫిబ్రవరి 16 తేదీని
విశాలాంధ్రలో విడుదల
ఆదిత్యుని గమనమును
అంతరిక్షమున అరిగట్టిన సాధ్వి చరిత్ర
ఏ.వి.ఎం వారి
నాగులచవితి
(తెలుగు)
దర్శకత్వము:
చిత్రపు నారాయణమూర్తి బి.ఏ
నాగుబాముల
అపురూప అభినయం
AVM
ప్రొడక్షన్సు